అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

బుధవారం 28-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక






సంపుటి : 10 | సంచిక : 240 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50




# ఎస్సీ గురుకుల విద్యార్థులకు మానసిక ఉల్లాస తరగతులు

- బ్రహ్మకుమారీస్‌తో ఒప్పందం
- అధికారులు, విద్యార్థులతో మెస్ కమిటీ : విలేకర్ల సమావేశంలో సెక్రెటరీ అలుగు వర్షిణి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఎస్సీ గురుకులాల్లోని విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు వీలుగా మానసిక వికాస (సైకాలజీ) క్లాస్‌లు నిర్వహించనున్నట్టు ఎస్సీ గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షిణి చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీఎస్ఎస్ భవన్‌లోని తమ కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సైకాలజీ తరగతులను బోధించేందుకు హైదరాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ సంస్థతో సెప్టెంబర్ రెండున ఒప్పందం చేసుకోబోతున్నామని వెల్లడించారు. గురుకులాల పరిధిలోని విద్యార్థుల్లో ఆందోళన తగ్గించటం, ఆత్మహత్యలను అరికట్టేందుకు వారికి అవగాహన కల్పించడంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒప్పందం అనంతరం సెప్టెంబర్ ఐదు నుంచి అక్టోబర్ 26వరకు ఉపాధ్యాయులకు రంగారెడ్డి జిల్లాతో పాటు, హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీహెచ్ఆర్‌డీ)లో బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఉంటుందని తెలిపారు. బ్యాచ్‌కు 30-40 మంది చొప్పున ఉపాధ్యాయులను విభజించి ట్రైనింగ్ ఇస్తామన్నారు. పిల్లల ప్రవర్తన, వారి మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనావేయటంతో పాటు వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. గురుకులాల్లోని విద్యార్థులకు బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే తరగతులు ప్రతీ 15 రోజులకోసారి, 45 నిమిషాల పాటు క్లాసులు, ఆ తరువాత 15 నిమిషాల పాటు జరిగిన క్లాస్‌పై విద్యార్థులతో చర్చ ఉంటుందని తెలిపారు. 45 నిమిషాల క్లాస్‌లో ప్రధానంగా మెడిటేషన్, మోటివేషన్, ఆందోళన నుంచి బయటపడడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. దీంతోపాటు ఐదో తరగతి విద్యార్థులు మొదటిసారి గురుకులానికి రావటం వల్ల వారు కొంత ఆందోళన చెందుతున్నారనీ, అప్పటివరకు వారి చుట్టూ ఉన్న స్నేహితులు మారటంతో ఒక్కసారిగా ఆ పరిస్థితులను ఆకళింపు చేసుకోలేకపోతున్నారని వివరించారు. అందుకోసమే మొదటిసారి ఐదోతరగతి అడ్మిషన్ పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను కలిసేందుకు వీలైనంతగా అవకాశం కల్పిస్తున్నామనీ, దానివల్ల విద్యార్థి మానసిక పరిస్థితిలోనూ కొంత మార్పు వస్తుందన్నారు. మరోవైపు గురుకులాల్లోని విద్యార్థులకు అందించే భోజనానికి సంబంధించి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రతిరోజూ పిల్లలకు పెట్టే భోజనం ఎలా ఉంటుంది, మెనూ ప్రకారం అందుతుందా? లేదా? అనే వివరాలు తెలుసుకోవటం కోసం అధికారులు, పిల్లలతో 'మెస్ కమిటీ'ని ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రతిరోజూ అందించిన భోజన వివరాలను ఒక డైరీలో నమోదు



చేయటంతో పాటు కమిటీ సభ్యులు ఆ డైరీలో సంతకాలు చేయాల్సి ఉంటుందన్నారు. దాంతో పిల్లలకు అందే భోజనంలో నాణ్యత పెరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లోని గురుకుల విద్యార్థుల్లో రక్తహీనత సమస్య ఉంటుందనీ, అందుకోసం పిల్లల హెల్త్ ప్రొఫైల్‌ను తయారుచేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే)లోని వైద్యులతో మాట్లాడుతున్నామని తెలిపారు. విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ తయారైన తరువాత వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన పోషకాలున్న ఆహారాన్ని అందించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతోపాటు గురుకులాల పరిధిలో ఒక హెల్త్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతుందని వివరించారు. ఇప్పటికే గురుకుల పాఠశాల, హాస్టల్ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని అమలుచేస్తున్నా మని తెలిపారు. వాతావరణ మార్పులు, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అన్ని గురుకులాలకు అవసరమైన సౌకర్యాలను అందిస్తున్నట్టు చెప్పారు. మరోవైపు దాదాపు 230 మంది ఉపాధ్యాయులకు కంప్యూటర్ శిక్షణ ఇప్పించామనీ, వారు విద్యార్థులకు కంప్యూటర్ సహా దానిలో జరిగే ప్రోగ్రామ్‌లపై అవగాహన తరగతులను బోధించనున్నట్టు తెలిపారు. ఎస్సీ గురుకులాల్లోని కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయనీ, వాటి మరమ్మత్తులకు దాదాపు రూ.60కోట్లు ఖర్చు అవుతుందనే అంచనా వేశామని తెలిపారు. ఈ నెల 29న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఇవే అంశాలపై సమీక్ష ఉన్నదనీ, ఆ సమీక్షలో ఎస్సీ గురుకులాల ప్రస్తుత పరిస్థితి, తీసుకోవాల్సిన చర్యలు, డైట్ ఛార్జీలపై చర్చిస్తామని వర్షిణి ఈ సందర్భంగా వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులాలకు సంబంధించి కూడా ఒక ప్రొఫార్మాను ప్రభుత్వానికి అందించామని తలిపారు. గురుకులంలో చేపట్టిన పదోన్నతులు, బదిలీల్లో 89చోట్ల సమస్యలు ఉత్పన్నమయ్యాయని వివరించారు. వాటిని పరిష్కరించనున్నట్టు ఆమె తెలిపారు.

## హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి

- ఉచిత చేపపిల్లల సరఫరాలో టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలి: తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని సంఘం ఉపాధ్యక్షులు శీలం శీను అధ్యక్షతన నిర్వహించారు. టెండర్ల ప్రక్రియను రద్దు చేసి మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 20 ఏండ్ల కాలంలో సుమారు మూడువేల చెరువులు, కుంటలను రాజకీయ బ్రోకర్లు, రియల్ ఎస్టేట్ మాఫియా కబ్జాలు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరుతో చేస్తున్న చర్యలను తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం అభినందిస్తుందని తెలిపారు. ఆగస్టు పూర్తవుతున్న నేపథ్యంలో మూడంగుళాల నాణ్యమైన చేప పిల్లలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. చేప విత్తనాల చెరువును డ్రాగ్ చేయటం, ట్రైమ్ స్కేల్ యాప్ ద్వారా వీడియోగ్రఫీ చేసి ఇన్‌స్పెక్షన్ రిపోర్టుతో పాటు సబ్‌మిట్ చేస్తూ నిజమైన బిడ్డర్‌ను ఎంపిక చేయటం ద్వారా చేపపిల్లలు సరఫరా చేయడంలో అవకతవకలు నిర్మూలించ వచ్చుని పేర్కొన్నారు. పదేండ్ల కాలంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## ఆయుష్ శాఖ నోటిఫికేషన్ పై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ :** ఆయుర్వేద, సిద్ధ, యునాని ఔషధాలకు సంబంధించి తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటనలను నిషేధిస్తున్న డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ రూల్స్, 1945లోని 170వ రూల్‌ను తొలగిస్తూ ఆయుష్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌పై సుప్రీం కోర్టు మంగళవారం స్టే విధించింది. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన సమాచారం మే 7, 2024 నాటి ఉత్తర్వుల్లో వున్నాయని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ తెలిపింది. తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటనలపై సుప్రీం కోర్టు ఈ ఏడాది మే 24 నిషేధం విధిస్తూ, ఒక వాణిజ్య ప్రకటనను జారీ చేసేందుకు అనుమతించడానికి ముందుగా కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ రూల్స్, 1994 ప్రకారం అడ్వర్టయిజర్ల నుండి సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది.

ఆగస్టు 29, 2023 నాటి లేఖను ఉపసంహరించుకోవడానికి బదులుగా జులై 1వ తేదీన 170వ నెంబరు రూల్‌ను తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారని, అది, ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా వుందని బెంచ్ పేర్కొంది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ నోటిఫికేషన్ అమలుపై స్టే విధించామని బెంచ్ తెలిపింది.

కాగా కేంద్రం వైఖరిని వివరిస్తూ త్వరలో అఫిడవిట్‌ను దాఖలు చేయనున్నట్లు కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ తెలిపారు.

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ రూల్స్, 1945లో 170వ నిబంధనను ఉల్లంఘించే ఏ సంస్థపైనా చర్యలు తీసుకోరాదని అధికారులను కోరుతూ రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు 2023 ఆగస్టు 29న కేంద్రం లేఖ రాసింది. ఆ లేఖపై సుప్రీం కోర్టు గత మేలో కేంద్రాన్ని ప్రశ్నించింది.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

బుధవారం 28-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 240 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50




# 17 SEPTEMBER నుంచి ప్రజా పాలన

## రేషన్, హెల్త్ కార్డుల జారీకి కార్యాచరణ : సీఎం రేవంత్ వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ

### ఆరోగ్యంతో చెలగాటమాడితే ఇంటికే
### సమీక్షా సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి హెచ్చరిక

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి 26 వరకు పది రోజుల పాటు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అన్ని గ్రామాలు, వార్డుల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈసారి ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. "హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి? ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి? గ్రామాల్లోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలా? రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా? తదితర పూర్తి వివరాలను పరిశీలించి వెంటనే నిర్ణయం తీసుకోండి" అని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఉత్తమమైన విధానాన్ని అనుసరిస్తున్నారని ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారనీ, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్‌కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు. ఈ సారి రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదనీ, వేర్వేరుగా జారీ చేస్తామని తెలిపారు.. డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు మొదటిసారి నిర్వహించిన ప్రజాపాలనలో ఆరు గ్యారంటీ పథకాల కోసం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 1,25,84,383 దరఖాస్తుల ను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి**

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులపై

...15లో

# కవితకు బెయిల్

## షరతులతో విడుదలకు అనుమతి



ఈడీ, సీబీఐ కేసుల్లో రూ. 10 లక్షల చొప్పున డిపాజిట్

పాస్ పోర్టును ట్రయల్ కోర్టులో అందజేయాలని ఆదేశం

మహిళగా కవితకు బెయిల్ ఇస్తున్నట్టు సుప్రీం వెల్లడి 7లో..

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సర్వోన్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# వాయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించండి

## ప్రధాని మోడీకి కేరళ సీఎం పినరయి విజయన్ వినతి



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

కొండచరియలు విరిగిపడి చిన్నాభిన్నమైన వయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించా లని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ...15లో

# గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆస్పత్రి

## 32 ఎకరాల్లో నిర్మించేందుకు నిర్ణయం

రాబోయే 50 ఏండ్ల అవసరాలకు తగ్గట్టు డిజైన్లు 6లో..

22 జిల్లాల్లో సమాఖ్య భవనాలకు ఎకరం చొప్పున కేటాయింపు

వచ్చే ఏడాదిలోపు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీలకు నూతన భవనాలు

స్పీడ్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# నేడు తెలంగాణ తల్లి విగ్రహానికి భూమి పూజ

## మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు బుధవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూమి పూజ చేయనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయ ప్రాంగణంలో ఇప్పటికే సీఎం చూసిన ప్రదేశంలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

# కాళేశ్వరం డిజైన్లల్లో మార్పులు జరిగాయా ?

## ఇంజినీర్లను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్



పొంతనలేని సమాధానాలపై చైర్మెన్ ఆగ్రహం

అఫిడవిట్ సమర్పించిన వి.ప్రకాష్

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ నీటిపారుదల శాఖ ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చైర్మెన్ పీసీ ఘోష్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పకపోవడం, నీళ్ల ...15లో



6లో..

## నైతిక బాధ్యత వహిస్తూ అమ్మకు మోహన్‌లాల్ రాజీనామా



7లో..

## కుల్గామ్‌లో సీపీఐ(ఎం) నేత తరిగామి నామినేషన్

## జన్వాడ ఫామ్‌హౌస్‌పై హైడ్రా !

బుల్కాపూర్ నాలా నుంచి.. కొలతలు తీసుకున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు 5లో..

## క్రీడలతో జీవితానికి మేలు

### ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

క్రీడలతో జీవితానికి చాలా మేలు జరుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచంలో క్రీడా పోటీల్లో తెలంగాణ ప్రాతినిధ్యానికి, బంగారు పతకాలు సాధించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ...15లో

## మట్టి విగ్రహాల ఏర్పాటుపై అవగాహన

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

నగరంలో రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి :

సన్నాహక సమావేశంలో 5లో..

మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

# రుణమాఫీపై రైతుల రణం

## తెలంగాణ రైతుసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలు

- ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల అడ్డగింత
- రూ.2 లక్షల లోపుంటే కార్డులేకున్నా రుణమాఫీ : మంత్రి
- రూ.2 లక్షల పైబడిన వారికోసం ప్రత్యేక షెడ్యూల్
- ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు



రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు**

ఆంక్షలు లేకుండా.. హామీ ఇచ్చినట్టుగా రైతులందర్నీ రుణవిముక్తులను చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో రుణమాఫీపై రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మంగళవారం నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఖమ్మంలో రైతులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. సుమారు రెండు గంటల పాటు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అప్పటికే కలెక్టరేట్‌లో ఉన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బయటకు వస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోతినేని, బాగం మాట్లాడుతూ.. రూ.2 లక్షల రుణమాఫీ అనేది సాహెూసోపేతమైనదేనని, దాన్ని తాము స్వాగతించామన్నారు. తొలుత ప్రతి రైతుకూ రూ.2లక్షలు అని చెప్పిన ప్రభుత్వం తర్వాత రైతు కుటుంబానికి అని మాట మార్చిందని, అది కూడా అందరికీ మాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567లో అనేక నిబంధనలు విధించడం వల్ల రైతులు రుణమాఫీ పొందలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా జమ చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఎన్నికల సమయంలో ఏక కాలంలో రూ.2 లక్షలు మాఫీ చేస్తామని ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. రుణమాఫీ 40శాతం కూడా పూర్తి ...15లో

## సెప్టెంబర్ మొదటి వారంలో డీఎస్సీ ఫలితాలు

### ఆ తర్వాత మెరిట్ జాబితా విడుదల

తుది కీపై విద్యాశాఖ కసరత్తు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలకు సంబంధించిన తుది కీ విడుదలపై విద్యాశాఖ అధికారుల కసరత్తు వేగవంతమైంది. డీఎస్సీ ప్రశ్నాపత్రాలకు సంబంధించి ప్రాథమిక కీపై 28 వేలకుపైగా అభ్యంతరాలు వచ్చిన విషయం తెలిసిందే. వాటిని సబ్జెక్టు నిపుణులు పరిశీలిస్తున్నారు. ఈనెలాఖరులోగా ప్రశ్నాపత్రాల్లో ఉండే తప్పులపై ...15లో

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

## విషజ్వరాల నుంచి ప్రజల ఆరోగ్యాలను రక్షించండి :

రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్‌లోని ఎస్వీకే వద్ద నిరసన



హైదరాబాద్‌లో ప్రదర్శన వ్యకాస నేతలు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక జిల్లాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నా వాటి నివారణకు చర్యలు చేపట్టడంలో సర్కారు విఫలమైందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలోని మెయిన్‌రోడ్డుపై ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెండు, మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల మూలంగా ప్రజలు టైఫాయిడ్, చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు, డాక్టర్లు, సిబ్బంది, కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ ఒకరు జ్వరంతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాలు, అంటు వ్యాధుల బారి నుండి ప్రజారోగ్యాన్ని ...15లో



# నేతల మధ్య లొల్లి



## కవిత బెయిల్‌పై పరస్పర విమర్శలు

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల వాదోపవాదాలు

కేటీఆర్ వర్సెస్ కేంద్ర మంత్రి బండి సంజయ్

బెయిల్‌పై కవిత బయటకు..కాంగ్రెస్ నేత రాజ్యసభలోకి : బండి

క్విడ్ ప్రోకో నేరంలో భాగస్వామ్యులకు అభినందనలు అంటూ వ్యాఖ్య

బండిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు కేటీఆర్ విజ్ఞప్తి

బండికి మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యేల కామెంట్లు..బీజేపీ, బీఆర్ఎస్ మైత్రి వల్లనే బెయిల్ సాధ్యమైందంటున్న కాంగ్రెస్ నేతలు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సుదీర్ఘకాలంగా జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు మంగళవారం బెయిల్ ప్రకటించింది. ఆమె బెయిల్‌పై రాష్ట్రంలో పొలిటికల్ లొల్లి మొదలైంది. ఇటు కేంద్ర మంత్రి బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు..బండిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదుకు ఆదేశించాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు(కేటీఆర్) విజ్ఞప్తి.. బీజేపీ అధిష్టానం వద్ద బీఆర్ఎస్ సాగిలపడటం వల్లే బెయిల్ సాధ్యమైందంటూ కాంగ్రెస్ నేతల విమర్శలతో రాష్ట్ర రాజకీయాల్లో వేడి పుట్టింది. బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే..కాదు కాదు.. కాంగ్రెస్-బీఆర్ఎస్ ఒక్కటే..అంటూ మూడు పార్టీల నేతల మధ్య పరస్పర విమర్శలకు దిగడం చర్చనీయాంశమైంది. 'కాంగ్రెస్‌పార్టీకి, వారి లాయర్లకు కంగ్రాట్స్. ప్రసిద్ధ మద్యం కుంభకోణం లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇప్పించడం లో విజయం సాధించినందుకు అభినందనలు. మీ అవిశ్రాంత కృషి చివరకు ఫలించింది. ఈ బెయిల్ కాంగ్రెస్, బీఆర్ఎస్ సమిష్టి విజయం. బీఆర్ఎస్ నేత బెయిల్‌పై బయటకు వచ్చారు. కాంగ్రెస్ నాయకుడు రాజ్యసభలోకి వెళ్తున్నారు. కేసీఆర్ రాజకీయ చతురతకు హ్యాట్సాఫ్. బెయిల్ కోసం వాదించిన అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు ఇవ్వడం..అధికార కాంగ్రెస్ ఏకపక్షంగా రాజ్యసభకు నామినేట్ చేయడం..ఈక్విడ్ ప్రోకో నేరంలో పాలుపంచుకున్న భాగస్వామ్యులకు అభినందనలు. విలీనం మాట ముచ్చట పూర్తయింది. ఇక అప్పగింతలే తరువాయి' అంటూ కవితకు సుప్రీం కోర్టు బెయిలివ్వడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ట్వీట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బండి వ్యాఖ్యలను కప్పిపుచ్చేందుకు 'కేటీఆర్ చదువుకున్న అజ్ఞాని. సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్‌ను బండి సంజయ్ వ్యతిరేకించలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని బహిర్గతం చేశారు' అంటూ బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాజాసింగ్ ఆయనకు వంత పాడారు.

**బండి వ్యాఖ్యలకు కేటీఆర్ ఖండన**

ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయటాన్ని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ ...5లో

సంపాదకీయం

# కరి మింగిన వెలగపండే 'యూపీఎస్'

మసిపూసి మారేడుకాయ చేయడంలో మోడీకి మించిన వారు లేరని పదేండ్ల నుండి రుజువవుతూనే ఉంది. ఇందుకు మరో తాజా ఉదాహరణే సోమనాథన్ కమిటీ సిఫార్సు చేసిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్). చూడటానికి నున్నగా కనిపిస్తున్నా కరిమింగిన వెలగపండు చందమే ఈ స్కీమ్. ముప్పై ఏండ్లు వివిధ ప్రభుత్వ విభాగాల్లో సేవలందించి, పదవీ విరమణ తర్వాత వారి జీవితానికి, కుటుంబానికి ఓ భరోసానే పెన్షన్. ఈ పెన్షన్ పొందడం వారి హక్కే కానీ, భిక్ష కాదని సుప్రీంకోర్టు ఏనాడో తేల్చి చెప్పింది. అన్నీ ఇస్తామంటూనే ఉద్యోగి నుండి వాటా అడుగుతున్నారు. అందుకే ఈ ఏకీకృత పెన్షన్ పథకాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ విధానంలోని అనేక అంశాల్లో అసలు స్పష్టతే లేదు. ఉద్యోగుల భాగస్వామ్య వాటా ఎందుకు? ఈ స్కీం భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు సృష్టించడం ఖాయం.

త్వరలో జమ్ముకాశ్మీర్, హర్యానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత కీలకమైన మహారాష్ట్ర, జార్ఖండ్, బీహార్‌లలో వరుసగా ఎన్నికలున్నాయి. ఎన్నికల్లో ప్రధాన అంశంగా పాత పెన్షన్ పునరుద్ధరణను కాంగ్రెస్ ఎంచుకున్నది. అందుకే బీజేపీ ఈ స్కీమును హడావిడిగా ఆమోదించింది. ఈ స్కీమును జాతీయ ట్రేడ్ యూనియన్లలో బిఎంఎస్ తప్ప మిగిలిన అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చిఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంస్థ 'ది నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్' ఈ పాటికే ప్రకటించింది.

వాస్తవానికి 2004 ముందు వరకు ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం) అమల్లో ఉండేది. దీన్ని త్రిబుల్ బెన్‌ఫిట్స్ సిస్టమ్ అనేవారు. అంటే కచ్చితమైన పెన్షన్, పీఎఫ్, గ్రాడ్యూటీ.. ఈ మూడూ పదవీ విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి వర్తించేవి. ఉద్యోగుల నుండి ఒక్క రూపాయి కూడా తీసుకునేవారు కాదు. అయితే ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు వాజ్‌పేయి నాయకత్వంలోని అప్పటి ఎన్డీయే ప్రభుత్వం జవనరి, 2004 నుంచి జాతీయ పెన్షన్ విధానం తీసుకొచ్చింది. ఈ విధానం తర్వాత సర్వీస్‌లో ఉన్నప్పుడే పెన్షన్ ఫండ్ కోసం ఉద్యోగి నుండి పది శాతం, యాజమాన్యం నుండి పది శాతం తీసుకొని షేర్‌మార్కెట్లో పెట్టడం మొదలుపెట్టారు. మార్కెట్ హెచ్చు తగ్గులను బట్టి ఉద్యోగి రిటైర్ అయినపుడు, చనిపోయినపుడు ఎంత అయితే అతని అకౌంట్లో ఉంటుందో అందులో అరవై శాతం చేతికిస్తారు. మిగిలింది మ్యూచ్‌వల్ ఫండ్స్ వలె కొనుక్కోవాలి. అయితే ఇందులో పెన్షన్ ఎంత వస్తుందో స్పష్టత ఉండదు. మార్కెట్‌ను బట్టి మారిపోతూ ఉంటుంది. 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారందరికీ ఈ విధానం అమల్లో ఉంది.




ఈ విధానానికి వ్యతిరేకంగా ఓపీఎస్ అమలు చేయాలని ఏండ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తలొగ్గి 2023, మార్చిలో బీజేపీ ప్రభుత్వం సోమనాథన్ కమిటీని నియమించింది. ఏడాది తర్వాత దీని సిఫారసుల మేరకు యూనిఫైడ్ పెన్షన్స్ స్కీంను 2024 ఆగస్టు 24న కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. దీని ప్రకారం పెన్షన్ కమ్యూటేషన్, కనీసం ఐదేండ్లకు ఓసారి పెన్షన్ సవరణ, టాక్స్ బెనిఫిట్స్, 70 ఏండ్ల పైబడిన వారికి అదనపు పెన్షన్ అంటూ అనేక అంశాలు వివరించారు. షేర్‌మార్కెట్‌పై ఆధారపడకుండా ఫిక్స్‌డ్‌గా కొంత పెన్షన్ కూడా ఇస్తామంటున్నారు.

ఇవన్నీ వినడానికి పాత పెన్షన్ వలె పైకి కనబడుతున్నా ఉద్యోగి భాగస్వామ్యం మాత్రం అలాగే కొనసాగుతుంది. అలాగే ఓపీఎస్ కింద ఇరవైయేండ్ల సర్వీసుంటే పూర్తి పెన్షన్ వచ్చేది. యూపీఎస్‌లో దాన్ని పాతికేండ్లు చేశారు. దీనివల్ల పెన్షన్‌కు అర్హత పొందే వారి సంఖ్యే తగ్గిపోయే అవకాముంది. పైగా ఉద్యోగి సర్వీస్‌లో ఉన్నన్ని రోజులు పెన్షన్ ఫండ్ మొత్తం షేర్‌మార్కెట్లోనే పెడతారు. అంటే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం షేర్ మార్కెట్‌కు నిధులు సమకూర్చటమే. ఈ పథ కంలో భాగంగా ప్రభుత్వం తన వాటాను మరో నాలుగున్నర శాతం పెంచింది. జూలై 31 నాటికి ఎన్‌పీఎస్ కింద ఉన్న 99,77,165 మంది ఉద్యోగులకు చెందిన రూ.10,53,850 కోట్ల పెన్షన్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందనేది స్పష్టం. ప్రభుత్వానికి ఉద్యోగుల బాగుకన్నా కార్పొరేట్ల అవసరాలే ముఖ్యమని దీన్ని బట్టి అర్థమవుతోంది. ఈ విధానంలో చెప్పిన పదవీ విరమణ సమయంలో చెల్లించే మొత్తం, అదనపు పెన్షన్, ఆరోగ్య కార్డులు, భవిష్యత్తులో సవరణలు, పన్ను ప్రయోజనాలు వంటి అంశాలపై అసలు స్పష్టతే లేదు.

త్వరలో జమ్ముకాశ్మీర్, హర్యానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత కీలకమైన మహారాష్ట్ర, జార్ఖండ్, బీహార్‌లలో వరుసగా ఎన్నికలున్నాయి. ఎన్నికల్లో ప్రధాన అంశంగా పాత పెన్షన్ పునరుద్ధరణను కాంగ్రెస్ ఎంచుకున్నది. అందుకే బీజేపీ ఈ స్కీమును హడావిడిగా ఆమోదించింది. ఈ స్కీమును జాతీయ ట్రేడ్ యూనియన్లలో బిఎంఎస్ తప్ప మిగిలిన అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంస్థ 'ది నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్' ఈ పాటికే ప్రకటించింది. ఏది ఏమైనా ఈ పెన్షన్ పథకం ఉద్యోగులను ఏమారుస్తోందనేది స్పష్టం. ఇలాంటి మసిపూసి మారేడుకాయ చేసే పనులకు కేంద్రం పూనుకోవడం మానాలి. ఉద్యోగులు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు పాత పెన్షన్ విధానం కోసం తమ ఉద్యమాన్ని కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి-పెరిగిన ఉద్రిక్తతలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

మధ్య ప్రాచ్యంలో ఏం జరుగుతోంది? ఏ క్షణంలోనైనా ప్రాంతీయ యుద్ధం జరగనుందా ? ఇప్పటికే సూయజ్ కాలువగుండా జరుగుతున్న రవాణాకు ఆటంకం కలుగుతూ పడుతున్న ఇబ్బందులు మరింతగా పెరుగుతాయా ? గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలను చూసినపుడు సామాన్యులకు తలెత్తుతున్న సందేహాలివి. హమాస్ సాయుధులను అణచివేస్తామంటూ ప్రగల్భాలు పలికిన ఇజ్రాయిల్ అక్టోబరు ఏడు నుంచి ఇంతవరకు ఆ పనిచేయలేక పోయింది. కుట్రలు, దొంగదెబ్బలతో విదేశాల్లో హమాస్ నేతలను హతమారుస్తున్నది. దానికి ప్రతీకారంగానే తాజాగా జరుగుతున్న పరిణామాలు. ఒక సరిహద్దులో ఉన్న లెబనాన్‌లో కేంద్రీకరించిన హిజబుల్లా సాయుధులు తమ మీద దాడి చేసే అవకాశాన్ని పసిగట్టి వంద విమానాలతో వారి 40 స్థావరాల మీద తామే ముందుగా ఆదివారం నాడు దాడి చేసినట్లు ఇజ్రాయిల్ చెప్పుకుంది.ఆదివారం నాడు 30 గ్రామాలు, పట్టణాల మీద ఇజ్రాయిల్ వంద విమానాలతో దాడి చేసింది.దానికి ప్రతిగా తాము ఇజ్రాయిల్‌లోని 11 మిలిటరీ స్థావరాల మీద 340 రాకెట్లను ప్రయోగించామని హిజ బుల్ ప్రకటించింది. ఆ సంస్థ ప్రతినిధి నసరల్లా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాము బలమైన మిలటరీ అని, తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. దీని అర్థం రానున్న రోజుల్లో దాడులు జరగవని కాదని విశ్లేషకులు చెబుతున్నారు.మరోవైపు గాజాలో ఇజ్రాయిల్ దాడులను మరింత తీవ్రం కావించింది. అల్ అక్సా ఆసుపత్రిలో ఉన్న రోగులను నిర్దాక్షిణ్యంగా బయటకు నెట్టి, దానిమీద దాడి చేసింది. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఐరాస సిబ్బంది పని చేసే అవకాశాలు లేకుడా దాడులు జరుపుతున్నది. ఈ దుర్మార్గాన్ని వ్యతిరేకిస్తున్న ఎమెన్‌లోని హౌతీ సాయుధులు కూడా దాడులకు దిగటంతో ఇజ్రాయిల్ మరింతగా మారణకాండ సాగిస్తున్నది. హిజబుల్లా దాడిలో జరిగిన నష్టాన్ని ఇజ్రాయిల్ వెల్లడి కాకుండా చూస్తున్నది. ఇరాన్ నేరుగా పోరుకు దిగకుండా తన మద్దతుదార్లకు అవసరమైన ఆయుధాలను సరఫరా చేస్తున్నది. తాము పూర్తి స్థాయి దాడులకు దిగటం లేదని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి కట్జ్ ప్రకటించారు. తమ పౌరులను రక్షించుకోవటానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పుకున్నారు. ఇదే సమయంలో హిజబుల్లా కూడా దాడులను కొనసాగించటం లేదు. రెండు వైపులా లక్షా 60వేల మందిని అటూ ఇటూ వేరే ప్రాంతాలకు తరలించినట్లు ప్రధాని నెతన్యాహు ప్రకటించారు.

ఒక వైపు గాజాలో దాడుల విరమణ గురించి కైరోలో చర్చలు జరుగుతుండగా తమ మీద దాడులు జరపాలని హిజబుల్లా తలపెట్టిందనే సాకుతో ఇజ్రాయిల్ దాడులు జరపటం చర్చలను దెబ్బతీయటం తప్ప మరొకటి కాదు. శాంతి చర్చల కారణంగా చాలా రోజులుగా తాము ప్రతీకారదాడికి దిగలేదని అయితే, ఇజ్రాయిల్ తెగబడినందున తాము స్పందించామని, ప్రతి దాడి ముగిసిందని హిజబుల్లా ప్రకటించగా ఇజ్రాయిల్ సోమవారం నాడు కూడా లెబనాన్ మీద దాడులు చేసింది. తమ గడ్డ మీద హమాస్ నేత హత్యకు ప్రతికారం తీర్చుకుంటామని ఇరాన్ మరోసారి హెచ్చరించింది. ప్రస్తుతానికి పూర్తి స్థాయి యుద్ధం లేకున్నప్పటికీ ఎప్పుడేం జరుగుతుందో తెలియని స్థితి ఉంది. హిజబుల్లా దాడిలో తాము పెద్దగా నష్టపోలేదని, తమ మిలిటరీ స్థావరాలకు ఎలాంటి హాని జరగలేదని ఇజ్రాయిల్ చెప్పుకుంది. గతేడాది అక్టోబరు 8 నుంచి ఇప్పటి వరకు లెబనాన్‌పై అది జరిపిన దాడుల్లో వంద మంది 566 మంది మరణించగా వారిలో సాధారణ పౌరులు 133 మంది, మిగిలిన వారు సాయుధులు మరణించినట్లు అంచనా. హిజబుల్లా దాడుల్లో 23 మంది యూదు సైనికులు, 26 మంది పౌరులు మరణించినట్లు వార్తలొచ్చాయి. రెండువైపులా లక్షలాది మంది జనం నివాసాలను వీడాల్సి వచ్చింది. ఇజ్రాయిల్ వద్ద అపార ఆయుధ సంపద ఉంది, ఎప్పటికప్పుడు అమెరికా, ఇతర దేశాలు కొత్తగా అందిస్తున్నాయి. అయితే హిజబుల్లా వద్ద అంత పెద్ద మొత్తంలో లేకున్నా ఇజ్రాయిల్‌లోని అన్ని ప్రాంతాల మీద దాడులు చేసేందుకు అవసరమైన రాకెట్లు ఉన్నట్లు అంచనా. లక్షా 20వేల నుంచి రెండు లక్షల వరకు ఉంటాయని, అక్టోబరు ఎనిమిది నుంచి ఇప్పటి వరకు ఎనిమిది వేలు ప్రయోగించినట్లు సమాచారం. ఆధునిక డ్రోన్లతో పాటు నిర్ణీత లక్ష్యాలను తాకే క్షిపణులు కూడా ఉన్నాయి. ఒక వేళ యుద్ధమే ప్రబలితే రెండు వైపులా నష్టాలు తీవ్రంగా ఉంటాయి.2006లో జరిగిన నెల రోజుల పోరులో దక్షిణ లెబనాన్, రాజధాని దక్షిణ ప్రాంతాలు దెబ్బతిన్నాయి. రెండు వైపులా ప్రాణనష్టం జరిగింది. లెబనాన్ నాశనం కాగా ఇజ్రాయిల్ ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. అప్పటి నుంచి హిజబుల్లాను తుడిచిపె ట్టాలని చూస్తున్నా సాధ్యం కావటం లేదు.

గత పది నెలలుగా ఇజ్రాయిల్, అమెరికా లక్ష్యాలుగా సిరియా, ఇరాక్, ఎమెన్‌లలో ఉన్న సాయుధ గ్రూపులు దాడులు చేస్తున్నాయి. వాటికి ఇరాన్ మద్దతు బహిరంగ రహస్యమే. ఒక వేళ ఇరానే ప్రత్యక్షంగా దాడులకు దిగవచ్చనే అంచనాతో ఇటీవల పెద్ద ఎత్తున తమ నౌకా, వైమానిక దళాలను మధ్య ప్రాచ్యానికి అమెరికా తరలించింది. విమాన వాహక యుద్ధనౌకలు కూడా వాటిలో ఉన్నాయి. ఇజ్రాయిల్ మీద ప్రయోగిస్తున్న డ్రోన్లు, క్షిపణులను మధ్యలోనే కూల్చివేసే రక్షణ వ్యవస్థలను అమెరికా అందచేసింది.దాన్నే ఇనుప కప్పుగా పిలుస్తున్నారు. లెబనాన్‌తో ఉన్న సరిహద్దులో పరిస్థితి ఇలాగే ఉంటుందనే నమ్మకం లేదని ఇజ్రాయిల్ అంటున్నది. ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించిన తమ పౌరులు డిసెంబరు 31వరకు తిరిగి రావద్దని కోరటాన్ని బట్టి అది ఎంతగా భయపడుతున్నదో అర్థం అవుతోంది.వచ్చే నెలలో పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఈ ప్రకటన చేసింది. గాజాపై తాను జరుపుతున్న దాడులను అప్పటి వరకు విరమించేది లేదన్న సంకేతం కూడా దీనిలో ఉంది. అందువలన రానున్న రోజుల్లో మరిన్ని దాడులకు తెగబడే అవకాశం ఉంది.



గత పది నెలలుగా ఇజ్రాయిల్, అమెరికా లక్ష్యాలుగా సిరియా, ఇరాక్, ఎమెన్‌లలో ఉన్న సాయుధ గ్రూపులు దాడులు చేస్తున్నాయి. వాటికి ఇరాన్ మద్దతు బహిరంగ రహస్యమే. ఒక వేళ ఇరానే ప్రత్యక్షంగా దాడులకు దిగవచ్చనే అంచనాతో ఇటీవల పెద్ద ఎత్తున తమ నౌకా, వైమానిక దళాలను మధ్య ప్రాచ్యానికి అమెరికా తరలించింది. విమాన వాహక యుద్ధనౌకలు కూడా వాటిలో ఉన్నాయి. ఇజ్రాయిల్ మీద ప్రయోగిస్తున్న డ్రోన్లు, క్షిపణులను మధ్యలోనే కూల్చివేసే రక్షణ వ్యవస్థలను అమెరికా అందచేసింది.దాన్నే ఇనుప కప్పుగా పిలుస్తున్నారు. లెబనాన్‌తో ఉన్న సరిహద్దులో పరిస్థితి ఇలాగే ఉంటుందనే నమ్మకం లేదని ఇజ్రాయిల్ అంటున్నది. ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించిన తమ పౌరులు డిసెంబరు 31వరకు తిరిగి రావద్దని కోరటాన్ని బట్టి అది ఎంతగా భయపడుతున్నదో అర్థం అవుతోంది.

గాజాలో హమాస్ ఉనికి లేకుండా చేయాలని, తిరిగి అది తలెత్తకుండా ఉండాలంటే సాధారణ పరిస్థితి ఏర్పడిన తరువాత కూడా తమ మిలిటరీని అక్కడ అనుమతించాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేస్తున్నది, దీని అర్థం హమాస్ ఆత్మహత్య చేసుకోవాలని అనటమే అని, దానికి ఏ మాత్రం అంగీకరించే అవకాశం లేదని పరిశీలకులు చెబుతున్నారు. గాజాలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే అక్కడ ఉన్న ఆరున్నరలక్షల మంది పిల్లలకు పోలియో వాక్సిన్ వచ్చినప్పటికీ దాన్ని వేసేందుకు ఇజ్రాయిల్ అనుమతించటం లేదు.ఐరాస సిబ్బందిని కూడా వదలకుండా దాడులు చేస్తున్నది. కాల్పుల విరమణ జరగకుండా వాక్సిన్లు వేసే అవకాశాలు లేవు. గాజాలో తొలిసారిగా పాతిక సంవత్సరాల తరువాత తొలి పోలియో కేసు నమోదైంది. మురుగునీటిని పరీక్షించినపుడు వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.పిల్లల్లో 95శాతం మందికి వాక్సిన్ అవసరమని యూనిసెఫ్ ప్రకటించింది.దాడులు ఆగకపోతే వాక్సిన్ వేయటం కష్టమని స్పష్టం చేసింది.పారిశుధ్య పరిస్థితి దిగజారటంతో పాటు మంచినీటి సరఫరాకూ ఆటంకం కలుగుతోంది. దీంతో ఇతర వ్యాధులు కూడా ప్రబలుతున్నాయి. ఆకలి మంటలు, అనాధలుగా రోడ్ల పాలుకావటం సరేసరి.

ఇప్పటివరకు జరిగిన పరిణామాలను చూస్తే దౌత్యఎత్తుగడల పేరుతో అమెరికా ఆడిన నాటకాన్ని యావత్ ప్రపంచ ప్రజానీకం గ్రహిస్తు న్నది. తాను మధ్యవర్తిని అని చెప్పుకుంటూనే 1990 దశకపు ఓస్లో ఒప్పందాల నుంచి నేటి వరకు అనుసరించిన వైఖరి ఎలాంటి ఫలితాలను ఇవ్వలేదు. ప్రధాన కారణం ఒక వైపు ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తూ భద్రతా మండలిలో దానికి వ్యతిరేకంగా వచ్చిన అన్ని తీర్మానాలను అడ్డుకోవ టమే. పది నెలలుగా గాజా మారణకాండ సాగుతున్నప్పటికీ దాన్ని ఆపలేకపో యింది. ఇరాన్, లెబనాన్లలో హమాస్ అగ్రనేతల హత్య అమెరికాకు తెలియకుండా జరిగే అవకాశమే లేదు. నవంబరు ఐదున జరిగే ఎన్నికల్లో ప్రతి అంశాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని అటు డెమోక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు ప్రయత్నిస్తున్నారు. ఏ పరిష్కారం జరిగినా అది తమకు అనుకూలంగా ఉండాలని జోబైడెన్ భావిస్తున్నాడు. ఇజ్రాయిల్ ఓడిపోయినట్లు లేదా వెనక్కు తగ్గిందనే భావనకు వీలులేకుండా చూడాలని చూస్తే కుదరటం లేదు. అదే సమయంలో ఎన్నికల రోజు దగ్గరపడేలోగా ఏదో ఒక పరిష్కారం కుదిరితే తమ విజయంగా చెప్పుకోవాలని కూడా బైడెన్ చూస్తున్నాడు. మధ్య ప్రాచ్య యుద్ధం జరగాలని కోరుకుంటున్న అమెరికా వలలో పడేందుకు ఇరాన్ సిద్ధంగా లేదు.ఎంతగా రెచ్చగొడుతున్నప్పటికీ ఆచితూచి వ్యవహరిస్తున్నది. ఉప్పునిప్పు మాదిరి సంబంధాలున్న స్థితిలో చైనా మధ్యవర్తిత్వంలో సౌదీతో అది సయోధ్య కుదుర్చుకోవటాన్ని అమెరికా ఊహించలేదనే చెప్పాలి. ఒకవైపు తమ మద్దతుతో గాజాలో మారణకాండ సాగుతుండగా మానవత్వం గురించి కబుర్లు చెబుతున్న అమెరికా బండారం మరింతగా బయటపడుతున్నది.

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ కొద్ది రోజుల క్రితం తమ ప్రతిపాదనను ఇజ్రాయిల్ అంగీకరించిందని ప్రకటించారు. అయితే కొద్ది గంటల్లోనే అలాంటిదేమీ లేదని ప్రధాని నెతన్యాహు ప్రకటించి గాలి తీశారు. ఒప్పందానికి ప్రధాని సుముఖంగా లేనందున శాంతి చర్చల్లో తమ ప్రతినిధి పాల్గొనే అవకాశం లేదని కూడా ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. దీంతో ఒప్పందాన్ని నెతన్యాహు అడ్డుకుంటున్నట్లు రెండుదేశాల అధికారులు లీకులు వదిలారు.గడచిన పదినెలల్లో ఏడుసార్లు ఆంటోని బ్లింకెన్ ఇజ్రాయిల్ పర్యటన జరిపారు. శాంతి చర్చలకు ఎప్పటికప్పుడు నెతన్యాహు కొత్త షరతులను జోడిస్తున్నారు. అమెరికా అతగాడికి వంతపాడుతూ వివాదాన్ని కొనసాగిస్తున్న దని కొందరు విమర్శి స్తున్నారు. మధ్యవర్తిగా ఉంటూ ఇలాంటి పని చేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు తాము పోరాటం కొనసాగిస్తూనే శాంతి చర్చలకు కూడా సిద్ధమని హమాస్ ప్రకటించింది.చైనా మధ్యవర్తిత్వంలో పాలస్తీనాలోని అన్ని విముక్తి సంస్థలతో చేతులు కలుపుతామని, పిఎల్‌ఓ ఆధిపత్యాన్ని అంగీకరించి భాగస్వాములమౌతామని ప్రకటించిన సంగతి కూడా తెలిసిందే. ■

## నెత్తుటి మరకల 'స్వాతంత్య్రం'

'మహిళ అర్ధరాత్రి ఒంటరిగా నడిచినప్పుడే మనకు నిజమైన స్వాతంత్య్రం' అన్నారు గాంధీజీ. ఆయనకన్న కలలు నెరవేరుతాయా, లేదా అనేది అటుంచితే నేడు ఎటువైపు నుంచి మానవమృగాలు దాడిచేస్తాయోనన్న భయాందోళన మహిళల్ని అనుక్షణం వెంటాడుతోంది. ఇంట్లో, ఆఫీసుల్లో బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్న మహిళలకు సరైన భద్రత ఉందా అన్న ప్రశ్నకు సమాధానం సమాధానం దొరకడం గగనమైంది. ఢిల్లీ నిర్భయ, హైదరాబాద్ దిశ, హత్రాస్, ఉన్నావ్ ఘటనల్ని తలచుకుంటే చాలు, మన దేశం ఎటుపోతోందో? ఎలాంటి ప్రమాదకర స్థితిలో ఉందో అర్థమవుతోంది. దీనికి కారణాల్ని అన్వేషిస్తే ముందుగా దోషుల స్థానంలో నిలబడాల్సింది కేంద్ర పాలకులు. ఎందుకంటే మణి పూర్‌లో నడిరోడ్డుపై మహిళలను నగ్నంగా ఊరేగించడం నుంచి మొదలుకుంటే మొన్నటి కలకత్తా మెడికోపై లైంగికదాడి, హత్య వరకు అన్నీ అమానుష ఘటనలే. సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసేవే. ఈ ఉదంతాలన్నీ ఒకదాని మించి ఒకటి జరుగుతున్నా అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయనే చెప్పాలి. తమిళనాడులో బాలికపై, మహారాష్ట్రలో నర్సుపై, తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన మహిళపై సామూహిక లైంగికదాడి. ఇలా దేశంలో ప్రతిరోజూ ఏదో ఓచోట మహిళలపై దారు ణాలు వెలుగుచూస్తునే ఉన్నాయి. ఇందులో తెలియనవి కొన్నయితే, కాలగర్భంలో కలిసేవి మరెన్నో! దేశంలో పది నిమిషాలకు ఒక లైంగికదాడి జరుగుతోందని జాతీయ నేర గణాంకాల నివేదిక



పేర్కొంది. ప్రతి పది నిమిషాలకు ఓ ఆడ శిశువు, ఓ బాలిక, ఓ స్త్రీ, ఓ వృద్ధురాలు అన్యాయంగా సామూహిక లైంగికదాడికి బలవుతూనే ఉన్నారని చెప్పడానికి సర్కారు నమోదు చేసిన ఈ నేర గణాంకాలే సాక్ష్యం. పదేండ్ల కిందట ఇరవై నిమిషాలకు ఒక రేప్ జరిగితే...ఇప్పుడది పది నిమిషాలకు చేరింది. అంటే, మోడీ తన దశాబ్ద పాలనలో సాధించిన ప్రగతి ఇదేనా? అని నేడు మహిళాలోకం ప్రశ్నిస్తోంది. ఇలాంటి ఘట నలు జరిగినప్పుడు భరోసా కల్పించాల్సిన పాలకులు స్పందిస్తున్న తీరు మరింత వెగటు పుట్టిస్తోంది. వారి మాటలే మహిళలపై దాడులకు పురిగొల్పుతున్నాయా? అన్న సందేహం కలుగుతోంది.

ఢిల్లీ గ్యాంగ్ రేప్ ఘటన తరువాత మహిళల భద్రతపై ప్రత్యేకంగా ఏర్పాటైన జస్టిస్ వర్మ కమిషన్ ఇచ్చిన నివేదికలో హత్యాచార నిర్వచనాన్ని మరింత విస్తృతపరచడమే కాదు, అటువంటి అకృ త్యాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు వుండాలని సూచించింది. ఐపీసీని సవరించాలని చెప్పింది. ఈ సిఫారసుల్లో కొన్నింటిని మాత్రమే స్వీకరించిన ప్రభుత్వం నిర్భయ ఆర్డినెన్స్‌ను తెచ్చింది. ఆ తరువాత దానికి చట్టరూపమిచ్చింది. అయినా, మహిళలపై లైంగికదాడులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. చట్టాలు తమనేమీ చేయలేవన్న మొండిధైర్యమో, తప్పుచేసినా శిక్ష పడకుండా తప్పించుకోవచ్చన్న ధీమానో తెలియదుగానీ, మోడీ పాలనలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మహిళల్ని రక్షిం చేందుకు, వారికి భరోసా కల్పించేందుకు సర్కారు చర్యలు శూన్యం. మాటల్లోనే మహిళలంటే తనకెంతో గౌరవమని, శక్తి స్వరూపిణి అంటూ కీర్తిస్తున్న మన ప్రధాని ఇలాంటి దాడులు జరిగినప్పుడు మౌన ముద్రలోనే ఉంటారు. ఉన్నావో, హత్రాస్ వంటి ఘటనలపైనా కూడా ఆయన నోరువిప్పలేదు. మణి పూర్ మారణకాండపై కూడా ఇంతే. ఢిల్లీ నిర్భయ ఘటన సమయంలో మహిళలపై కాషాయ పరివారం ఎక్కడలేని ప్రేమను ఒలకపోసింది. ఆ తర్వాత అధికారంలోకొచ్చిన తర్వాత ఏం జరుగుతోందో దేశ మంతా నేడు కండ్లారా చూస్తోంది, ఇంకా చెప్పాలంటే బాధను అనుభవిస్తోంది. '78 ఏండ్ల స్వాతంత్య్ర మా..నాకు స్వేచ్ఛెక్కడా?' అని రోదిస్తోంది.

గృహ బంధనాలను, పురుషాధిక్యతను ఛేదించుకొని మహిళలు బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టి ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లో తమ ప్రతిభా సామర్థ్యాలను చాటుకుంటున్న సందర్భంలో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఈ సమయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై మహిళలు ఫిర్యాదు చేస్తున్నా న్యాయం మాత్రం దొరకడం లేదు. మహిళలను గౌరవించే దేశం మనదని సూక్తులు వల్లించే మోడీ.. తమ పార్టీ నేతలు, కీలకపదవుల్లో ఉన్న కాషాయ ప్రజాప్రతినిధులే మహి ళలపై దాడులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చినా మహిళలకు సరైన రక్షణ లేదు. ఆడపిల్లలపై అకృత్యాలకు తెగబడుతోన్న కీచకులను శిక్షించలేనప్పుడు అది చట్టబద్ధమైన పాలన అనగలమా? ఎన్ని చట్టాలు తెచ్చినా, మరెన్ని రూల్స్ రూపొందిం చినా వాటిని ఆచరణలో పెట్టనప్పుడు ఉపయోగమేంటి? చట్టాలు చేస్తే చాలదు, వాటిని నిజాయితీగా అమలు చేసే యంత్రాంగం కావాలి. అంతకన్నా ముఖ్యంగా ప్రభుత్వ ధోరణిలో మార్పు రావాలి. ఎన్నుకున్న పాలకులు పూర్తి భరోసా కల్పించినప్పుడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ.దానికోసం మహిళలే కాదు, వారికి మద్దతుగా పౌర సమాజమంతా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది.

- జీవీఎంఆర్

# బాలిక చదువుకు భరోసా కావాలి

"భారతదేశంలోని నేటి అత్యుత్తమ దృశ్యాల్లో ఒకటి ఏమంటే ఆడపిల్ల తన స్కూలు బ్యాగు వీపుపై పెట్టుకుని ఉదయం బడికి బయలు దేరడం". ఏ విద్యాభిమానో భావోద్వే గంతో చెప్పిన మాటలు కావివి. న్యాయశాస్త్రాన్ని కాచి వడపోసిన ఒక సుప్రీంకోర్టు న్యాయ మూర్తి తీర్పులోని వాక్యమిది! ఈ స్పృహ మనలో ఎంత మందికి వుంది? మన విద్యారంగ పాలసీల నిర్ణేతలకు, ప్రభుత్వాలకు, సామాజిక ఉద్యమకారులకు, మేధా వులకు మాత్రం ఏ మేరకుంది? ఇలా మనలందర్నీ గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తున్నట్టుంది గదూ జస్టిస్ సుధాంశు దులియా చేసిన ఈ వ్యాఖ్యల్ని చూస్తుంటే!

హిజాబ్ ధారణను తప్పనిసరి చేసిన కర్నాటక ప్రభుత్వ ఉత్తర్వుల్ని, దాన్ని సమర్థించిన హైకోర్టు ఉత్తర్వును వ్యతిరేకిస్తూ తన అసమ్మతి తీర్పులో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు అపురూపమైనవి. ఈ సందర్భంగా మన దేశంలోని ఆడపిల్లలు నాలుగంటే నాలుగు ముక్కలు నేర్చుకోవడానికి పడుతున్న సవాలక్ష తంటాల్ని ఏమీ పట్టించు కోకుండా సంకుచిత మత భేషజాల చుట్టూ, రాజకీయాల చుట్టూ పిల్లల చదువుల్ని తిప్పి తిప్పి వాళ్ళ బంగారు భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్న మన ప్రస్తుత సామాజిక రాజకీయ ధోరణుల్ని ఆయన మందలించిన తీరు ఎంతో విలువైంది. పిల్లలు, వారి ఆకాంక్షలు, అవసరాలు, హక్కులు కేంద్రంగా లేని విద్య పట్ల ఆయన చేసిన ఈ ధిక్కారం ఇటీవల కాలంలో ఈ స్థాయి ఏ అత్యున్నత వ్యక్తీ చేయనిది.

అక్టోబర్ 2022లో ఆయన వెలువరించిన తీర్పు సారాంశం ఏమిటో ఇప్పుడు చూద్దాం.

"మా ముందు ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరూ ఆడపిల్లలు! తమ గుర్తింపు కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, ఆర్టికల్ 25 కింద వారు రక్షణ కోరుతున్నారు. ఇస్లాంలో హిజాబ్ ధరించటం తప్పనిసరైన మతపరమైన నియమమా? కాదా? అనే వివాద నిర్ధారణ ఇప్పుడు అవసరం లేదు. నమ్మకం అనేది నిజాయితీతో కూడినదిగా వుండి, అది మరెవరికి హాని చేయని పక్షంలో తరగతి గదిలో హిజాబ్ నిషేధాన్ని సమర్థించ డానికి కారణాలు లేవు. "ప్రస్తుత సందర్భంలో పాఠశాలవిద్యా పరిపాలనా ధికారులు ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. వారికి ఏది ముఖ్యం? ఆడపిల్లలు చదువుకోవడమా? విద్యాశాఖో, పాఠశాల యాజమాన్యమో నిర్ణయించినట్లు యూనిఫారం ధరించడమా? కర్ణాటకలోని పాఠశాలల్లో హిజాబ్ నిషేధం అమలు వల్ల దురదృష్టవశాత్తు కొంతమంది బాలికలు తమ బోర్డు పరీక్షలకు హాజరు కాలేక పోయారని పిటిషనర్ల తరఫున హాజరవు తున్న సీనియర్ న్యాయవాదులు చెబుతున్నారు. మరికొం దరు విద్యార్థినులు ఈ నిబంధన కారణంగా తాము చదువుతున్న పాఠశాలను వదిలేసి మదర్సాల్లో చేరాల్సి వస్తోంది. వాటిలోని విద్యా ప్రమాణాలు ఆశించినంత స్థాయిలో లేకపోవచ్చు.

"మన సమాజంలో బాలికలు చదువుకోవ డానికి తరగతి గది తలుపులు తెరుచుకోవడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఈరోజు ఒక ఆడపిల్ల తన స్కూలు బ్యాగు వీపుపై పెట్టుకొని ఉదయం తన పాఠశాలకు బయలు దేరడం భారతదేశంలోని అత్యుత్తమ దృశ్యాల్లో ఒకటి. ఆమె మన ఆశ, ఆమె మన భవిష్యత్తు. అయినా ఒక ఆడపిల్లకు తన సోదరుడితో పోలిస్తే చదువుకోడం చాలా కష్టం. ఇదొక నిష్ఠుర వాస్తవం. మన గ్రామాల్లో, సెమీ అర్బన్ ప్రాం తాల్లో ఒక ఆడపిల్ల తన స్కూల్ బ్యాగ్ పట్టుకునే ముందు ఇంటిని శు భ్రం చేయాల్సి వుంటుంది. రోజువారీ పనుల్లో తన తల్లికి సహాయం చేయటం మన ఆడపిల్లలకు సర్వ సాధారణం. ఆడపిల్లకు చదువులో ఎదురయ్యే అవాంతరాలు, కష్టాలు మగపిల్లల కంటే ఎన్నోరెట్లు ఎక్కువ. కాబట్టి 'ఒక ఆడపిల్ల తన పాఠశాలకు చేరుకోవడంలో ఎదుర్కొన్న సవాళ్లు ఎలాంటివి?' అనే కోణం నుంచి మనం చూడాలి.



"అందువల్ల ఈ న్యాయస్థానం తనకు తాను వేసుకుంటున్న ప్రశ్న ఏమంటే ఆడపిల్లను చదువుల నుంచి తిరస్కరించడం ద్వారా మనం ఆమె జీవితాన్ని కుదింపజేస్తున్నామా అనేది. పిటీషనర్లు కోరుకునే హిజాబ్ ధరించడం ప్రజాస్వామ్యంలో ఏమీ అడగరానిదా? మరీ అత్యాశా? ఇది పబ్లిక్ ఆర్డర్ కో, నైతికతకో, లేదా ఆరోగ్యానికో ఎలా విరుద్ధం? మర్యాదకో, రాజ్యాంగంలోని ఇతర నిబంధనలకో ఎలా వ్యతిరేకం. తరగతి గదిలో హిజాబ్ ధరించిన ఆడపిల్ల శాంతి భద్రతల సమస్యగా, చట్టానికి సంబంధించిన సమస్యగా ఎలా మారుతుందో ఎంతగా ఆలోచించినా నా తర్కానికి అందని సమస్యగానే మిగిలిపోయింది.

దీనికంటే భిన్నత్వంతో కూడిన మనలాంటి సమాజంలో చిన్నపాటి సర్దుబాట్లతో సహ జీవనానికి వీలుగా మనల్ని మనం మలుచుకోవడం పరిణతి చెందిన సమాజానికి సంకేతంగా నిలుస్తుంది. ఒక ఆడపిల్ల తన ఇంట్లో లేదా బయట హిజాబ్ ధరించే హక్కును కలిగి వుంటుంది. అంతమాత్రాన ఆమె పాఠశాల గేటు వద్ద ఆగిపోకూడదు. ఆమె పాఠశాలలో, తరగతిలో వున్నప్పుడు కూడా తన గౌరవాన్ని, గోప్యతను కాపాడుకోవల్సి వుంటుంది. ఆమె ప్రాథమిక హక్కులు ఆమెకుంటాయి. తరగతిగదిలో వున్నప్పుడు ఈ హక్కులు వుండవనడం పూర్తిగా తప్పు. మనం ప్రజాస్వా మ్యంలో చట్టబద్ధమైన పాలనలో జీవిస్తున్నాం. మనల్ని నియంత్రించే చట్టాలు భారత రాజ్యాంగానికి లోబడి వుండాలి. మన రాజ్యాంగం మనకు అందిస్తున్న అనేక అంశాల్లో ఒకటి విశ్వాసం. మన రాజ్యాంగం కూడా ఒక విశ్వాస పత్రమే. ఇది మెజారిటీపై మైనారిటీలు పెట్టుకున్న విశ్వాసం.

"మైనారిటీల సలహా కమిటీ నివేదికపై వ్యాఖ్యానిస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 24 మే 1949న రాజ్యాంగ సభ ముందు చేసిన ఒక ప్రకటనలో ఏం చెప్పాడో చూడండి." మైనార్టీలను హడావిడిగా ఒక నిర్దిష్ట పరిస్థితులకు పరి మితం చేయటం మా ఉద్దేశం కాదు. ఈ దేశంలో మారిన పరిస్థితులలో లౌకిక రాజ్యానికి నిజమైన పునాదులు వేయడమే అందరికీ ప్రయోజనం అనే నిర్ణయానికి మైనారిటీ వారు నిజాయితీగా రావల్సి వుంటుంది. మంచిని విశ్వ సించాలి. మెజారిటీ ప్రజల నిజాయితీని విశ్వసించాలి. ఇంత కంటే మైనారిటీల కు మరొక మార్గం లేదు. అలాగే మెజా రిటీ జనాభా కూడా మన దేశంలోని మైనార్టీల మనోభా వాలు ఎలా వున్నాయో అర్థం చేసుకోడం ముఖ్యం. తాము మైనారిటీలుగా వుండి, అలాంటి పరిస్థితు లు తమకెదురైతే ఎలా వుంటామో ఆలోచించు కోవడం అవసరం". ఇవీ ఆయన వ్యాఖ్యలు.

"కర్నాటక హైకోర్టు పిటిషనర్లు లేవనెత్తిన వైవిధ్యం ప్రశ్నను పరిగణలోనికి తీసుకోలేదు. తరగతి గది కూడా సమాజంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబించే విధంగా ఉండాలని వారి ఆకాంక్ష. వైవిధ్యం, మన సాంస్కృతిక బహుళత్వం ఈ సందర్భంలో చాలా ముఖ్యమైనవి.

"మన పాఠశాలలు ప్రత్యేకించి మన ప్రీ యూనివర్సిటీ కళాశాలలు పరిపూర్ణమైన సంస్థలు. వీటిలోని పిల్లలు మన దేశపు గొప్ప వైవిధ్యాన్ని గురించి జాగృతమవుతూ, ఎదుగుతున్న వయసు లోని వారు. ఇలాంటి పిల్లలకు సలహాలనిచ్చి, మార్గనిర్దేశం చేసే కేంద్రాలుగా ఇవి పనిచేయాలి. అప్పుడే మన రాజ్యాంగ విలువలైన సహనం, సర్దుబాటు వారికి ఒంటబడతాయి. ఇతర భాషలు మాట్లాడే వారి పట్ల, భిన్నమైన ఆహారపు అలవాట్లున్న వారి పట్ల, వేర్వేరు బట్టలు ధరించే వారి పట్ల సహనంతో, సర్దుబాటుతో ఉండాలని మన రాజ్యాంగం చెపుతున్న విలువలు వీరి అనుభవంలోకి వస్తాయి. మన వైవిధ్యాన్ని చూసి ఆందోళన చెందకుండా, దానికి ఆనందించాలని మన పిల్లలు నేర్చుకోవలసిన సమయమిది. భిన్నత్వంలోనే మన బలమున్నదని వారు గ్రహించా ల్సిన సందర్భమిది.

"మన రాజ్యాంగం ప్రకారం హిజాబ్ ధరించడ మనేది ఎంపికకు సంబంధించిన, స్వేచ్ఛకు సంబంధించిన విషయం. ఇది ముఖ్య మైన, మత పరమైన ఆచారానికి సంబంధించిన విషయం కావచ్చు, కాకపోవచ్చు. కానీ ఇది ఆ ఆడపిల్ల మనస్సాక్షికీ, నమ్మకానికీ, వాటి వ్యక్తీకర ణకూ సంబంధించించిన విషయం. ఆమె తన తరగతి గదిలో కూడా హిజాబ్ ధరించాలని కోరుకుంటే ఆమెను మనం ఆపలేము. ఎందుకంటే ఆమె సంప్ర దాయవాద కుటుంబం ఆమెను పాఠశాలకు పంప డానికి అనుమతించే ఏకైక మార్గం అదే కావచ్చు.

"హిజాబ్‌ను నిరాకరిస్తే తలెత్తే పరిణామం, ఆడపిల్లలకు విద్యను నిరాకరించటం! బడికెళ్లడం ఇప్పటికీ మన ఆడపిల్లలకు అంత తేలికగా లేదన్న వాస్తవం మనం విస్మరించలేము. అందువల్ల ఒక ఆడపిల్ల తన పాఠశాలకు చేరుకోవడంలో ఎదుర్కొ న్న సవాళ్ల కోణంలోనే ఈ కేసును కూడా చూడాలి. "కేవలం హిజాబ్ ధరించినందుకు ఆడపిల్లలకు చదువును నిరాకరించడం ద్వారా మనం ఆమె జీవి తాన్ని మెరుగుపరుస్తున్నామా అనేది కూడా కోర్టు ముందున్న ప్రశ్న. అమ్మాయిలు స్కూల్ గేట్‌లోకి వెళ్లే లోపు హిజాబ్ తీసేయమని చెప్పటం వారి వ్యక్తిగత ఎంపిక మీద దాడి చేయడం. తర్వాత వారి గౌరవంపై దాడి చేయడం. ఆ తర్వాత వారికి లౌకిక విద్యను నిరాకరించటం. ఇది భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 19(1)(ఏ), ఆర్టికల్ 21, ఆర్టికల్ 25(1)లను స్పష్టంగా ఉల్లంఘించడమే!"

- వి బాలసుబ్రమణ్యం

# జూరాలలో 44 గేట్లు ఎత్తివేత

- ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి భారీగా వరద



నవతెలంగాణ-ధరూర్

మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోపాటు కర్నాటక జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జూరాల వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తుతున్నది. అక్కడి నుంచి భారీగా వరద నీరు జూరాల జలాశయానికి చేరుతోంది. మంగళవారం కర్నాటకలోని ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 96,781 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1.16లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. ఆల్మట్టి సామర్థ్యం 129.72 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 125.47 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1.35లక్షల క్యూసెక్కులు ఉండగా.. 25 గేట్లు ఎత్తారు. అవుట్‌ఫ్లో 1.41 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోంది. నారాయణపూర్ ప్రాజెక్టు సామర్థ్యం 37.64 టీఎంసీలకుగానూ 29.70 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టులోకి 1,85,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, అధికారులు 44 గేట్లు తెరిచి దిగువకు 1,78,925 క్యూసెక్కుల నీరు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.651 టీఎంసీల నీరు ఉంది. విద్యుత్ ఉత్పత్తికి 30,148 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 820, కుడి కాలువకు 485 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరికొన్ని రోజులపాటు వరద ప్రవాహం ఇలాగే కొనసాగే అవకాశాలు ఉన్నట్టు పీజేపీ అధికారులు తెలిపారు.

# నేతల మధ్య లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ఆయన తీరును తప్పుబట్టారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే...బీఆర్ఎస్ సపోర్ట్ కారణంగా ఆ లాయర్ రాజ్యసభలో స్థానం పొందారంటూ వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేసేలా బండి సంజయ్ కామెంట్స్ ఉన్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. సంజయ్ దురుద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించాలంటూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

**బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కుతోనే బెయిల్ : మహేశ్‌కుమార్ గౌడ్**

కవితకు బెయిల్ ఊహించినదేననీ, బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కుతోనే అది సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనే ఆ పార్టీ కోరిక తెలంగాణలో నెరవేరలేదని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ దాసోహం కావడం, హరీశ్‌రావు, కేటీఆర్ ఢిల్లీలో బీజేపీ నేతల వద్ద ఆపద మొక్కులు మొక్కటం వల్లనే బెయిల్ సాధ్యమైందని ఆరోపించారు. బీజేపీ నేతల ఇండ్ల చుట్టూ తిరిగి కాళ్ళ మీద పడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు బయటపడ్డాయని తెలిపారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలైందని పేర్కొన్నారు. ఢిల్లీలో డీల్ సెట్ కావటం వల్లే కవితకు బెయిల్ వచ్చిందని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరావతి అనిల్ ఆరోపించారు. 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం ముందు పరేడ్ చేసి కాళ్లబేరానికి పోవడం వల్లే బెయిల్ దక్కింది' అంటూ మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి వాఖ్యానించారు.

# జన్వాడ ఫామ్‌హౌస్‌పై హైడ్రా !

- బుల్కాపూర్ నాలా నుంచి

కొలతలు తీసుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



నవతెలంగాణ-శంకర్‌పల్లి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్ నాలా నుంచి జన్వాడ ఫామ్‌హౌస్ వరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కొలతలు చేపట్టారు. కొన్ని రోజుల నుంచి వార్తల్లో నిలుస్తున్న జన్వాడ సరిహద్దులను, సర్వే నెంబర్లను పరిశీలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం బుల్కాపూర్ నాలా (ఫిరంగి నాలా)సర్వేలో భాగంగా జన్వాడ ఫామ్‌ను కూడా అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించారని ఫిర్యాదులు రావడంతో కొలతలు తీసుకునేందుకు అధికారులు ఫామ్‌హౌస్‌కి వచ్చారు. బుల్కాపూర్ నాలా నుంచి జన్వాడ ఫామ్‌హౌస్ వరకు కొలతలు చేపట్టారు. ఇదిలా ఉండగా హైడ్రా ఏర్పడిన నేపథ్యంలో ఈ ఫామ్‌హౌస్ యజమాని ప్రదీప్‌రెడ్డి దీనిపై హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు చట్ట ప్రకారం ముందుకు పోవాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసిందే. కాగా, బుల్కాపూర్ నాలా హద్దులు ఆక్రమణ విషయంలో ఇప్పుడే పూర్తి నిర్ధారణకు రాలేమని, ఉన్నత అధికారుల సూచనల మేరకు పూర్తి వివరాలను సేకరించి, వారికి అందజేయనున్నట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తేజ తెలిపారు. ఈ సర్వేలో శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.



# మట్టి విగ్రహాల ఏర్పాటుపై అవగాహన




- గణేష్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు
- నగరంలో రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి : సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు
- అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రానున్న గణేష్ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని, మట్టి విగ్రహాల ఏర్పాటు పై ప్రజల్లో అవగాహన కల్పించాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

గణేష్ ఉత్సవాల కోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలని మంత్రి పొన్నం ఆదేశించారు. శాంతి భద్రతల సమస్య వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్, విద్యుత్, రవాణా, ఆర్టీసీ, మెట్రో, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గతేడాది కంటే 10 శాతం విగ్రహాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. బేబీ పాండ్స్ ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా మట్టి విగ్రహాలను పూజించేలా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 7 జోన్ల పరిధిలో జోనల్ కమిషనర్, డీసీపీలతో మండపాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సూచించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల అధికారుల సమన్వయంపై మంత్రులు దిశా నిర్దేశం చేశారు. నిమజ్జనం త్వరగా పూర్తయ్యేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం సందర్భంగా పూర్తిగా మునిగేలా జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. పండుగలోపు రోడ్ల మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం కోసం రవాణా శాఖ అధికారులు వాహనాలు సిద్ధం చేసుకోవాలని, టస్కర్ వాహనాలు, డ్రైవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హైదరాబాద్ సిటీలోనే కాకుండా శివారు ప్రాంత ట్యాంక్‌లలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**ట్యాంక్ బండ్‌పై 33 క్రేన్లు**

ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి 22 ప్లాట్ ఫారంలు ఏర్పాటు చేస్తున్నామని హెచ్ఎండీఏ కమిషనర్ వెల్లడించారు. ట్యాంక్ బండ్‌పై 33 క్రేన్స్ పెడుతున్నామని, అవసరం ఉంటే మరిన్ని క్రేన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 100 స్టాటిస్టిక్ క్రేన్స్, 150 మొబైల్ క్రేన్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖైరతాబాద్ దగ్గర డిమాండ్ మేరకు ఉత్సవాల సమయంలో అర్ధరాత్రి వరకు మెట్రో నడిపిస్తామని.. నిమజ్జనం సమయంలో అర్ధరాత్రి 1-2గంటల వరకు నడుస్తాయని మెట్రో అధికారులు తెలిపారు. అదనంగా ఎంఎంటీఎస్ రైళ్లు, 650 వరకు అదనంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితితో పాటు పలు కమిటీలు ప్రభుత్వం దృష్టికి పలు అంశాలు తీసుకొచ్చాయి. సందర్శకులకు మొబైల్ టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఆహార ఏర్పాట్లు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి మాట్లాడుతూ.. నగరంలో రోడ్ల మరమ్మతులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామ న్నారు. సెప్టెంబర్ 1 నుంచి స్వయంగా అన్ని ప్రాంతాల్లోనూ పర్యవేక్షిస్తా నన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డీజీపీ జితేందర్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్‌లతో పాటు వేయింగ్ మిషన్లపై నిఘా

- ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు : తూనికలు, కొలతల శాఖపై మంత్రి ఉత్తమ్ సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తూనికలు, కొలతలశాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో వినియోగదారుల హక్కులకు భంగం కలిగించొద్దని సూచిం చారు. పెట్రోల్ బంక్‌లతో పాటు వేయింగ్ మిషన్‌లపై నిఘా పెంచాలని ఆయన సూచించారు. తద్వారా ప్రజలను మోసాల బారిన పడకుండా చూడొచ్చన్నారు. జిల్లాల వారిగా తరచు సమీక్షలు నిర్వహించాలని కోరారు. శాఖా పరంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి డీ.ఎస్.చౌహాన్, కార్యదర్శి ప్రియాంక, అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఆదివాసీలు, గిరిజనుల అభ్యున్నతికి అధికారులు కృషి చేయాలి
- కాకతీయులు నిర్మించిన కోటగుళ్ళు అద్భుతం : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ములుగు, జయశంకర్ జిల్లాల్లో పర్యటన



నవతెలంగాణ- ములుగు/గణపురం

ఆదివాసీలు, గిరిజనులు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించేలా వారి అభ్యున్నతికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధికారులకు సూచించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించారు. ముందుగా హైదరాబాద్ నుంచి యాదాద్రి చేరుకొని ఆలయాన్ని సందర్శించారు. అనంతరం రోడ్ మార్గంలో ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి సీతక్కతో కలిసి గవర్నర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పి శబరీష్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్.. ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తాను గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి పర్యటనగా షెడ్యూల్ ప్రాంతమైన ములుగు జిల్లాను ఎంచుకొని వచ్చినట్టు తెలిపారు. పేదలు, గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని అన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. జిల్లాలో కంటైనర్ హాస్పిటల్ వినూత్నంగా ఏర్పాటు చేయడం పట్ల మంత్రి సీతక్కను అభినందించారు.

**మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించాలి : మంత్రి సీతక్క**

ములుగు జిల్లా చరిత్ర, పర్యాటక కేంద్రాలు, జిల్లా విశిష్టత, విశేషాలను గవర్నర్‌కు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తరణ ఉన్న జిల్లా ములుగు అని, 30శాతం మంది ఆదివాసీలు, గిరిజన ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి, ఆదివాసీల, గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ఆసియా ఖండంలో అతి పెద్ద ఆదివాసీ గిరిజన జాతర మేడారం మహాజాతర ప్రతి రెండేండ్లకు ఒకసారి అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఈ జాతరను జాతీయ పండుగగా గుర్తించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు.

**కాకతీయులు నిర్మించిన కోటగుళ్ళు అద్భుతం**

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పీ కిరణ్ ఖర్గే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మొక్కలు అందించి స్వాగతం పలికారు. వేదపండితులు పూర్ణ కుంభం, మేళ తాళాలతో స్వాగతం పలికారు. గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపేశ్వరాలయం ఆవరణ తవ్వకాల్లో బయటపడ్డ శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కాకతీయుల వైభవాన్ని చాటే ఈ ఆలయం మహా అద్భుతమని అన్నారు. సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఇతర రాజ్యాలపై దండయాత్ర చేసి సాధించిన విజయానికి గుర్తుగా ఒక్కొక్క గుడిని నిర్మించారని చెప్పారు. ఇలాంటి కళా సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నియంత పోకడలతోనే హసీనా పతనం

- బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య విలువల హరింపు
- నిరుద్యోగం.. రిజర్వేషన్ విధానంతో యువతలో వ్యతిరేకత
- ద్రవ్యోల్బణంతో విపరీతంగా ధరల పెరుగుదల
- హిందుత్వ విధానాలతో బంగ్లాలో భారత్‌పై అయిష్టత :ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక సదస్సులో ఏపీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

నియంత పోకడలే బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వ పతనానికి కారణమని ఆంధ్రప్రదేశ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ప్రపంచంలో నియంతృత్వ ధోరణులతో వ్యవహరించే ఏ ప్రభుత్వానికైనా బంగ్లాదేశ్ పరిణామాలు ఓ గుణపాఠం అని అన్నారు. 'చైతన్య వేదిక - ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక, ఖమ్మం' ఆధ్వర్యంలో స్థానిక మంచికంటి మీటింగ్ హాల్‌లో పూర్వ విద్యార్థి ఎం. సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో లక్ష్మణరావు ముఖ్యోపన్యాసం చేశారు. బంగ్లాదేశ్‌లో తలసరి ఆదాయం పెరిగినా.. మానవ అభివృద్ధి సూచిలో భారతదేశం 131 స్థానంలో ఉంటే బంగ్లాదేశ్ 75వ స్థానంలో మెరుగ్గా ఉన్నా.. ఆ దేశ ప్రభుత్వం అనుసరించిన నియంతృత్వ విధానాలు హసీనాను గద్దె దింపడానికి కారణమని విశ్లేషించారు. బంగ్లాదేశ్ స్వాతంత్రోద్యమ కుటుంబాలకు 35 శాతం రిజర్వేషన్ ఉండటం ఆ దేశంలో నిరుద్యోగిత పెరగడానికి ఓ కారణమని తెలిపారు. రిజర్వేషన్లపై యువత నుంచి వ్యతిరేకత రావడం, చిట్టగ్యాంగ్‌లో విద్యార్థుల తిరుగుబాటుతో అక్కడి ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేసిందన్నారు. దీనిపై స్థానిక హైకోర్టును స్వాతంత్రోద్యమ కుటుంబాలు ఆశ్రయించినా వ్యతిరేక తీర్పు వచ్చిందని వివరించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఐదు శాతం రిజర్వేషన్‌కు ఆమోదయోగ్యం తెలిపిందన్నారు. అప్పటికే దేశంలో 17.30 కోట్ల జనాభాలో రెండు కోట్ల మంది నిరుద్యోగులుగా ఉండటంతో హసీనా సర్కార్‌పై వ్యతిరేకత తీవ్రరూపం దాల్చిందని తెలిపారు. ఈ క్రమంలోనే దేశంలో ద్రవ్యోల్బణం 10శాతం మించడంతో ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీనికి తోడు ప్రజాస్వామ్య యుతంగా నిర్వహించే ఉద్యమాలను అణచివేయడం, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం తదితర కారణాలతో ప్రజల్లో తిరుగుబాటుకు కారణమైందని చెప్పారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీకి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కూడా లేకుండా చేసి ఆవామీ లీగ్ ఏకపక్షంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారని వివరించారు. ప్రధాని మోడీ సైతం ఇలాంటి విధానాలనే అనుసరిస్తున్నారని తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు బుయ్య రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కేవీ నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.



## కూలి రేట్ల పెంపు కోసం
# పోరాటాలకు సిద్ధంకండి

- కార్మికులు,వ్యవసాయ కూలీలు ఐక్య ఉద్యమాలు చేయాలి
- కనీస వేతనాల జీవోల అమలులో రాష్ట్ర సర్కారు విఫలం : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేరళ, తమిళనాడులతో పోలిస్తే తెలంగాణలో కూలి రేట్లు చాలా తక్కువగా ఉన్నాయనీ, వాటి పెంపు కోసం వ్యవసాయ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. హక్కుల కోసం కార్మికులు, వ్యవసాయ కూలీలు ఐక్య ఉద్యమాలు చేయాలని కోరారు. కనీస వేతనాల జీవోలను అమలు చేయడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రెక్కాడితే డొక్కాడని వారు నూటికి 70 శాతం ఉన్నారనీ, వారికి సరైన ఉపాధి, వైద్య, విద్యం వంటి సౌకర్యాలు లేవని చెప్పారు. వారిలో చాలా మందికి కనీసం ఇండ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ తర్వాత కూలీలకు పనిదినాలు తగ్గిపోయాయని వాపోయారు. ఫలితంగా వలసలు పెరుగుతున్నాయనీ, వ్యవసాయేతర పనుల్లో నైపుణ్యం లేక వారు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో కనీస వేతనాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర పాలకులు సంక్షేమ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ల పాలు చేస్తున్న తీరును ఎండగట్టారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, కూలీలు, కార్మికులంతా ఐక్యమై వర్గ పోరాటాలు చేసి దోపిడీదారులను వెనక్కి కొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఆఫీస్ బేరర్లు పొన్నం వెంకటేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వర్లు, బుర్రి ప్రసాద్, నారి ఐలయ్య, బొప్పని పద్మ, కొండమడుగు నర్సింహ్మా ములకలపల్లి రాములు, కె.జగన్, వీరన్న, పెద్ది వెంకట్రాములు, గోపాల్, ఆంజనేయులు, శశిధర్, నరసింహులు, సమ్మయ్య, బి.సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు బిగ్ రిలీఫ్

- కవితకు బెయిల్ రావటంతో హర్షాతిరేకాలు
- తనయను తల్చుకుని ఇన్నాళ్లూ మనోవేదనకు గురైన మాజీ సీఎం కేసీఆర్
- ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో పార్టీని పరుగులు పెట్టిస్తారంటున్న నేతలు
- క్యాడర్‌లో హుషారు.. తెలంగాణ భవన్‌లో జోష్...




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు బిగ్ రిలీఫ్..' ఆ పార్టీ అధినేత కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బెయిల్ లభించిన వేళ... అందరి నోటా ఇదే మాట. నిజమే మరి... దాదాపు పదేండ్లపాటు అధికారంలో ఉండి, ముచ్చటగా మూడోసారి కూడా గెలుపుజెండా ఎగరేస్తామని భావించిన ఆ పార్టీకి, గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పెద్ద దెబ్బ కొట్టాయి. గులాబీ పార్టీ అధికారాన్ని కోల్పోవటమేగాదు, రెండు చోట్ల పోటీ చేసిన అధినేత కేసీఆర్, ఒక చోట ఓటమి పాలవటాన్ని కారు పార్టీ శ్రేణులు కొన్ని నెలలపాటు జీర్ణించుకోలేకపోయాయి. ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో ప్రమేయముందనే ఆరోపణలతో గత మార్చి 15న కవిత అరెస్టవటం బీఆర్ఎస్‌ను మరింత కుంగదీసింది. ఈ పరిణామంతో మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. అటు పార్టీ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌కుగానీ, ఇటు అసెంబ్లీకిగానీ రావటానికి ఆయన సుముఖత వ్యక్తం చేయలేదు. వచ్చినా ఏదో మొక్కుబడిగా వచ్చారు తప్పితే... పూర్తి స్థాయిలో రంగంలోకి దిగకుండా జనానికి దూరంగా ఉన్నారు. ఎక్కువ రోజులు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో, అడపాదడపా హైదరాబాద్‌లోని నందినగర్‌లోగల తన నివాసంలో గడిపారు తప్ప బయటకు పెద్దగా రాలేకపోయారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కేసీఆర్ సతీమణి శోభతోపాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తీహార్ జైల్లో కవితతో పలుమార్లు ములాఖత్ అయినప్పటికీ... మాజీ సీఎం మాత్రం ఒక్కసారి కూడా కూతుర్ని కలవకపోవటం చర్చనీయాంశమైంది. ఇదే విషయాన్ని ఇటీవల ఓ మాజీ మంత్రి వద్ద ప్రస్తావిస్తే...'కవిత అరెస్టుతో ఆయన బాగా మనోవేదనకు గురయ్యారు. అందుకే యాక్టివ్‌గా ఉండలేకపోతున్నారు. ఆమె బయటకు వస్తేగానీ... ఈయన సాధారణ స్థితికి రాలేరు...' అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పుడు కవిత బెయిల్‌పై బయటకు వచ్చారు కాబట్టి, గులాబీ బాస్ తిరిగి మునుపటిలాగా 'గర్జిస్తారని', తద్వారా పార్టీకి మళ్లీ జవసత్వాలు వస్తాయని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**గడ్డు పరిస్థితుల నుంచి బయటపడేనా...?**

ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఇంకోవైపు కవిత అరెస్టు, మరోవైపు లోక్‌సభ ఎలక్షన్లలో ఘోర పరాజయం... వెరసి దాదాపు తొమ్మిది నెల్లుగా తీవ్రమైన నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న బీఆర్ఎస్, తాజా రాజకీయ పరిణామాలతో తిరిగి పుంజుకుంటుందా? లేదా? అన్నది వేచి చూడాలి. పులి మీద పుట్రలా గతంలో బీఆర్ఎస్ అనుసరించిన 'ఆపరేషన్ ఆకర్ష్'ను ఇప్పటి కాంగ్రెస్ అనుసరించటంతో కారు పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్లు 'హస్తం' గూటికి చేరిపోయిన సంగతి తెలిసిందే. దీంతో అన్ని రకాలుగా డీలా పడ్డ బీఆర్ఎస్‌ను కేసీఆర్ ఇప్పుడైనా గాడిలో పెట్టగలరా? లేదా? అనే అంశంపై చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి.

**చరిష్మా.. చతురత...**

కవిత అరెస్టుతో మానసికంగా ఇబ్బంది పడ్డ కేసీఆర్, ఒకానొక దశలో 'తన గుండెల్లో అగ్నిపర్వతం బద్దలవుతోంది...' అని గద్గద స్వరంతో చెప్పారు. ఆ క్రమంలో గతంలో ఉన్న ఆయన చరిష్మా, వ్యూహ చతురత ఎక్కడా కనబడలేదు. మరోవైపు సీఎం రేవంత్ దూకుడు ముందు బీఆర్ఎస్ వెలవెలబోయింది. కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన మరుసటి రోజు నుంచే హైదరాబాద్‌లో మంచి నీటి కొరత, రాష్ట్రంలో విద్యుత్ కోతలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించారు. ఇదే సమయంలో కేసీఆర్ హయాంలో విద్యుత్ ఒప్పందాలు, అప్పులపై ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేసింది. కాళేశ్వరం పిల్లర్ల కుంగుబాటులో తీవ్ర స్థాయిలో వివాదం నడిచింది.

వీటన్నింటిపై అసెంబ్లీలో వాడివేడిగా చర్చలు జరగటంతో బీఆర్ఎస్ సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. ఆ తర్వాత రైతు భరోసా, రైతు రుణమాఫీ అనే ముఖ్యాంశాలను ఎత్తుకున్న ఆ పార్టీ, వాటిపై ఆందోళనల ద్వారా క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు ప్రయత్నించింది. మధ్యలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావటంతో ఆయన మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరు కావాల్సి వచ్చింది. ఇలాంటి పరిణామాలతో ఉక్కిరిబిక్కిరైన గులాబీ పార్టీ... ఇప్పుడు కవిత బయటకు రావటంతో కొంతలోకొంత ఊపిరి పీల్చుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**నేతల హర్షం**

బెయిల్‌పై విడుదలైన కవిత బుధవారం హైదరాబాద్‌కు రానుండటంతో ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి భారీ స్థాయిలో వాహనాల ర్యాలీతో ఆమెను తోడ్కొని రానున్నారు. కవితకు బెయిల్ రావటంపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, సీనియర్ నేతలు దేవీ ప్రసాద్, పల్లె రవికుమార్ గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ వేర్వేరుగా విలేకర్ల సమావేశాలు నిర్వహించారు.

**వడ్డీతో సహా చెల్లిస్తాం : కవిత**

బీఆర్ఎస్‌కు, తమ కుటుంబానికి ఇబ్బందులు సృష్టించిన వారికి రాబోయే రోజుల్లో 'వడ్డీతో సహా చెల్లిస్తాం...' అని కవిత హెచ్చరించారు. పోరాటం తనకు కొత్త కాదనీ, 18 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశానని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. కష్ట సమయంలో బీఆర్ఎస్‌కు, తనకు, తన కుటుంబానికి, తన తండ్రి కేసీఆర్‌కు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లాల్లో పర్యటించి నివేదిక సమర్పించాలి

- డెంగ్యూ కట్టడిపై మంత్రి దామోదర ఆదేశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

డెంగ్యూ కట్టడిపై జిల్లాల్లో పర్యటించి నివేదిక సమర్పించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన సీజనల్ వ్యాధుల కట్టడిపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. డీహెచ్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలనీ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. బాధితులకు సరైన వైద్యం అందించేలా కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 587 దరఖాస్తులు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో 587 దరఖాస్తులందాయి. మైనారిటీ వెల్ఫేర్ శాఖకు 118, రెవెన్యూ పరమైన సమస్యలపై 94, విద్యుత్ శాఖకు 88, పౌరసరఫరాల శాఖకు 48, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 47, ఇతర శాఖలకు 192 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆస్పత్రి

## 32 ఎకరాల్లో నిర్మించేందుకు నిర్ణయం

- రాబోయే 50 ఏండ్ల అవసరాలకు తగ్గట్టు డిజైన్లు
- 22 జిల్లాల్లో సమాఖ్య భవనాలకు ఎకరం చొప్పున కేటాయింపు
- వచ్చే ఏడాదిలోపు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీలకు నూతన భవనాలు : స్పీడ్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గోషామహల్‌లో హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి అంశాలపై సంబంధిత అధికారులతో మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. గోషా మహల్‌లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ యొక్క 32 ఎకరాల స్థలాన్ని వెంటనే వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడే ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాబోయే 50 ఏండ్ల అవసరాలకు తగ్గట్టుగా కొత్త భవన నిర్మాణ డిజైన్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడికి చేరుకునే కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఆస్పత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు వసతి గదులను నిర్మించాలని ఆదేశించారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, సేవలన్నీ అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షించే బాధ్యతను చేపడుతామని చెప్పారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్కడున్న భవనాలను పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దుతామన్నారు. పోలీస్ విభాగానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. పేట్ల బుర్జులోని పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ చుట్టూ ఉన్న స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను తరలించాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న 15 నర్సింగ్ కాలేజీ భవనాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది నుంచే తాత్కాలికంగా అద్దె భవనాల్లో వీటిని నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇప్పటికే పది జిల్లాల్లో సమాఖ్య భవనాలున్నాయనీ, మిగతా 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. వీటిని నిర్మించేందుకు ఒక ఎకరం స్థలం ఆయా జిల్లాల్లో గుర్తించాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కనే మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలని పేర్కొన్నారు. వారు తయారు చేసే తమ ఉత్పత్తులతో అక్కడ ఏడాది పొడవునా వివిధ స్టాళ్లు నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రపంచ స్థాయి అతిథులు, వివిధ రంగాల ప్రముఖులు, జాతీయ స్థాయి నేతలు ఎవరొచ్చినా సందర్శించే స్థలంగా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని సూచించారు.

## భూమి మాదంటే మాదని..

# ఇరువర్గ్గాల మధ్య వివాదం



- అక్రమ కట్టడాలు కూల్చేందుకు యత్నించిన అధికారులు
- ఇండ్ల నిర్మాణదారులకు, పోలీసులకు మధ్య తోపులాట
- రాళ్లు రువ్వడంతో మహిళ తలకు గాయం

**నవతెలంగాణ-ఖమ్మం**



ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో భూమిలో ఇరువర్గాల మధ్య మంగళవారం వివాదం నెలకొంది. వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 147, 148, 149లో ఉన్న మొత్తం 6 ఎకరాల్లో ఎకరంన్నర తమ ప్రయివేట్ భూమిని ఆక్రమించి గుర్తు తెలియని వ్యక్తులు 90 గుడిసెల వరకు వేశారని భూ యజమాని బిక్కసాని దామోదర్ కోర్టును ఆశ్రయించనట్టు తెలిపారు. అప్రూవల్ లేఅవుట్ భూమి తమదని పేర్కొన్నారు. కోర్టు బిక్కసానికి అనుకూలంగా పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడంతో మంగళవారం భూమిపైకి పోలీసుల సహాయంతో, అక్రమ కట్టడాలను కూల్చేందుకు జేసీబీలు, డోజర్లు తీసుకుని వచ్చారు. గుడిసెలను కూల్చే క్రమంలో అక్కడి ప్రజలు జేసీబీలకు అడ్డుపడి, తాము భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకున్నామని తెలిపారు. దాంతో ప్రయివేట్ వ్యక్తులు, గుడిసె వాసుల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. ఈ వివాదంలో రాళ్ళు రువ్వడంతో మహిళ తలకు తీవ్ర గాయమైంది. ఈ సందర్భంగా గుడిసెవాసులు మాట్లాడుతూ.. అసలు ఈ సర్వే నెంబర్‌లో ప్రయివేటు భూమి లేదని, అంతా భూదాన్ భూమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాగే వివాదం నెలకొంటే, అప్పటి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ భూదాన్ భూమిగా వారే స్పష్టం చేశారని గుర్తుచేశారు. ప్రయివేట్ వ్యక్తులకు భూదాన్ భూమిలో పాస్ బుక్‌లు ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. తప్పుడు పత్రాలు సృష్టించి, కోర్ట్ ను, అధికారులను తప్పుబట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా కోర్టును ఆశ్రయించామని వచ్చేనెల తుది తీర్పు వెలువడనుందనీ, అప్పటి వరకు గుడిసెలు కూల్చివేత నిలుపుదల చేయాలని, గుడిసె వాసులు అధికారులను కోరారు. కాగా, అప్పటికే అక్కడ గుడిసెలు నిర్మించుకున్న ప్రజలకు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. నగర ఏసీపీ రమణ మూర్తి పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు నడుమ ఇరువర్గాలను చెదరగొట్టి వివాదాన్ని సద్దుమణిగించారు.

# సరోజినీ ఆస్పత్రిలో ఆపరేషన్లకు విఘాతం

- కీలక విభాగాల్లో సీనియర్ల కొరత
- బదిలీల ఎఫెక్ట్
- పేద రోగులను దోచుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు




**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రతి ఏటా లక్షలాది మందిని వైద్యఖర్చులు పేదరికంలోకి నెట్టేస్తున్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రభుత్వపరంగా సరైనా చికిత్సా సౌకర్యాలను కల్పించకపోతే అది ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా ఆయా వ్యక్తుల కుటుంబాల ఆర్థిక స్థితిని కూడా ఒక్కసారిగా దిగుజారుస్తున్నట్టు గణాంకాలు వివరిస్తున్నాయి. ఈ మేరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ, వారి ఆర్థిక స్థితిని కాపాడటంతో పాటు ప్రయివేటు దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో ఆరోగ్యరంగానికి తగినన్ని నిధులు కేటాయించడంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లో తగినంత మంది వైద్య సిబ్బంది, సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు. అయినప్పటికీ తరచూ ప్రభుత్వాలు యథాలాపంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలు క్షేత్రస్థాయిలో సేవలందించే ప్రభుత్వాస్పత్రులపై, వాటికి వచ్చే రోగులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రి కూడా ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నది.

రాష్ట్రంలోనే ప్రభుత్వ పరిధిలో ఉన్న అతి పెద్ద కంటి ఆస్పత్రి సరోజినీ దేవి ఆస్పత్రి. అక్కడ కంటికి సంబంధించిన క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేస్తుండటంతో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది పేదలు వస్తుంటారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా రోగులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకుంటు న్నారు. ఈ నేపథ్యంలో రోగుల రద్దీని దష్టిలో ఉంచుకుని ఇక్కడ సీనియర్ వైద్యుల సంఖ్యను పెంచాలని నిపుణులు కోరుతున్నారు. అయితే వారి సంఖ్యను పెంచకపోగా సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు సీనియర్ వైద్యులను ట్రాన్స్‌ఫర్ చేయడంతో పలు విభాగాల్లో ఆపరేషన్ల తగ్గిపోయాయి. దీంతో శస్త్రచికిత్సల కోసం వెయింటింగ్‌లో ఉండాల్సి రావడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల అనివార్యంగా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా చితికిపోతున్నారు. మరోవైపు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద ఈ ఆస్పత్రిలో గతంలో వైద్యులకు నిర్వహించిన శిక్షణా తరగతులను ప్రస్తుతం నిలిపేయడంతో వైద్య సేవల్లో నాణ్యత కొరవడుతోంది.

బదిలీలకు ముందు ఆస్పత్రిలో ఏడుగురు ప్రొఫెసర్లు ఉండగా వారిలో ముగ్గురు బదిలీ కాగా ఆ స్థానంలో ఒక్కరే రావడంతో ప్రస్తుతం ఐదుగురు మిగిలారు. అసోసియేట్ ప్రొఫెసర్లు నలుగురిని బదిలీ చేయగా ఒక్కరు రావడంతో మూడు ఖాళీలున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఆస్పత్రిలోని రెటీనా, స్క్వింట్, కార్నియా, గ్లకోమా లాంటి కీలక విభాగాల్లో మునపటి మాదిరిగా వెంటనే ఆపరేషన్లు చేయడం లేదని రోగులు వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము ఆపరేషన్లు ఎప్పుడు చేస్తారో తెలియక ప్రయివేటుకు వెళ్లాల్సి వస్తున్నదని చెబుతున్నారు. క్లిష్టమైన కంటి శస్త్రచికిత్సలను చేసే ఈ ఆస్పత్రికి మరి కొంత మంది సీనియర్ వైద్యులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# భద్రతపై రాజీపడొద్దు

- క్షేత్రస్థాయి సిబ్బందికి కౌన్సిలింగ్ ఇవ్వండి : 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డుల కార్యక్రమంలో ద.మ.రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్




**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రైలు కార్యకలాపాల భద్రతపై ఎలాంటి రాజీకి అవకాశం లేదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. ఎక్కడైనా సూక్ష్మ లోపాలుంటే సాధ్యమైనంత త్వరగా సరిదిద్దాలని చెప్పారు. దీనికోసం సూపర్‌వైజర్లు, లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారంనాడిక్కడి రైల్ నిలయంలో 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జోన్ పరిధిలోని 11 మంది ఉద్యోగుల సేవల్ని ప్రసంసిస్తూ అవార్డులు అందచేశారు. అనంతరం రైలు కార్యకలాపాల భద్రతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ జోన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డీఆర్ఎంలు) పాల్గొన్నారు.

అనంతరం రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు దక్షిణ మధ్య రైల్వేకి సంబంధించి తాము అమలు చేస్తున్న అభివృద్ధి ప్రాజెక్టుల స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. భద్రత విషయంలో ఎలాంటి షార్ట్‌కట్ పద్ధతులను అవలంబించకూడదని చెప్పారు.

### నైతిక బాధ్యత వహిస్తూ

## 'అమ్మ'కు మోహన్‌లాల్ రాజీనామా

మలయాళ చిత్ర పరిశ్రమలో పనిచేసే మహిళలపై లైంగిక వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారాలపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ నివేదికని సమర్థిస్తూ పలువురు నటీమణులు సైతం సంచలన ఆరోణపలు చేశారు. అలాగే తమకి జరిగిన చేదు అనుభవాలను సోషల్ మీడియా వేదికగా బహిరంగంగా పంచుకున్నారు. దీంతో మలయాళ దర్శకుడు రంజిత్, నటులు సిద్దిఖీ, బాబురాజ్, జయసూర్య, ముకేష్, సూరజ్ వెంజారమూడు పాటు అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ)లోని కొందరు సభ్యులు లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్న తరుణంలో ప్రముఖ నటుడు మోహన్‌లాల్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులు ఉన్న మొత్తం పాలక మండలి పదవుల నుంచి వైదొలిగింది. ఈ విషయాన్ని 'అమ్మ' సంఘం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 'అమ్మ' కమిటీలోని కొంతమంది సభ్యులపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దీంతో నైతిక బాధ్యతగా వీరంతా రాజీనామా చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మూకుమ్మడి రాజీనామాలతో మలయాల చిత్ర మండలిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు కేరళ ప్రభుత్వం 2019లో జస్టిస్ హేమ నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇటీవల తమ నివేదిక ఇచ్చింది. ఇదిలా ఉంటే, మలయాళ చిత్ర పరిశ్రమలో మాదిరిగానే బెంగాల్ చిత్ర పరిశ్రమలోనూ మహిళలు తీవ్ర లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని, ఈ వేధింపుల్లో తాను కూడా బలయ్యానని, దీనిపై కూడా జస్టిస్ హేమ కమిటీలాంటిది ఏర్పాటుచేయాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సోషల్ మీడియా వేదికగా ప్రముఖ బెంగాల్ నటి రీతా భరీ చక్రవర్తి కోరారు.

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు

## రాష్ట్రానికి చెందిన ఇద్దరు టీచర్లు ఎంపిక

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రాష్ట్రానికి చెందిన ఇద్దరు టీచర్లు ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జెడ్పీహెచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి పెసర, రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జెడ్పీహెచ్‌కు చెందిన తాడూరి సంపత్‌కుమార్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 50 మంది ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ ఐదున జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. వచ్చేనెల ఐదున న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరగనుంది. వారికి రూ.50 వేల నగదుతోపాటు ధ్రువపత్రం, రజత (వెండి) పతకంతో సత్కరిస్తారు.

## ఇంజినీరింగ్ బీ కేటగిరీ సీట్ల భర్తీ గడువు 5 వరకు పొడిగింపు

- ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్

TGCHE
Telangana Council of Higher Educatio
A Statutary body of the Government of Tel

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రయివేటు (మైనార్టీ, నాన్‌మైనార్టీ) ఇంజినీరింగ్ కాలేజీల్లో బీ కేటగిరీ సీట్ల భర్తీ ప్రక్రియ గడువును వచ్చేనెల ఐదో తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల ఐదో తేదీ వరకు యాజమాన్య కోటా సీట్ల వివరాలను www.tgche.ac.in వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కాలేజీ యాజమాన్యాలను ఆదేశించారు. ఆలస్య రుసుం రూ.వెయ్యితో అదేనెల పదో తేదీ వరకు అప్‌లోడ్ చేయాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాలతోపాటు బ్రాంచ్ వారీగా మెరిట్ జాబితాతో కూడిన హార్డ్ కాపీలను సమర్పించేందుకు గడువు వచ్చేనెల పదో తేదీ వరకు ఉందని తెలిపారు. ఉన్నత విద్యామండలి జారీ చేసిన నిబంధనలను మెరిట్ ప్రకారమే బీ కేటగిరీ సీట్లు భర్తీ చేయాలని యాజమాన్యాలను ఆదేశించారు.

## యూపీఎఫ్‌తో 63వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం

- ద.మ.రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పీ కిషోర్‌బాబు వెల్లడి



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం వల్ల దక్షిణ మధ్య రైల్వేలోని 63 వేలమంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని ఆ సంస్థ ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పీ కిషోర్‌బాబు తెలిపారు. మంగళవారంనాడిక్కడి రైల్‌నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎస్ వివేకానందతో కలిసి మాట్లాడారు. నూతన పెన్షన్ స్కీమ్ సభ్యులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ ఏకీకృత పెన్షన్ పథకాన్ని ఎంచుకోవచ్చని చెప్పారు. ఈ పథకం ఐదు ప్రధాన ప్రయోజనాలతో 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. హామీ ఇవ్వబడిన పెన్షన్, కుటుంబ పెన్షన్, కనీస పెన్షన్, గ్రాట్యుటీతో పాటు పదవీ విరమణ సమయంలో ద్రవ్యోల్బణ సూచిక ఆధారంగా ఏకమొత్తం చెల్లింపులు ఉంటాయని చెప్పారు. నూతన పెన్షన్ పథకంతో పోలిస్తే ప్రస్తుత యూపీఎస్ మరింత ప్రయోజనకరంగా ఉందన్నారు.యూపీఎస్ నిబంధనలు ఇప్పటికే ఎన్‌పీఎస్‌లో పదవీ విరమణ పొందిన వారికి కూడా వర్తిస్తాయని చెప్పారు. భవిష్యత్ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ లేదా యూపీఎస్‌లో చేరే అవకాశం ఉంటుందనీ, ఒకసారి చేరితే అదే ఫైనల్ అవుతుందని వివరించారు. ఉద్యోగుల నుంచి తీసుకునే వాటా పెరగదనీ, ప్రభుత్వ వాటా 14 నుంచి 18.5శాతానికి పెంచారని వివరించారు.

## కారు, కమలం ఒప్పందంమేరకే...

- కవిత బెయిల్‌పై మహేష్‌కుమార్‌గౌడ్, శోభారాణి ఎద్దేవా

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కమలం, కారు ఒప్పందంలో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ వచ్చిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఎద్దేవా చేశారు. ఆమెకు బెయిల్ రావడం ఊహించిందేనన్నారు. బెయిల్ వెనుక బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయం నడుస్తున్నదని చెప్పారు. హరీశ్‌రావు, కేటీఆర్ ఢిల్లీలో బీజేపీ నేతల చుట్టూ ఆపద మొక్కులు మొక్కారని విమర్శించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలవుతున్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక మహిళ లిక్కర్ స్కామ్‌లో అరెస్టు జైలుకు పోయిందంటే మన రాష్ట్రానికి ఒక మచ్చలా మిగిలిపోయిందన్నారు. కేటీఆర్‌కు తన చెల్లి ఎందుకు జైలు పోయిందో చెప్పుకునే దమ్ము, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న మహిళల గౌరవాన్ని తగ్గించిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదేనన్నారు. మినరల్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ ఢిల్లీలో రాత్రి డీల్ సెట్ అయిందనీ, వెంటనే కవితకు బెయిల్ వచ్చిందన్నారు. హైడ్రా సీఎం రేవంత్‌రెడ్డి ధర్మ యుద్ధం చేస్తున్నారనీ, ఆయన రియల్ హీరో అనీ, లేక్ మాన్ ఆఫ్ తెలంగాణ అని కొనియాడారు.

# 31 నుంచి రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు

- ఇబ్రహీంపట్నంలో మూడు రోజులపాటు నిర్వహణ
- ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్ , వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరు
- జయప్రదం చేయండి : తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ రంగంపై మరింత అవగాహన పెంచడం, రైతాంగ సమస్యలపై పోరాట పటిమను, చైతన్యాన్ని పెంచేందుకు నాయకులకు, కార్యకర్తలకు (300మంది) రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ చెప్పారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో మూడు రోజులపాటు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, రాందాసుపల్లి స్టేజ్ దగ్గర శుభమ్ గార్డెన్‌లో శిక్షణా తరగతులు జరుగుతున్నాయని తెలిపారు. ఏఐకేఎస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్, వ్యవసాయరంగ నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్టు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త అరిబండి ప్రసాద్‌రావుతో కలిసి సాగర్ శిక్షణా తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగంలో తీసుకొస్తున్న మార్పులు,వాతావరణంలో నెలకొన్న మార్పులపై అవగాహన కల్పిస్తామన్నారు. జాతీయోద్యమంలో ఏఐకేఎస్ పాత్ర, రైతాంగ ఉద్యమాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు, వాటిని వెనక్కి కొట్టేందుకు జరిగిన సమరశీల పోరాటంలో ఏఐకేఎస్ పోషించిన పాత్ర అంశాలను వివరిస్తామన్నారు. ఆ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రైతులకిచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం, వడ్డీతోసహా రుణమాఫీ చేయాలనీ, రుణ విమోచన చట్టం చేయాలనీ, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలనీ, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. కౌలు, పోడు, పత్తి, మిర్చి, చెరుకు, ఫౌల్ట్రీ, పండ్ల తోటలు, కూరగాయలు, పాలు తదితర రంగాలకు చెందిన రైతులకు పెరుగుతున్న సాంకేతిక అంశాలపై మరింత అవగాహన కల్పిస్తామన్నారు.

# సంక్షేమాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకిచ్చే ప్రతిపాదన విరమించుకోవాలి



- వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- తక్షణమే బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి : లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా
- అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేత
- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు

నవతెలంగాణ- సిటీబ్యూరో/ విలేకరులు

తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమ కోసమే ఖర్చు చేయాలన్నారు. మంగళవారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ధర్నాలు, ర్యాలీలు తీశారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆయా జిల్లాల కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం సంఘం ప్రతినిధుల బృందం అడిషనల్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మందికిపైగా భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులు 54 వృత్తుల్లో పనులు చేస్తున్నారని, వీరంతా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలకు చెందిన పేదలని అన్నారు. 2009 నుంచి భవన నిర్మాణ కార్మికులకు 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు సంబంధించి కుటుంబాలకు రూ.6.30లక్షలు, సహజ మరణానికి రూ.1.30లక్షలు, వివాహ, ప్రసూతి కానుకగా రూ.30వేల చొప్పున, గాయాలపాలైన సందర్భంలో నష్టపరిహారాలు అందజేస్తున్నారని గుర్తుచేశారు. అయితే, ఈ కేంద్ర చట్టంలో ఉన్న పెన్షన్, పిల్లలకు స్కాలర్‌షిప్, గృహ వసతి, అడ్డాలలో మౌలిక సౌకర్యాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటైనప్పటి నుంచి కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంలో.. ఉన్న సంక్షేమ పథకాలకు నిధులు పెంచడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మిక సంక్షేమం కోసం ఖర్చు పెట్టకుండా.. దారి మళ్లించిందని, వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించకుండా ఇష్టారాజ్యంగా దుబారా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణరంగం కార్మికులుంటే 15.9లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి.. మిగతా 10 లక్షల మంది కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించకుండా అన్యాయం చేస్తోందన్నారు. టెండర్ పాడుకున్న కంపెనీలు చిన్న చిన్న కారణాలు చూపి కార్మికులకు నష్టపరిహారాలు అందకుండా చేసే ప్రమాదం ఉందని, ఇలాంటి కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చే ముందు కార్మిక సంఘాల నాయకులతో, మేధావులతో, అనుభవం కలిగిన నిపుణులతో చర్చించాలని డిమాండ్ చేశారు. 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు ద్వారానే నిధులను కార్మికులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సౌత్ సెక్రటరీ కె.జంగయ్య, మేడ్చల్ ప్రెసిడెంట్ జె.వెంకన్న, రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య, హైదరాబాద్ సెంట్రల్ సిటీ ప్రెసిడెంట్ ఎ.రాజు, నాయకులు డీఎల్ మోహన్, ఎస్.లక్ష్మయ్య, టి.అంజనేయులు, పి.బహ్మయ్య పాల్గొన్నారు.సిరిసిల్ల కలెక్టరేట్ నిరసనలు, ధర్నాలతో దద్దరిల్లింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రయివేటీకరణ చేయొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో, హమాలీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళన చేశారు. కరీంనగర్, భువనగిరి, సూర్యాపేట, నారాయణపేట జిల్లాల్లో ధర్నాలు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంతకుముందు ర్యాలీ తీశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిదులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని డీఆర్‌ఓకు అందజేశారు.



(ఫైల్)

## కుల్గామ్‌లో సీపీఐ(ఎం) నేత
# తరిగామి నామినేషన్

కుల్గామ్ : సీపీఐ(ఎం) నేత, కుల్గామ్ మాజీ ఎంఎల్ఏ తరిగామి మంగళవారం కుల్గామ్ నియోజకవర్గం నుండి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సీట్ల సర్దుబాటులో భాగంగా కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు కుల్గామ్ సీటును సీపీఐ(ఎం)కు కేటాయించాయి. దాంతో ఇక్కడ నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా తరిగామి పోటీ చేస్తున్నారు. 1996 నుంచి వరుసగా నాలుగుసార్లు తరిగామి ఈ నియోజకవర్గం నుంచి గెలిచారు. దేవ్‌సర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని సీపీఐ(ఎం) తొలుత భావించింది కానీ అలయన్స్ భాగస్వామ్య పక్షాల మధ్య చర్చల అనంతరం దేవ్‌సర్ నుంచి సీపీఐ(ఎం) వైదొలగాలని నిర్ణయించింది. నేషనల్ కాన్ఫరెన్స్ నేత డాక్టర్ ఫరూక్ అబ్దుల్లా, తరిగామిల మధ్య చర్చల అనంతరం ఈ మార్పును ధ్రువీకరించారు. అలయన్స్ భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యతను కొనసాగించడం చాలా కీలకమని గ్రహించిన తరిగామి దేవ్‌సర్ నియోజకవర్గం నుంచి వైదొలగేందుకు అంగీకరించారు. సమగ్ర దృక్పథంతో ఎన్నికలకు వెళ్ళేందుకు అలయన్స్ పక్షాలు చేస్తున్న సమిష్టి కృషిని ఈ నిర్ణయం ప్రముఖంగా తెలియచేస్తోంది. సమిష్టి కృషి ప్రభావాన్ని పెంచడంపై దృష్టి కేంద్రీకరిం చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా స్థానిక సమస్యల పరిష్కారంపైనే తరిగామి దృష్టి కేంద్రీకరిస్తున్నారు. కుల్గామ్ నియోజకవర్గం పట్ల తనకు గల నిబద్ధతను కొనసాగిస్తున్నారు.



అనంత్‌నాగ్: బిజ్‌బెహారా నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) చీఫ్ మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ నామినేషన్

# ప్రభుత్వ అనుమతితోనే గెస్ట్ హౌస్

- అక్రమమైతే నేనే కూల్చేసుకుంటా.. : ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రభుత్వం అనుమతిస్తేనే తాను గెస్ట్ హౌస్ నిర్మించుకున్నానని, తాను ఎలాంటి చెరువు భూమినీ కబ్జా చేయలేదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. నిబంధనలు అతిక్రమించినట్టు తేలితే తానే కూల్చేస్తానని స్పష్టం చేశారు. హిమాయత్ సాగర్‌కు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్ హౌస్ నిర్మించుకున్నారని వస్తున్న ఆరోపణలపై మంగళవారం హైదరాబాద్



మాసబ్‌ట్యాంక్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కొత్వాల్‌గూడలోని సర్వే నెం.13లో తన కుమారుడి పేరుతో 14.14 గుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని 1999లో కొనుగోలు చేశామని, 2005లో నిబంధనల మేరకే చిన్న నిర్మాణం కట్టుకున్నామని వివరించారు. అప్పటి ప్రభుత్వం నుంచి, ఇరిగేషన్ శాఖ అనుమతితో నిర్మాణం చేశామన్నారు. తమ కుటుంబానికి చాలా వ్యవసాయ భూములు ఉన్నాయని, ఇంత చిన్న భూమిని కబ్జా చేయాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. అక్కడ ఎలాంటి కాంపౌండ్ లేదని, కావాలంటే మీడియా ప్రతినిధులు సహా ఎవరైనా వెళ్లి చూడొచ్చని చెప్పారు. అవసరమైతే పట్టా కాగితాలు కూడా ఇస్తానన్నారు. వాస్తవానికి అది చిన్న గెస్ట్‌హౌస్ అని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉందనే ఆరోపణల్లో నిజంలేదని చెప్పారు. అక్కడ చుట్టుపక్కల పలు ఫంక్షన్ హాళ్లు, ఇతర నిర్మాణాలు కూడా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలు తెలియకుండా కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇక హైడ్రా ఏర్పాటును ఎమ్మెల్సీ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.

# పుతిన్‌తో మోడీ చర్చలు

## ఉక్రెయిన్ పర్యటనపై వివరణ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే విషయంపై మాట్లాడారు. ఉక్రెయిన్‌లో తాను జరిపిన పర్యటన వివరాలను తెలియజేశారు. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణకు శాంతియుత పరిష్కారం సాధించేందుకు భారత్ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. మోడీ సోమవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో సంభాషించిన విషయం తెలిసిందే.

'ఈ రోజు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాను. రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే విషయంపై చర్చించాను. ఇటీవల నేను ఉక్రెయిన్‌లో జరిపిన పర్యటన వివరాలను తెలియజేశాను. రష్యా-ఉక్రెయిన్ ఘర్షణకు సాధ్యమైనంత త్వరగా, ఇరువురికీ ఆమోదయోగ్యంగా, శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు భారత్ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించాను' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోడీ వివరించారు.

# ముందుగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కూల్చేస్తాం..

## ఒవైసీ, మల్లారెడ్డి అనేది చూడం..విద్యార్థుల భవిష్యత్ ముఖ్యం

- హైడ్రా నోటీసులు ఇవ్వదు :హైడ్రా కమిషనర్, ఐజీ రంగనాథ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎక్కడ అక్రమ నిర్మాణాలు నిర్మించినా వదిలే ప్రసక్తే లేదని, ముందుగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను కూల్చేస్తున్నామని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ముందుకెళ్తున్నామని, పేదల ఇండ్లు, విద్యాసంస్థలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు. ఒవైసీ, మల్లారెడ్డి అనేది చూడమని, విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తామన్నారు. చెరువులను ఆక్రమించి కళాశాల భవనాలు కట్టడం వాళ్ల పొరపాటు.., ఎఫ్‌టీఎల్ అనేది ముఖ్యమైన అంశమే.. దానికంటే విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమన్నారు. ఒవైసీ, మల్లారెడ్డి లాంటి వ్యక్తుల కళాశాలలకు సమయం ఇస్తామని, పార్టీలకు అతీతంగా తమ చర్యలు ఉంటాయని చెప్పారు. ముందస్తుగా హైడ్రా నోటీసులు ఇవ్వదని, పర్మిషన్లు లేని వాటిని కూల్చేస్తామని స్పష్టం చేశారు.

### హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయానికి మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో ఫిర్యాదుదారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు క్యూ కడుతున్నారు. దీంతో హైడ్రా కార్యాలయానికి రోజు రోజుకీ తాకిడి పెరుగుతోంది. మొదట్లో పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు, హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి చేరాయి. వాటన్నింటినీ స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు పెంచారు.

# హైడ్రాకు పూర్తి మద్దతు

- బాధితులకు బిల్డర్ల నుంచి నష్టపరిహారం ఇప్పించాలి
- ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇల్లు కట్టించాలి
- చెరువులను కాపాడేందుకు రాష్ట్ర స్థాయిలో హైడ్రాను విస్తరించాలి : రాష్ట్ర సర్కారుకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఒక స్వచ్ఛంద సేవా సంస్థగా హైదరాబాద్‌లోని చెరువుల పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాకు మద్దతు ఇస్తున్నట్టు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎం.పద్మనాభరెడ్డి ప్రకటించారు. అయితే, అదే సమయంలో హైడ్రా ద్వారా నష్టపోయే పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన మంగళవారం లేఖ రాశారు. చెరువుల ఆక్రమణ ఇంత తీవ్ర రూపం దాల్చడానికి సంబంధిత శాఖ అధికారుల పాత్ర కూడా ఉంటుందనీ, వారి పాత్రపైనా విచారణ జరిపించాలని సూచించారు. అధికారులు, బిల్డర్ల కుమ్మక్కుతో అమాయక పేదలు, మధ్యతరగతివారికి తీవ్ర నష్టం జరుగుతున్న నేపథ్యంలో అక్రమ కట్టడాలు కూల్చినప్పుడు బిల్డర్ నుంచి బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అలా కాని పక్షంలో దగ్గరల్లోని ప్రభుత్వ భూమిని కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వారికి న్యాయం చేయాలని విన్నవించారు. చెరువుల సర్వే నెంబర్లు రిజిస్టర్ చేయవద్దనీ, లేఅవుట్‌లు, ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదని చెబుతూ సంబంధిత శాఖలకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేయాలనీ, ఆ శాఖలు సమన్వయంతో ముందుకెళ్లేలా చూడాలని విన్నవించారు. బిల్డర్లతో కుమ్మక్కై తప్పుడు అనుమతులు ఇచ్చిన రిజిస్ట్రేషన్, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెరువులను రక్షించడమే కాకుండా చెరువులోకి వరద వచ్చే కాలువలో అడ్డంకులు లేకుండా, అలాగే మత్తడి బాగుచేసి చెరువు చుట్టూ కంచెవేయాలని సూచించారు. కాలనీల నుండి చెరువుల్లోకి వచ్చే మురుగునీటిని ఎస్టీపీ ద్వారా శుద్ధి చేయాలని విన్నవించారు. చుట్టూ ఉన్న కాలనీవాసులతో చెరువు రక్షణ కమిటీ ఏర్పాటు చేసి, వారికి చెరువు రక్షణ బాధ్యత అప్పగించాలని సూచించారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, తదితర జిల్లాల్లోనూ చెరువులు ఆక్రమణలకు గురైన నేపథ్యంలో హైడ్రాను రాష్ట్రం మొత్తానికి విస్తరిస్తూ చట్టబద్ధత కల్పించాలని కోరారు.

# కవితకు బెయిల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సర్వోన్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లో రూ. 10 లక్షల చొప్పున పూచీకత్తు విధించింది. అలాగే పాస్‌పోర్ట్‌ను ట్రయల్(రౌస్ ఎవెన్యూ) కోర్టులో అందజేయాలని ఆదేశించింది. సాక్ష్యులను ప్రభావితం చేయరాదని, ఆధారాలను చెరపకూడదని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా రెగ్యులర్‌గా ట్రయల్ కోర్టు ముందు హాజరుకావాలని, కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలనే షరతులను విధించింది. అలాగే కవితకు బెయిల్ నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన ఆదేశాలను పక్కనపెడుతున్నట్టు వెల్లడించింది. ఢిల్లీ మద్యం స్కాంపై ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను రౌస్ ఎవెన్యూ కోర్టు(ట్రయల్), ఢిల్లీ హైకోర్టులు తిరస్కరించాయి. దీంతో ఈ కేసుల్లో మధ్యంతర బెయిల్ కోరుతూ ఈ నెల 7న ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, విక్రమ్ చౌదరిలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జి) ఎస్‌వి రాజు వాదనలు వినిపించారు. తొలుత ముకుల్ రోహిత్గి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న మనీష్ సిసోడియాకు బెయిల్ మంజూరైందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కవితపై ఈడీ, సీబీఐలు వరుసగా చార్జిషీట్ దాఖలు చేశాయని, కేసు విచారణ పూర్తైందని నివేదించారు. కానీ ఈడీ కేసులో ఐదు నెలలు, సీబీఐ కేసులో నాలుగు నెలల నుంచి కవిత కస్టడీలోనే ఉన్నారని వివరించారు. రెండు కేసుల్లో మొత్తం 493 మంది సాక్షులు, దాదాపు 50 వేల పేజీల డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. అయితే విచారణ ఇప్పట్లో ముగిసే అవకాశం లేదని పేర్కొన్నారు. కవిత మాజీ ఎంపీ, ప్రస్తుతం ఎమ్మెల్సీ అని, అందువల్ల ఆమె దేశం విడిచిపోయే పరిస్థితి ఉండదన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం ఆమె బెయిల్‌కు అర్హురాలని వాదించారు. ఈ వాదనలపై జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ 'కవిత సాధారణ మహిళ కాదు, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ' అని గుర్తు చేశారు. కవిత సాధారణ మహిళ కాదంటూ హైకోర్టు పేర్కొన్న ఆదేశాలను ప్రస్తావించారు.

లిక్కర్ స్కాంలో కవిత పాత్ర, ఆధారాలు చెరిపేయడం, సాక్ష్యులను ప్రభావితం చేసిన తీరును ప్రస్తావిస్తూ దర్యాప్తులో తేలిన అంశాలను ఏఎస్‌జి ఎస్‌వి రాజు ధర్మాసనం ముందుంచారు. ఈ కేసులో కవిత సహ నిందితులతో ఫోన్‌లో మాట్లాడిన కాల్ రికార్డ్‌లు, ఫేస్ టైమ్ డేటా, మెసేజ్‌లు కూడా తొలగించినట్టు గుర్తించామన్నారు. ఆధారాలను ట్యాంపర్ చేశారని, తన ఫోన్‌లోని కీలక డేటాను ఫార్మాట్ చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఫోన్‌లో



తల్లితో తనయుడు...

కొన్ని మెసేజ్‌లు దొరికాయని చెప్పారు. దీనిపై స్పందించిన జస్టిస్ కెవి విశ్వనాథన్, ఎవరా నిందితుడని ప్రశ్నించారు. ఇందుకు స్పందిస్తూ గౌతమ్ ముత్తాగా పేరును ఎస్‌వి రాజు బదులిచ్చారు. కాగా జస్టిస్ విశ్వనాథన్ జోక్యం చేసుకొని 'ఫోన్ ఫార్మాట్ చేశారని చెబుతున్నారు. కానీ ఫోన్ ట్యాంపరింగ్‌కు చాలా తేడా ఉంది. ఫోన్లు అనేవి చాలా వ్యక్తిగత అంశం. ఎవరైనా ఎవరితోనైనా వివరాలు పంచుకుంటారు. ప్రజలు తాము పంపిన మేసేజ్‌లు డిలిట్ చేస్తారు. ఈ కోర్టు హాల్‌లో ఉన్న ఎవరైనా ఇలానే చేస్తారు' అని అన్నారు.

ఢిల్లీ లిక్కర్ పాలసీలో భాగమయ్యేందుకు సీఎం కేజ్రీవాల్‌ను కలిసినట్టు నిందితుడిగా ఉన్న మాగుంట శ్రీనివాసులు వాంగ్మూలం ఇచ్చారని ఎస్‌వి రాజు అన్నారు. మొత్తం రూ.50 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఎంపీ పనుల్లో బిజీగా ఉండడంతో రూ. 25 కోట్లు తన కొడుకు మాగుంట రాఘవతో పంపినట్లు మెజిస్ట్రేట్ ముందు స్టేట్మెంట్ ఇచ్చారన్నారు. ఈ సమయంలో జస్టిస్ కెవి విశ్వనాథన్ జోక్యం చేసుకొని, నిందితుడు అప్రూవర్‌గా మారారా? అని ప్రశ్నించగా, ఎస్‌వి రాజు అవునని సమాధానం ఇచ్చారు.

అయితే ఎస్‌వి రాజు వాదనలపై ముకుల్ రోహిత్గి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో సాక్ష్యులందరూ అప్రూవర్లుగా మారారాని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కవితకు వ్యతిరేకంగా ఏఎస్‌జి ఎస్‌వి రాజు చదివిన స్టేట్మెంట్లు అన్ని అప్రూవర్లుగా మారినవారివే అన్నారు. కవిత లేదా సిసోడియా లేదా కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఒక్కొక్కరి నుంచి దాదాపు ఐదు స్టేట్మెంట్లను దర్యాప్తు సంస్థలు రికార్డు చేశాయని చెప్పారు. అరుణ్ రామచంద్ర పిళ్లై తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకునే ముందు నాలుగు స్టేట్మెంట్లు ఇచ్చారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఐదో స్టేట్మెంట్ సందర్భంలో ఆయన కస్టడీలో ఉన్నాడని తెలిపారు. ఇదేనా ఫ్రీ అండ్ ఫెయిర్‌గా దర్యాప్తు సంస్థలు చేస్తోన్న విచారణ అని ప్రశ్నించారు. మధ్యలో ఎస్‌వి రాజు జోక్యం చేసుకొని, తాను ఆధారాలు చూపేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. మరోవైపు రోహిత్గి దర్యాప్తు సంస్థల తీరుపై వాదనలు వినిపిస్తూనే ఉన్నారు. ఈ కేసులో కేజ్రీవాల్, సిసోడియా, కవిత... ఇలా అందరినీ కింగ్ పిన్‌గానే పేర్కొన్నారని తెలిపారు. మాగుంట రాఘవ, శరత్ చంద్రా రెడ్డిలు అప్రూవర్లుగా మారిన వారంలోనే బెయిల్ వచ్చిందన్నారు. ఈడీ, సీబీఐలు వ్యవహరించిన ఈ తీరుపైనే తాము అభ్యంతరం తెలుపుతున్నామన్నారు. అప్రూవర్లు ఇచ్చిన స్టేట్మెంట్లు మినహా... దర్యాప్తు సంస్థల దగ్గర ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇందుకు ఎస్‌వి రాజు అభ్యంతరం తెలుపుతూనే ఉన్నారు. దీంతో జస్టిస్ బీఆర్ గవాయి జోక్యం చేసుకుని, కొంత క్రమశిక్షణగా వ్యవహరించాలని మందలించారు. కవిత నుంచి ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. సాక్ష్యులను బెదిరించినట్టు దర్యాప్తు సంస్థలు చేస్తోన్న ఆరోపణలు ఉట్టివే అన్నారు.

### మూడు కారణాలతో బెయిల్

కవిత బెయిల్‌కు సంబంధించి మూడు ప్రధాన కారణాలతో ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ మంజూరు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీబీఐ తుది చార్జిషీట్ దాఖలు చేసిందని, మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడీ కూడా దర్యాప్తు పూర్తైనట్టు పేర్కొంది. అలాగే నిందితురాలు ఇకపై జైల్‌లో ఉండాల్సిన అవసరం లేదని వెల్లడించింది. ముఖ్యంగా మహిళగా కూడా పరిగణించాల్సి ఉందని అభిప్రాయపడింది. ఈ కారణాలతో కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు స్పష్టం చేసింది.

### ఈ విధానం సరికాదు...:ధర్మాసనం

నిందితుల్లో కొందరిని అప్రూవర్లుగా పరిగణించడంలో ప్రాసిక్యూషన్ విధానాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ఈడీ కేసులో బుచ్చిబాబు, గౌతమ్ ముత్తా, మాగుంట రాఘవ పాత్రలపై జస్టిస్ గవాయి ప్రశ్నించారు. ఇందుకు బదులిస్తూ బుచ్చిబాబు, గౌతమ్ ముత్తాలు ఈడీ కేసులో నిందితులుగా లేరని, సీబీఐ కేసులో అప్రూవర్లుగా మారినట్టు ఎస్‌వి రాజు కోర్టుకు తెలిపారు. మాగుంట రాఘవ పాత్ర మనీలాండరింగ్‌లో లేదన్నారు.

దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం 'ఇప్పటి వరకు మీరు వాదించిన వాదనలతో మీరే ఏకీభవించకపోతే ఎలా? తండ్రి మాగుంట శ్రీనివాసులు చెప్పినట్లు రాఘవ రెడ్డి, కవితకు బదులు బుచ్చిబాబుకు రూ. 25 కోట్లు ఇచ్చారన్నారు.

మరి ఇప్పుడు ఇలా మాట మార్చడం సరికాదు' అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ప్రాసిక్యూషన్ న్యాయంగా ఉండాలి. తనను తాను నేరారోపణ చేసే వ్యక్తిని సాక్షిగా మార్చారు. రేపు ఎవరినైనా మీ ఇష్టం వచ్చినట్లు అదుపులోకి తీసుకుంటారా?. అలా చేసుకోలేరు. ఏ ఆరోపణనైనా న్యాయ, సహేతుక విచక్షణతో ఉండాలి' అని సూచించింది. కేవలం బెయిల్ అంశాల గురించి గంటన్నర పాటు వాదనలు సరికాదన్నారు. మహిళలకు సంబంధించి సీఆర్‌పీసీ, పీఎంఎల్ఏ, ఇతర సెక్షన్ల కింద పలు మినహాయింపులు ఉన్నాయన్నారు. అయితే... మధ్యాహ్నం తరువాత తుది వాదనలు వినిపిస్తామని ఎస్‌వి రాజు అభ్యర్థించగా, మధ్యాహ్నమైనంత మాత్రాన తమ తీర్పు దర్యాప్తు సంస్థలకు అనుకూలంగా ఉండదని స్పష్టం చేశారు. కవితకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు.

### చదువుంటే బెయిల్ ఇవ్వకపోవడం సరికాదు

ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్, సెక్షన్ 45(1) ప్రకారం బెయిల్ విషయంలో మహిళలు ప్రత్యేక పరిశీలనకు అర్హులని ధర్మాసనం స్పష్టం చేసింది. అసాధారణ మహిళగా పేర్కొంటూ కవితకు హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. 'ఇలాంటి తీర్పులు వెలువరించే సమయంలో కోర్టులు న్యాయపరంగా విచక్షణను ఉపయోగించాలి. కేవలం ఒక మహిళ బాగా చదువుకుంటే, అధునాతమైనది(సోఫెస్టికేటెడ్), పార్లమెంట్ సభ్యురాలు, శాసన మండలి సభ్యులు అయినంత మాత్రాన బెయిల్‌కు అర్హత లేదని చెప్పకూడదు' అని కోర్టు పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు సెక్షన్ 45కు సంబంధించిన నిబంధనలను తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. ఆ తీర్పును పక్కన పెడుతున్నట్టు స్పష్టం చేసింది.

## నేటినుంచి ఇంజినీరింగ్ స్పాట్ అడ్మిషన్లు

- 30 నుంచి 2 వరకు కాలేజీల్లో ప్రవేశాలు : ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లకు బుధవారం నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీలు, బ్రాంచ్‌ల వారీగా ఖాళీ సీట్ల వివరాలను https.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బుధవారం కాలేజీలు ఖాళీ సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు. గురువారం పత్రికల్లో నోటిఫికేషన్‌ను జారీ చేయాలని సూచించారు. ఈనెల 30 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. అదేనెల మూడున స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేనెల నాలుగో తేదీ నాటికి ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థుల వివరాలతోపాటు హార్డ్ కాపీని హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సాంకేతిక విద్యాభవన్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్ల వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 86,943 సీట్లున్నాయి. ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ తర్వాత 75,107 (86.4 శాతం) మందికి సీట్లు కేటాయించారు. కన్వీనర్ కోటాలో ఇంకా 11,836 (13.6 శాతం) సీట్లు మిగిలాయి.

## అడవిలో గొర్రెలను మేపుకోనివ్వండి


- గొర్రెలిచ్చారు...గడ్డి కోసం ఇంత జాగ చూపలేదు : అరణ్యభవన్ ఎదుట గొర్రెకాపర్ల ధర్నా, పీసీసీఎఫ్ డోబ్రియల్‌కు వినతి



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

మద్దిమడుగు, పదర ప్రాంతాల్లో నల్లమల అడవిలో గొర్రెలను మేపుకోవడానికి అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ పాలమూరు కురుమ సంఘం నాయకులు శంకరోళ్ల రవికుమార్, ఎస్.వెంకటేశ్ కురుమ డిమాండ్ చేశారు. 'అడవిలో గొర్రెలను మేపుకోనివ్వండి..గొర్రెల కాపర్లపై అటవీ అధికారుల దాడులు ఆపాలి' అంటూ కురుమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్ ఎదుట పాలమూరుకు చెందిన పలువురు గొర్రెల కాపరులు ధర్నా నిర్వహించారు. అనంతరం నాయకులు, గొర్రెల కాపర్లతో కూడిన బృందం అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం.డోబ్రియల్‌కు వినతిపత్రం అందజేసింది. జీవాలను మేపే క్రమంలో అటవీశాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాపర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి డోబ్రియల్ హామీనిచ్చారు. అంతకుముందు ధర్నానుద్దేశించి రవికుమార్, వెంకటేశ్ కురుమ మాట్లాడుతూ..ప్రభుత్వం గొర్రెలను ఇచ్చిందిగానీ, వాటిని మేపుకోవడానికి జాగ చూపలేదని వాపోయారు. గొర్రెలను మేపడానికి గడ్డిమడులు పెంచేందుకు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొద్దస్తమానం అడవిలో తిరుగుతూ జీవాలను మేపుకునే కాపర్లపై అటవీశాఖ అధికారుల దాడులు చేయడం సరిగాదన్నారు. వంటపాత్రలను ధ్వంసం చేయడాన్నీ, కాపర్లను కొట్టడాన్నీ ఖండించారు. పట్టాదారులు తమ పంట భూముల్లోకి గొర్లను రానివ్వరనీ, అటవీ అధికారులు అడవిలో మేపుకోనివ్వడం లేదని వాపోయారు. తాము ఎలా బతకాలని అటవీశాఖ అధికారులను ప్రశ్నించారు. చావమంటే ఇక్కడే చావడానికి సిద్ధమని చెప్పారు. ఈ ధర్నాలో శ్రీనుకురుమ, కె.శ్రీనివాస్ కురుమ, జటారం కృష్ణ, కె.రాములు, పూజారి శివకుమార్, పూజారి ప్రవీణ్, జటారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సప్తర్షి హోటల్‌కు టూరిజం శాఖ భూమివ్వటంపై పిల్



**నవతెలంగాణ-హైదరాబాద్**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మూడెకరాలను 2010లో అప్పటి ఉమ్మడి ఏపీ సర్కార్, టూరిజం శాఖ సప్తర్షి హెూటల్‌కు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ పిల్ దాఖలైంది. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ మంగళవారం విచారించి ప్రతివాదులకు నోటీసులిచ్చింది. ఆంధ్ర, తెలంగాణ పర్యాటక శాఖలు, సీబీఐ, సీసీఎల్‌ఏ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్, మహా హోటల్స్ ప్రయివేటు లిమిటెడ్, సప్తర్షి హోటల్స్ ప్రయివేటు లిమిటెడ్‌లు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గచ్చిబౌలిలోని సర్వే నెంబర్91లో మూడెకరాలను సప్తర్షి హెూటల్‌కు 2010లో ఇస్తే దానిని ప్రభుత్వ అనుమతి లేకుండా దాన్ని బ్యాంకులో కుదవపెట్టిందనీ, విచారణను సీబీఐకి ఇవ్వాలని బక్కా జడ్సన్ పిల్‌లో పేర్కొన్నారు. బ్యాంకులో తనఖా పెట్టి తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో ఆ భూమిని పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్వాధీనం చేసుకుందని కూడా వివరించారు. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

### మెడికల్ అడ్మిషన్లలో స్థానికతపై వాదనలు

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు పొందే వాళ్ల స్థానికత విషయంపై ప్రభుత్వం నిబంధన మార్పును సవాల్ చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ మంగళవారం విచారించింది. 'జులై 19న జారీ చేసిన జీవో33 నీట్ నోటిఫికేషన్ జారీ అయ్యాక ఇవ్వడం చెల్లదు. నోటిఫికేషన్ జారీ అయ్యాక నిబంధనల మార్పు చెల్లదు. స్థానికత వివాదంపై గతేడాది ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా జీవో ఉంది. కొత్త రూల్స్ ప్రకారం అడ్మిషన్‌కు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివి ఉండాలి. గతంలో పదో తరగతి వరకు చదివి తల్లిదండ్రులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళితే తెలంగాణలో శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోయేది. తెలంగాణ వాళ్లకు అన్యాయం జరిగేలా జీవో ఉంది' అని పిటిషనర్లు వాదించారు. ప్రభుత్వ వాదనలు బుధవారం జరుగుతాయి. ప్రభుత్వం సవరించిన నిబంధనతో నిమిత్తం లేకుండా శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తులను స్వీకరించాలంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని హైకోర్టు వెల్లడించింది.

### బీకేగూడ ఆటస్థలంపై పిల్ కొట్టివేత

హైదరాబాద్‌లో గల సంజీవరెడ్డినగర్ పరిధిలోని బి.కె.గూడలో సర్వే నెం.102/3, 102/2లోని 1537 చదరపు గజాల ఆటస్థలంపై దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ వివాదాన్ని సివిల్ కోర్టులో తేల్చుకోవాలని తేల్చి చెప్పింది. ఈ విషయంపై పిటిషన్ వేసిన విషయాన్ని చెప్పకపోవడంతో పిల్‌ను కొట్టివేసింది. వాస్తవాలను కప్పిపుచ్చి పిల్ వేయడాన్ని తప్పుపట్టింది. భూమి ప్రస్తుతం ఎవరి స్వాధీనమో అనే అంశంపై సివిల్ కోర్టులో తేల్చుకోవాలంది.

# జైలు నుంచి కవిత విడుదల

- ఐదు నెలల తరువాత బయటకు..
- స్వాగతం పలికిన కొడుకు, భర్త అనిల్, కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ మంత్రులు, పార్టీ శ్రేణులు
- కంటతడి పెట్టిన ఎమ్మెల్సీ
- దాదాపు 146 రోజులు జైల్లో
- నేను మొండిదాన్ని..మంచి దాన్ని : కవిత

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సరిగ్గా ఐదు నెలల తరువాత బెయిల్‌పై విడుదలయ్యారు. దాదాపు 146 రోజులు ఆమె జైలులోనే గడిపారు. మంగళవారం కోర్టు ఆదేశాలతో రాత్రి 9:10 గంటలకు ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు. ఆమెకు కొడుకు ఆర్య, భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీశ్‌రావు, మాజీ మంత్రులు, ఎంపీలు, పార్టీ నేతలు పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. విక్టరీ సింబల్ చూపిస్తూ బయటకు వచ్చిన ఆమె కొడుకు, భర్త, అన్నను చూడగానే భావోద్వేగానికి గురయ్యారు. వారిని పట్టుకొని ఏడ్చారు. అనంతరం చిరునవ్వుతో కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ కారు ఎక్కి మీడియాతో మాట్లాడారు. అక్కడి నుంచి కేటీఆర్, హరీశ్‌రావుతో కలిసి ఢిల్లీ వసంత్ విహార్‌లోని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌కు చేరుకున్నారు. అక్కడ మహిళా కార్యకర్తలు కవితకు గుమ్మడికాయతో దిష్టితీసి స్వాగతం పలికారు. రాత్రంతా ఆమె పార్టీ ఆఫీసులోనే ఉండనున్నట్టు బీఆర్ఎస్ ముఖ్య నేతలు తెలిపారు. కాగా... కవితకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తీహార్ జైలుకు వచ్చారు. ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, పార్టీ నేతలు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ కవిత, ముత్తిరెడ్డి, యాదగిరిరెడ్డి, కౌశిక్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి, శంభీపూర్ రాజు, వివేక్ గౌడ్, ఇతర నేతలు వచ్చారు. కార్యకర్తలు డప్పు చప్పుళ్లు, బాణాసంచా కాలుస్తూ... జై తెలంగాణ, జై కవిత అంటూ నినాదాలు చేశారు. కాగా, ఈ రోజు మధ్యాహ్నం 2:45 నిమిషాలకు కవిత హైదరాబాద్ చేరుకోనున్నారు.



### వడ్డీతో పాటు చెల్లిస్తాం... నేను మొండి, నన్ను జగమొండిని చేశారు: కవిత

తన తప్పు లేకపోయినా రాజకీయ దురుద్దేశంతో అన్యాయంగా జైల్లో పెట్టారని, ఈ విషయం దేశంలో అందరికీ తెలుసునని ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి గురయ్యారు. తాను ఫైటర్ అని, తప్పకుండా పోరాడుతానన్నారు. తనను, తన కుటుంబాన్ని ఇబ్బందికి గురిచేసిన వారికి వడ్డీతో పాటు చెల్లిస్తామని ఆమె హెచ్చరించారు. అందుకు సమయం వస్తుందన్నారు. తాను ఇప్పుడు ఎవరి గురించి చెప్పాల్సిన అవసరం లేదని, తాను తెలంగాణ బిడ్డను, కేసీఆర్ బిడ్డనన్నారు. తాను మొండిదాన్ని అని, కానీ మంచి దాన్ని అని అన్నారు. అయితే... జైలుకు పంపి జగమొండిని చేశారని తెలిపారు. ప్రజా క్షేత్రంలో ఇంకా గట్టిగా పని చేస్తామని, కమిట్‌మెంట్‌తో ముందుకెళ్తామన్నారు. తీహార్ జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత తాను కారెక్కి తొలిసారి ఉద్వేగభరితంగా మీడియాతో మాట్లాడారు. 'ఐదున్నర నెలల తరువాత మిమ్మల్ని కలవడం సంతోషకరం. ఇక్కడికి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలకు నా నమస్కారాలు. 18 ఏండ్లు రాజకీయాల్లో ఉన్నాను. ఎన్నో ఎత్తు పల్లాలు చూశాను. కానీ పర్సనల్‌గా... నాకు, నా కుటుంబానికి ఐదున్నర నెలలుగా పిల్లల్ని వదిలి ఉండడం ఇబ్బంది కర విషయం' అని చెప్పారు. ఇలాంటి ఇబ్బందికర సమయంలో నా వెంట, కుటుంబం వెంట ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలకు పాదాభివందనం అన్నారు. ఈ విషయంలో లీగల్‌గా, పొలిటికల్ గా పోరాడుతామన్నారు. తనను జైలుకు పంపారని, కానీ బీఆర్ఎస్‌ను విడగొట్టలేకపోయారని చెప్పుకొచ్చారు.

### మార్చి 26 నుంచి జైల్లోనే

ఈ ఏడాది మార్చి 15న సోదాల పేరుతో ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం 5:20 నిమిషాలకు ఆమెను అరెస్ట్ చేసి... అర్ధరాత్రి ఢిల్లీలోని ఈడీ హెడ్ ఆఫీస్‌కు తరలించారు. తర్వాతి రోజు మార్చి 16న కవితను ఈడీ అధికారులు సీబీఐ స్పెషల్ కోర్టు(రౌస్ ఎవెన్యూ) లో ప్రొడ్యూస్ చేశారు. ఆమెకు పలు దఫాలుగా 14 రోజులు ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ గడువు పూర్తైన తర్వాత... మరోసారి మార్చి 26న ఆమెను కోర్టులో ప్రొడ్యూస్ చేయగా... స్పెషల్ జడ్జ్ కవితకు జ్యుడీషియల్ కస్టడీ విధించగా పోలీసులు ఆమెను తీహార్ జైలుకు తరలించారు. ఆమె తీహార్ జైల్‌లో ఉండగానే... ఇదే కేసుకు సంబంధించి ఏప్రిల్ 6న సీబీఐ అధికారులు ఆమెను విచారించారు. ఈ విచారణను సవాల్ చేస్తూ కవిత కోర్టును ఆశ్రయించగా, ఆమెకు ఊరట దక్కలేదు. ఇదిలా ఉండగానే ఏప్రిల్ 11 (రంజాన్) న సీబీఐ కవితను అదుపులోకి తీసుకొని హెడ్ ఆఫీస్‌కు తరలించింది. తరువాతి రోజు కవితను కోర్టులో ప్రొడ్యూస్ చేయగా.. మూడు రోజుల సీబీఐ కస్టడీకి కోర్టు అనుమతించింది. తిరిగి ఏప్రిల్ 15న కవితను కోర్టులో హాజరు పరుచగా... ఆమెకు సీబీఐ కేసులో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో అప్పటి నుంచి ఆమె తీహార్ జైల్‌లోనే ఉంటున్నారు. కాగా, తాజాగా కవిత అనారోగ్యం దృష్ట్యా పలు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు గంటపాటు ఆమెను ఏయిమ్స్‌కు తరలించారు.

### గతంలో సుప్రీం, ఢిల్లీ హైకోర్టు, ట్రయల్ కోర్టులో దక్కని ఊరట

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు గతంలో సుప్రీంకోర్టు, ట్రయల్ కోర్టు, ఢిల్లీ హైకోర్టుల్లో ఊరట దక్కలేదు. ఈడీ అరెస్ట్ తర్వత బెయిల్ మంజూరు చేయాలని కవిత తొలుత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన త్రిసభ్య ధర్మాసనం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచిస్తూ బెయిల్ నిరాకరించింది. అనంతరం మైనర్ కొడుకు ఎగ్జామ్స్ నేపథ్యంలో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆమె ట్రయల్ కోర్టులో పిటిషన్ వేశారు. అయితే కొడుకు ఎగ్జామ్స్ బాధ్యత తల్లిదే కాకుండా తండ్రిది కూడా అంటూ కీలక కామెంట్స్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అనంతరం ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా... ట్రయల్ కోర్టు దర్యాప్తు సంస్థల వాదనలతో ఏకీభవిస్తూ బెయిల్ మంజూరు చేయలేదు. దీంతో ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ మే మూడో వారంలో కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే రెండు రోజుల పాటు కవిత పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలు విన్న ఏకసభ్య ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. జూన్ 1 నుంచి హైకోర్టు సెలవుల నేపథ్యంలో అంతకన్నా ముందే బెయిల్ వస్తుందని కవిత ఆశించారు. కానీ సెలవుల కారణంగా దాదాపు నెల రోజుల తర్వాత అంటే కోర్టు రీఓపెన్ అయ్యాక(జులై 1) హైకోర్టు తీర్పు వెలువరించింది. అయితే... ఈ తీర్పులో కవిత బెయిల్‌ను నిరాకరిస్తున్నట్టు కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ కవిత మరోసారి సుప్రీంను ఆశ్రయించగా... మంగళవారం ఆమెకు బెయిల్ మంజూరైంది.

**ఉదయం 11:10 :విచారణ వినేందుకు కోర్టుకు హాజరైన కేటీఆర్, హరీశ్**
**ఉదయం 11:40 :కవిత పిటిషన్ పై విచారణ ప్రారంభం**
**మధ్యాహ్నం 1:10 :బెయిల్ ఇస్తూ సుప్రీం ఆదేశం**
**మధ్యాహ్నం 3:20 : కవిత బెయిల్ ఆర్డర్ కాపీ అప్ లోడెడ్**
**సాయంత్రం 4.20 : రౌస్ అవెన్యూ రిలీజ్ వారెంట్**
**రాత్రి 9:10 :తీహార్ నుంచి కవిత రిలీజ్**
**రాత్రి 9:40 :వసంత్ విహార్ పార్టీ ఆఫీస్‌కు రీచ్ అయ్యారు.**

### రేవంత్, బండి మధ్య చీకటి ఒప్పందం : బీఆర్ఎస్ నేతలు

కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య చీకటి ఒప్పందం ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కవితకు బెయిల్ మంజూరు తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు గంగుల, వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు మీడియాతో మాట్లాడారు. కవితకు బెయిల్‌పై బీజేపీ, కాంగ్రెస్ నేతల విమర్శలను ఖండించారు. కవిత బెయిల్‌పై సంజయ్‌కు అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. బెయిల్ వచ్చిన కొద్ది నిమిషాలకే అంతలా స్పందించాల్సిన అవసరం ఏముందని ఫైర్ అయ్యారు. బండి సంజయ్, రేవంత్‌ల మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బెంగాల్ నుంచి రాష్ట్రానికి వచ్చిన అక్రమ డబ్బు, రాష్ట్రంలో రేవంత్ కుటుంబ సభ్యులు చేసిన స్కాంపై ఎందుకు సంజయ్ మాట్లాడడం లేదన్నారు. అలాగే.. హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీకి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎందుకు స్పందించడం లేదన్నారు.

### అనిల్, వద్దిరాజు పూచీకత్తు

కవిత బెయిల్‌కు సంబంధించి ఈడీ, సీబీఐ కేసుల్లో రూ. 10 లక్షల చొప్పున కవిత భర్త అనిల్, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రలు పూచీకత్తు చెల్లించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం రౌస్ అవెన్యూ కోర్టులో ఈ పూచీకత్తును కట్టారు. అనంతరం కోర్టు 4:20 నిమిషాలకు కవిత రిలీజ్ వారెంట్ విడుదల చేసింది. ఆ కాపీని అనిల్, వద్దిరాజులు తీహార్ జైలు సిబ్బందికి అందజేశారు.

# వీసీల నియామకంపై కసరత్తు ముమ్మరం

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఆశావహుల పైరవీలు షురూ
- సామాజిక వర్గాల ఆధారంగానే ఎంపిక
- వీలైనంత త్వరగా సెర్చ్ కమిటీ తేదీల ఖరారు
- సభ్యులతో విద్యాశాఖ అధికారుల సంప్రదింపులు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'రాష్ట్రంలో 10, 15 రోజుల్లోనే అన్ని విశ్వవిద్యాలయాలకూ ఉపకులపతుల (వీసీ)ను నియమిస్తాం. వర్సిటీల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఆర్థిక సాయం చేసిన కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. సీఎం ప్రకటనతో ఆశావహుల పైరవీలు మళ్లీ ప్రారంభమయ్యాయి. వారికి తెలిసిన మంత్రులు, ఇతర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారులను కలిసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. సెర్చ్ కమిటీలకు దరఖాస్తు చేసిన వివరాలను గతంలోనే వారికి వివరించారు. తాజాగా సీఎం ప్రకటించడంతో మరోసారి ప్రసన్నం చేసుకునే ప్రయత్నిస్తున్నారు. అయితే విశ్వవిద్యాలయాలకు వీసీల నియామకంపై కసరత్తు ముమ్మరం కానుంది. విద్యాశాఖ అధికారులు ఇదే పనిలో నిమగ్నం అయ్యే అవకాశమున్నది. రెగ్యులర్ వీసీల పదవీకాలం మే 21న ముగిసిన విషయం తెలిసిందే. అదేరోజు ఐఏఎస్ అధికారులకు ఇన్‌చార్జీ వీసీల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. అయితే రెగ్యులర్ వీసీల పదవీకాలం ముగియకముందే అంటే మే 17న వీసీల నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీలను నియమించింది. పది విశ్వవిద్యాలయాలకు వేర్వేరుగా సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఒక్కో యూనివర్సిటీకి సంబంధించిన సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. అందులో యూజీసీ నామినీ, రాష్ట్ర ప్రభుత్వ నామినీ, విశ్వవిద్యాలయం నామినీ ఉంటారు. ప్రభుత్వ నామినీగా అన్ని వర్సిటీలకూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. సెర్చ్ కమిటీ సభ్య కార్యదర్శిగా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఉన్నారు. సెర్చ్ కమిటీలోని ప్రభుత్వ నామినీ, యూజీసీ నామినీ, వర్సిటీ నామినీతో విద్యాశాఖ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. వారి మధ్య ఏకాభిప్రాయం రాగానే విశ్వవిద్యాలయాల వారీగా సెర్చ్ కమిటీ భేటీ తేదీలను ఖరారు చేసే అవకాశమున్నది. వారం, పది రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

సామాజిక వర్గాల ఆధారంగానే వీసీలను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఏ ఒక్క సామాజిక తరగతికి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశమున్నది. అగ్రకులాలకు ప్రాధాన్యత ఇస్తూనే ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు, మహిళలు ఇలా అందరికీ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేసింది. సెర్చ్ కమిటీ భేటీల తేదీలు ఖరారయ్యేలోగా ఏ విశ్వవిద్యాలయానికి ఎవరు వీసీ అనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశమున్నది.

పది విశ్వవిద్యాలయాలకు వీసీల కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రంలో పది వర్సిటీలకు 320 మంది ప్రొఫెసర్లు 1,382 దరఖాస్తులను సమర్పించారు. అత్యధికంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ)కు 208, ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)కు 193, పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ)కు 159, శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ)కు 158, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ)కు 157, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)కు 149, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ)కు 135, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్‌కు 106, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ (పీఎస్టీయూ)కి 66 దరఖాస్తులొచ్చాయి. అత్యల్పంగా జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ)కు 51 దరఖాస్తులను సమర్పించారు. వాటిని సెర్చ్ కమిటీ పరిశీలించి ముగ్గురు పేర్లను ఖరారు చేసి ప్రభుత్వానికి పంపిస్తుంది. ఆ ముగ్గురి పేర్లతో ఉన్న జాబితాను గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపిస్తుంది. గవర్నర్ ఆమోదంతో వీసీల పేర్లను ప్రభుత్వం ప్రకటిస్తుంది.

# ధరల దరువు

## సామాన్యుడు విలవిల

- నెల ఖర్చులో సగం ఆహారానికే ! • పండగ వేళ కష్టకాలం

**న్యూఢిల్లీ** :నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు దాటి పరుగులు తీస్తున్నాయి. దీంతో సామాన్యుడి పరిస్థితి ఘోరంగా మారుతోంది. వినియోగ ధరల సూచీ ప్రకారం గత నెలలో ద్రవ్యోల్బణం 3.5 శాతానికి చేరింది. గత ఐదు సంవత్సరాల కాలంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఇంత తక్కువగా నమోదు కావడం ఇదే మొదటిసారని ప్రభుత్వం చెబుతోంది. అయినా, ప్రజల కష్టాలు తగ్గకపోగా, మరింతగా పెరుగుతుండటంతో ఈ లెక్కల విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. కీలకమైన ఆహార వస్తువుల ధరలు ఏమాత్రం తగ్గకపోవడమే దీనికి కారణం, వినియోగ ధరల సూచీలో ఆహారం, సంబంధిత వస్తువుల వాటా 46 శాతం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువగా అంటే 54 శాతంగా ఉంది. ఫలితంగా సాధారణ భారతీయ కుటుంబం తన నెలసరి వ్యయంలో సగం ఆహారం, దాని అనుబంధ వస్తువుల కొనుగోలుకే ఖర్చు చేస్తోంది. వినాయకచవితి, దసరా, దీపావళి పండగల వేళ కష్టకాలం నెలకొనడం సామాన్యుడిని ఆందోళనకు గురిచేస్తోంది. రుతుపవనాల ద్వారా దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, కూరగాయల ఉత్పత్తిపై ఈ ప్రభావం పడటం కూడా దీనికి కారణం. కీలకమైన ఉల్లి, బంగాళాదుంపల ద్రవ్యోల్బణం జులై నెలలో 60.54, 65.64 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే సీజన్‌లో ఆలూ ఉత్పత్తి 6 శాతం, ఉల్లి ఉత్పత్తి 20 శాతం తగ్గింది. వర్షాలు కురవడంలో జాప్యం కారణంగా ఈ ఏడాది ఉత్పత్తి ఇంకా మార్కెట్‌లోకి రాలేదు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఆలూ ఉత్పత్తి అక్టోబర్‌లో మార్కెట్‌లోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



ఈలోగా ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పప్పులు, నూనెల ధరలు పైపైకే చూస్తున్నాయి. దీంతో పెద్ద ఎత్తున దిగుమతులు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే, నెలవారీ తలసరి వ్యయంలో అధికశాతం ఆహారం మీద ఖర్చు చేయాల్సిరావడం ఏమాత్రం మంచిది కాదన్న అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

### వడ్డీ రేట్లు తగ్గవచ్చు

రిటైల్ ద్రవ్యోల్బణం తక్కువగా ఉండడంతో ఆర్‌బిఐ భవిష్యత్తులో తన వడ్డీ రేట్లు తగ్గించవచ్చని కొందరు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. . దీనివల్ల పెట్టుబడులు, వినియోగం పెరుగుతాయని, దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని వారు అంటున్నారు. అయితే, కీలకమైన ఆహార ద్రవ్యోల్బణాన్ని వారు పట్టించుకోవడం లేదు.

### పదిశాతం మందికే 25వేల కన్నా అధిక వేతనం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్‌నెస్ సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం భారతీయుల్లో కేవలం 10 శాతం మంది మాత్రమే నెలకు రూ.25,000 కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. అంటే అత్యధిక ప్రజానీకం నామమాత్రపు జీతాలతో నెట్టుకొస్తున్నారు. వీరందరికి కోవిడ్ తర్వాత కుటుంబ బడ్జెట్ నిర్వహణ కష్టంగా మారింది. ఇదే విషయమై సీఓటర్ డెయిలీ ట్రాక్ పోల్ అడిగిన ప్రశ్నకు నాలుగింట మూడు వంతుల మందికి పైగా అవుననే జవాబిచ్చారు.

## హర్యానా అసెంబ్లీ ఎన్నికలలోజేజేపీ- ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) పొత్తు

**న్యూఢిల్లీ** : రానున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జననాయక్ జనతా పార్టీ (జేజేపీ), ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని జేజేపీ అధ్యక్షులు, హర్యానా మాజీ ఉపముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో సంయుక్తంగా ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా, జేజేపీ 70 స్థానాల్లోనూ, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) 20 స్థానాల్లోనూ పోటీ చేయనున్నట్టు చెప్పారు. ఈ కూటమిపై దుశ్యంత్ చౌతాలా విశ్వాసం ప్రకటించారు. హర్యానాకు ఉత్తమ భవిష్యత్‌ను నిర్మించడానికి రైతులు, కార్మికులు ఏకమయ్యారని తెలిపారు. అక్టోబర్ 1న ఒకే దశలో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం

- వచ్చే రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- 30, 31, ఒకటో తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. 28, 29 తేదీల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. ఈ మేరకు వరంగల్, హన్మకొండ, జనగాం, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. 30న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. 31న భారీ నుంచి అతి భారీ వర్షాలు పడొచ్చు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, నల్లగొండ, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశముంది. సెప్టెంబర్ ఒకటో తేదీన జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలుండటంతో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. అదే రోజు కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు తేలికపాటి జల్లులు పడే సూచనలున్నాయి. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు రాష్ట్రంలో 197 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది.

## ప్రాణం తీసిన చేపల వేట సరదా

- వాగులో పడి ముగ్గురు అన్నదమ్ములు మృతి
- కూలి పనుల కోసం వలస వచ్చిన కుటుంబం



**నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్**

పొట్టకూటి కోసం స్వగ్రామం నుంచి పక్క రాష్ట్రం వలస వచ్చిన కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. వాగులో సరదాగా చేపల వేటకు వెళ్లిన ముగ్గురు అన్నదమ్ములు మృతిచెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా రూరల్ మండలం లోని పొచ్చర గ్రామంలో మంగళ వారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని నవీబస్తీకి చెందిన నగల్వాడే రాజు ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని బండల్‌నాగపూర్ గ్రామానికి వలస వచ్చాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ముగ్గురు కుమారులు నగల్వాడే విజయ్(28), ఆకాష్(25), అక్షయ్(22). విజయ్ లారీ డ్రైవర్. మిగతా ఇద్దరు కూలి పనులు చేసేవారు. ముగ్గురూ కప్పర్లలో ఉన్న వారి బంధువుల ఇంటికి వచ్చారు. తమ బంధువు కామ్రే శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం ఉదయం పొచ్చర వాగు వద్దకు వచ్చి, సరదా గా చేపలు పట్టారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఒకరు నీటిలో పడిపోవ డంతో.. అతన్ని కాపాడే క్రమంలో మరొకరు.. ఇలా ముగ్గురు అన్నదమ్ములు నీట మునిగిపోయారు. అక్కడే ఉన్న కామ్రే శ్రీకాంత్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగెత్తుకొచ్చారు. కానీ అప్పటికే ముగ్గురూ నీటిలో గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఫణిధర్, ఎస్ఐ ముజాహిద్ ఘటనా స్థలానికి చేరుకుని డీడీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఈతగాళ్లను రంగంలోకి దింపి గాలింపు చేపట్టారు. డీఎస్పీ జీవన్ రెడ్డి గాలింపు చర్యలను పరిశీలించారు. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. ఘటనా స్థలం వద్ద కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. విజయ్‌కి భార్య, పది నెల కుమారుడు ఉండగా, ఆకాష్‌కు భార్య ఉంది. అక్షయ్‌కి కూడా ఇటీవల వివాహ మైనట్టు సీఐ ఫణిధర్ తెలిపారు. కూలీ పనుల కోసం వారం కిందట వీరి కుటుంబం నాందేడ్ నుంచి బండల్‌నాగాపూర్ వచ్చిందని చెప్పారు. సరదా కోసం వెళ్లి ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములూ మృతిచెందడంపై స్థాని కులు సైతం కన్నీరు పెట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

# నేడు డయల్ యువర్ డీఎం

**నవతెలంగాణ-నాగోల్**

నాగోలు డివిజన్‌లోని బండ్లగూడ ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రయాణికుల అభిప్రాయాలు సలహాలు, సూచనల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ టీజీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ టి. వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు గంట పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో బండ్లగూడ ఆర్టీసీ డిపో బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులు బస్సుల వేళలు మరియు చేర్పులు మార్పుల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొని 9959 2240 58 నెంబర్ ఫోన్ ద్వారా సలహాలు, సూచనలు, ఫిర్యాదులు అందించాలని డిపో మేనేజర్ పేర్కొన్నారు. వారిచ్చిన సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని అమలుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.



సుప్రీంకోర్టు కవితకు బెయిల్ ఇచ్చిన సందర్భంగా ఎల్బీనగర్ కొత్తపేట్ భారత జాగృతి విద్యార్థి నాయకులు నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ- కొత్తపేట



### జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంపై

# సీఎంతో చర్చించి పరిష్కరిస్తా

- జీహెచ్ జే సొసైటీ నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రి మండలి దృష్టికి తీసుకువెళ్ళి త్వరలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టులు సభ్యులుగా ఉన్న తమ సొసైటీకి ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరారు. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు మంత్రికి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను వివరించారు. తమ సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులున్నారని, వీరిలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం చాలా ఏండ్లుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం పదేండ్లు కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులంతా తమకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకంతో ఉన్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి క్యాబినెట్ ఆమోదం ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలిస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రతినిధులు పులిపలుపుల ఆనందం, సీతారామరాజు, వీరారెడ్డి, పి.నాగవాణి, వేముల పుష్పలత, డి. వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

# గత ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలి

- నబీల్ కాలనీ అస్తవ్యస్తం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ నాలాల అభివృద్ధి చేయడం కోసం మంజూరు చేసిన నిధులను నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం వలన నబీల్ కాలనీ అస్తవ్యస్తంగా తయారైందని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 3వ వార్డులోని నబిల్ కాలనీలో ఎమ్మెల్సీ మిర్జద్ అహమ్మద్ బేగ్‌తో కలిసి మంగళవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. తర్వాత ఎస్ఎన్‌డీపీ నాలాల పనులను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నిలిచిపోవడం జరిగిందన్నారు. తనకు రావాల్సిన బిల్లును ప్రభుత్వం అడ్డుకోవడం వలన ఈ పనులు నిలిపివేసినట్టు కాంట్రాక్టర్ వెల్లడించారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు రావాల్సిన నిధులను వెంటనే మంజూరు చేయవలసిందిగా అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వర్షపు నీరు ప్రవహించి రోడ్లపై నిలిచి దోమలకు నిలయాలుగా మారాయని, అందువలన ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఎంత దుర్భర జీవితం అనుభవిస్తున్నారో ఒక్కసారి ఆలోచించుకోవాలి అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాదులు సోకే ప్రమాదం ఉందన్నారు.

సీజనల్ వ్యాదుల నియంత్రణ కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిధులను మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్టర్ నాలా నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి, పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారుల్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు, మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి, చైర్మెన్ అబ్దుల్లాసాది, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ ఖైసర్ బాం, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ అహ్మద్, ఉపాధ్యక్షులు యంజాల జనార్దన్,షేక్ అఫ్జల్, మాజీ సర్పంచ్ మేరాజ్ ఖాన్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల నాయకులు, కార్యకర్తలు, నబీల్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్‌లో బాలాపూర్ పాత గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మంగళవారం కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇప్పటికే బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి.. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏఈఈ సాయిరాం, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, కొలను కృష్ణ రెడ్డి, బాలింగని జంగయ్య, తుళ్ళ నరహరి గౌడ్, టేకుల సుధాకర్ రెడ్డి, ఇక్కే శ్రీనివాస్, సుధాకర్ మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాల నిర్వహణ, రోడ్ల పరిశీలన

**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గణేషుని ఉత్సవాల నేపథ్యంలో రోడ్డు పనులు, పార్కింగ్ ఏర్పాట్లను బాలాపూర్ సీఐ భూపతి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘుతో కలసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గణేష్‌ని నిమజ్జనం జరిగే చోటును పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా బాలాపూర్ గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా బాలాపూర్ నుండి చాంద్రాయణగుట్ట వరకు రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. దేశంలోనే బాలాపూర్ గణేష్ లడ్డూకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ పరిశీలనలో డీఈఈ జ్యోతి రెడ్డి, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఏఈఈ సాయిరాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు బొర్ర జగన్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, నరహరి గౌడ్, టేకుల సుధాకర్ రెడ్డి, టేకుల దయాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు డివిజనల్ మేజిస్ట్రేట్ అధికారి సూరజ్ కుమార్ మంగళవారం బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాపూర్ మండల తహసీల్దార్ బదిలీపై వెళ్లడం వలన రైతులకు సంబంధించిన అనేక ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ధరణిలో రకరకాల సమస్యల పరిష్కారం కోసం కొంత మార్పు తీసుకురావడం జరుగుతుందన్నారు. ఎంతో మంది రైతులు స్థానికంగా ఉన్న తహసీల్దార్లు భూ సమస్యలను పరిష్కారం చేయకపోవటం వలన చాలా మంది కోర్టును ఆశ్రయించటం జరుగుతుందన్నారు. కోర్టులో కూడా భూ సమస్యల పరిష్కారం త్వరగా జరగటం లేదన్నారు. ఈ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు కోర్టుకు వెళ్లకుండా ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలోనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. సాదా బైనామాలు ఫైల్స్ కూడా చాలా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు రైతుల భూ సమస్యలను పరిష్కారం చేయటం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సమయ పాలన పాటించి, సమస్యలను పరిష్కారం చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

### భూమిని కబ్జా చేసేందుకు

# ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి



**నవతెలంగాణ- బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడి పల్లిలో ఉన్న మా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని, మాకు న్యాయం చేయాలని ఆ గ్రామ రైతులు కోరారు. మామిడిపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్ యాదవ్, చుక్క శివ కుమార్‌తో కలిసి గ్రామ రైతులు మంగళవారం బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలోఉన్న కందుకూరు డివిజనల్ అధికారి సూరజ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిపల్లి గ్రామానికి చెందిన కోట్ల వెంకటేష్, గుండ్యాల యాదగిరి ఎంతో కాలంగా సర్వే నెంబర్ 17లో ఉన్న పట్టా భూమిని 60, 70 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ భూమిలో కొంత భాగమును తమ అవసరాల కోసం ఈ రెండు కుటుంబాల వారు అభ్యాస్ కుమార్‌కు అమ్మటం జరిగిందని తెలిపారు. ఈ భూమికి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 99/1ని కూడా అభ్యాస్ కుమార్ దౌర్జన్యంగా లాకోవటానికి ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూమిలో పశువుల కోసం నిర్మాణం చేసుకున్న షెడ్లను రాత్రి సమయంలో కూల్చి వేసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. మా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్న వ్యక్తిపై చట్ట పరంగా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు. వినతి అందజేసిన వారిలో కావలి వెంకటేష్, గుండ్యాల యాదగిరి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఏపీ హెల్త్ మినిస్టర్



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో నిర్వహించిన 65వ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ వర్ర వెంకటేశ్వర్లు యాదవ్, కూరాకుల నాగభూషణం యాదవ్, పార్లమెంటు సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, పుట్టా మహేష్ కుమార్ యాదవ్, బొంతు శ్రీదేవి యాదవ్, వి.నవీన్ యాదవ్, జంగిటి మురళీధర్ యాదవ్, నాగేళ్లి అంజన్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, సుధాకర్ యాదవ్, బొట్టా మధు యాదవ్, ఎంబీ.కృష్ణ యాదవ్, ఆది యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం మహాదానం : కార్పొరేటర్ కళ్లెం






**నవతెలంగాణ - వనస్థలిపురం**

రక్తదానం మహాదానం అని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. ఉప్పాల వెంకన్న మెమోరియల్ బ్లడ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదినం సందర్భంగా డివిజన్‌లోని బీడీఎల్ కాలనీ కమిటీ హాల్ నందు తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి మంచి పని చేయడం కోసం అందరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం రక్తదానం చేసినవారికి, అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**నవతెలంగాణ- కొత్తపేట**

కొత్తపేటలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బొగ్గారపు దయానంద్ గుప్తా, వజే ప్రకాష్ గౌడ్, తోట శ్రీనివాస్ యాదవ్, బొగ్గర శరత్ చంద్ర, బొగ్గార వరుణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మైనర్‌ను వేధించిన కేసులో నిందితుడికి ఏడాది శిక్ష

**నవతెలంగాణ-హయత్ నగర్**

ఓ మైనర్‌ను వేధింపులకు గురిచేసిన కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష పడింది. వివరాల్లోకి వెళ్లే...పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరవై ఏండ్ల యువకుడు బాలాపూర్‌కు చెందిన నిందితుడు భాను ప్రకాష్.. పాఠశాలకు వెళ్లే ఓ మైనర్‌ను దురుద్దేశంతో వెంబడిస్తూ 2019లో వేధింపులకు గురిచేశాడు. ఈ కేసులో పోక్సో చట్టం ప్రకారం పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎల్బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష, 10,000 జరిమానా విధించారు. బాధితురాలికి పరిహారం రూ.1,00,000 అందించినట్లు పోలీసులు తెలిపారు.




# నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

- డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా

**నవతెలంగాణ - వనస్థలిపురం**

ఇంటి పరిసర ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ నుండి దోమల నివారణ కోసం మంగళవారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు దోమలను నివారించడం ఉత్తమం అని పేర్కొన్నారు. ఇంటి చుట్టూ, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు ఉండడం ద్వారా దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు కుట్టడం వలన డెంగ్యూ, మలేరియా, టైఫాడ్ మొదలగు వ్యాధులు వస్తాయని చెప్పారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన దోమల పెరుగుదలను నివారించవచ్చు అని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటిస్తూ.. ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని



నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వ లేకుండా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ మనీ, సూపర్‌వైజర్ శ్రీకాంత్ రెడ్డి, వాకింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

సమాజాన్ని మార్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. వెంకటేశం పదవీ విరమణ పొందడంతో నిర్వహించిన కార్యక్రమానికి చైర్మెన్ ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల చొరవ ప్రత్యేక మైందన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం సేవలు పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోధుమకుంట ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సైబరాబాద్ , జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా, శామీర్ పేట మండలం, తుర్కపల్లి గ్రామంలో రాకేష్ సెర్వి (35) 14 ఏండ్లుగా సూపర్ మార్కెట్ (కిరాణా) బిజినెస్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ నెలలో తన సూపర్ మార్కెట్‌లో ఫైర్ ఆక్సిడెంట్ కావడం వల్ల తీవ్రంగా నష్టపోయాడని, దీంతో చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపంతో మంగళవారం తుర్కపల్లిలోని తన ఇంట్లో సిలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుడి స్వస్థలం రాజస్థాన్ రాష్ట్రం. ఈ మేరకు జినోమ్ వ్యాలీ ఎస్‌హెచ్‌ఓ 171/2024 సెక్షన్ 194 బీఎన్‌ఎస్‌ఎస్ క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



● ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి గూడ సాయిసుమ ఎన్‌క్లేవ్‌లో రూ.32 లక్షలతో చేపట్టిన అండర్ డ్రయినేజీ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్ ఏజీఎం సతీష్, జీఎం రోహిత్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ గ్యాస్ ఎల్పీజీ కంపెనీలో వైద్య శిబిరం




నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలోని భారత్‌గ్యాస్ ఎల్పీజీ కంపెనీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పీడీజీకేఎస్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు వైద్య సౌకర్యంతో పాటు ఉచిత కాటరాక్ట్ ఆపరేషన్లు చేయిస్తున్న లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. కమలా నగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం కళ్ల పరీక్షలు, దమ్మాయిగూడ పద్మసాయి డెంటల్ క్లినిక్ డాక్టర్ దినేష్ బృందం దంతాల పరీక్షలు చేశారు. విజయ డయాగ్నోస్టిక్స్ బీపీ, షుగర్ టెస్టులతో పాటు బాడీ పరీక్షలు నిర్వహించారు. సన్‌సీడ్ హాస్పిటల్స్ మందులు పంపిణీ చేశారు. సియాన్ కాన్సర్ స్క్రినింగ్ డాక్టర్లు కాన్సర్ పరీక్షలు చేశారు. 202 మంది ఉద్యోగులు అన్ని రకాల పరీక్షలు చేయించుకుని పలువురు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, సభ్యులు కంతేటి విజయకుమార్, చందన్ రాజు, శ్రీనివాసరెడ్డి, రోజి, సునీల్‌తో పాటు గ్యాస్ కంపెనీ ఉద్యోగులు అనీత్ మోహన్ ,రమణకుమార్, వేదప్రకాష్, నందన్వార్ పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా బొంతు శ్రీదేవి




నవతెలంగాణ-కాప్రా

అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబు రావు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్ సమక్షంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా బొంతు శ్రీదేవి యాదవ్‌ను నియమిస్తూ మంగళవారం నియామకపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రం అంతట పర్యటించి మహిళా విభాగం కమిటీలను పునఃనిర్మిస్తానన్నారు. యాదవ మహిళలను రాజకీయంగా, విద్య పరంగా చైతన్య పరుస్తానన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీందర్ యాదవ్, జాతీయ కార్యదర్శి రమేష్ యాదవ్, ఉపాధ్యక్షులు మేకల రాజేందర్ యాదవ్, బాల మల్లేష్ యాదవ్, కోశాధికారి దారబోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్, గ్రేటర్ అధ్యక్షులు మైల్ కొల్ మహేందర్ యాదవ్, యువజన అధ్యక్షులు గొర్ల యశ్వంత్ యాదవ్, విజయ్ యాదవ్, సంతోష్, మహేందర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుకు, ప్రధాన కార్యదర్శులకు, సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ నగర్ పార్క్‌లో ఓపెన్ జిమ్, భక్షిగూడ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, మంగాపూరం, వెంకటేశ్వర నగర్, తిరుమలా నగర్ కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణం, ఓల్డ్ మీర్‌పేట్‌లో మహిళా భవనం నిర్మాణం పనులపై చర్చించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ శ్రవంతి పాల్గొన్నారు.

## డీసిల్టింగ్ పనులు చేపట్టాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

నాచారంలోని మెయిన్ రోడ్డు నుంచి యూబీ కంపెనీ నుండి ఏర్పాటు చేసిన నాలా, లక్ష్మీస్టార్చ్ కంపెనీ నుండి ఏర్పాటు చేసిన ట్రంకు లైన్ చాలా కాలంగా డీసిల్టింగ్ చేయలేదని వెంటనే డీసిల్టింగ్ పనులు చేపట్టాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ మంగళవారం నాచారం టీఎస్ఐఐసీ కమిషనర్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. డిలిస్టింగ్ పనులు చేపట్టక పోవడంతో ట్రంక్ లైన్‌లో సిల్ట్ బాగా ఏర్పడి నీళ్లు పోవడం లేదని తెలిపారు. వెంటనే ట్రంకు లైన్ డీసిల్టింగ్ పనులు చేయాలని కోరారు. నాచారం మెయిన్ రోడ్డు నుండి హనుమాన్ నగర్, బాబానగర్‌కు వెళ్లే దారిలోని ఇండస్ట్రియల్ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే రోడ్డు వేయాలని నాచారం కమిషనర్‌ను కోరారు. డీసిల్టింగ్ పనులు చేపట్టి, రోడ్డు వేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.

## సల్కం చెరువును రక్షించాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఓవైసీ కబ్జా చేసిన సల్కం చెరువును రక్షించాలని, అందులోని ఆక్రమణలను తొలిగించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు నష్టం కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మహేందర్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# హడలెత్తిస్తున్న 'హైడ్రా'

● బెంబేలెత్తుతున్న అక్రమార్కులు

● శివారు మున్సిపాలిటీల్లోని కబ్జాలపై ఫోకస్ పెట్టాలని ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-మేడ్చల్

హైడ్రా దూకుడుతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. చెరువులు, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్‌లల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కు పాదం మోపుతుండడంతో అక్రమ నిర్మాణదారులు హడలెత్తిపోతున్నారు. కాగా హైడ్రా దూకుడు నగరంలోనే కాకుండా శివారు మున్సిపాలిటీల్లోని కబ్జాలపై సైతం ఫోకస్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. హైడ్రా పనితీరుపై కాంగ్రెస్ ప్రభుత్వంలోని సొంత పార్టీ నేతలతో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు పలు గ్రామాలలో చెరువు శిఖలు కబ్జాలకు గురవుతున్నా ఇరిగేషన్, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువు శిఖం ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు బహిరంగగానే విమర్శలు చేస్తున్నారు. గుడ్లపోచంపల్లిలోని నీలం చెరువు ఎఫ్‌టీఎల్‌లో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోవడం పట్ల అంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని పూడూరు గ్రామ ఎర్ర చెరువు ఎఫ్ టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా పందులకుంట చెరువు సర్వే నెంబర్ 385, 384లో కాల్వలను కబ్జా చేసి వెంచర్ నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు శివారులోని కబ్జాలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గుండ్లపోచంపల్లి నీలం చెరువులో అక్రమ నిర్మాణాలు



పూడూరు ఎర్ర చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణం (ఫైల్)

### హైడ్రా దూకుడు కొనసాగించాలి



హైడ్రా దూకుడు కొనసాగిస్తూ శివారు మున్సిపాలిటీలలోని కబ్జాలపై సైతం దృష్టి సారించాలి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు కబ్జాలకు గురై కుంచించుకుపోతున్నాయి. స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కబ్జాలను అరికట్టడంలో విఫలమైతున్నారు. నీలం చెరువులోని కబ్జాలపై హైడ్రా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.

-కుండా భానుచందర్, గుడ్లపోచంపల్లి గ్రామస్తుడు

### హైడ్రా పారదర్శకంగా పనిచేయాలి



నగర శివారు గ్రామల్లలోని చెరువులు, అలుగులు, బఫర్ జోన్‌లు కబ్జాల గురవుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినా తూతూ మంత్రంగా పరిశీలించి చేతులు దులుపుకుంటున్నారు. పందులకుంట చెరువు కాల్వలు కబ్జా చేసి వెంచర్ చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

-గొంగళ్ల ప్రభాకర్ రెడ్డి, పూడూరు గ్రామస్తుడు

## బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

● మేయర్ తోటకూర అజయ్ యాదవ్

● రూ.1.20 కోట్లతో నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మంగళవారం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్‌తో కలిసి కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు రూ.1.20 కోట్లతో కార్పొరేషన్ పరిధిలోని 1,4,6,13,17,18,23 డివిజన్లలో కమ్యూనిటీ హాల్, భూ గర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక చొరవ ఉందని తెలిపారు. అందులో భాగంగానే రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేశారని అన్నారు. ఇంకా అపరిష్కరంగా ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ బోడుప్పల్‌ను అభివృద్ధి వైపు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిధులు రావడానికి కారణమైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జీ.రామలింగం, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ పోగుల నరసింహ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

● కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

● హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నాలా ఇంక్రోచ్మెంట్, మెయిన్ రోడ్ ఎంకరోచ్మెంట్ (ద్వారకామై కాలనీ), పార్క్ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ఆర్కేహెచ్ కాలనీలో పార్కులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని రాబోయే తరాలకు పార్కులను ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. 580 గజాల్లో ఇండ్లు కట్టుకున్న వారిపై కాకుండా ఓవైసీ లాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, సేవ ముసుగులో వ్యాపారం చేస్తున్న ఓవైసీ బ్రదర్స్ లక్షల కోట్లకు అధిపతిలయ్యారని తెలిపారు. సేవ చేస్తే ఆస్తులు తగ్గుతాయి కానీ వాళ్ల ఆస్తులు ఎలా పెరిగాయో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటే కమిషనర్ రంగనాథ్‌కు, సీఎంకు మంచి పేరు వస్తుందని తెలిపారు.

## 'వర్క్‌ఫ్రం' ఆఫీసును పునరుద్ధరించాలి




నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజీగూడ శివారులో ఉన్న ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్ ఫ్రం ఆఫీసును పూర్తి స్థాయిలో ప్రారంభించాలని ఐటీ కారిడార్ స్టాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇన్ఫోసిస్ సంస్థ సమీపంలో నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు..ఇన్ఫోసిస్ కంపెనీని ఇక్కడ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో ఉండే వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం 450 ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. ఈ కంపెనీలో వేలది మంది ఇంజినీర్లు, ఇతర సిబ్బంది పని చేస్తుండడం వల్ల హాస్టళ్ల, హెూటళ్లు నిర్వహించే వారికి, ఇతర చిరు వ్యాపారులకు ఎంతో కొంత ఉపాధి దొరికేదన్నారు. కానీ కరోనా టైంలో ఆఫీసులు మూత పడడంతో వర్క్ ఫ్రం హెూం పద్ధతిని తెచ్చారని గుర్తు చేశారు. అయితే పరిస్థితులు మారి అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలు పూర్తస్థాయిలో ఆఫీసు వర్కును ప్రారంభించాయని తెలిపారు. కానీ పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ మాత్రం ఇప్పటికీ కేవలం పది శాతం ఉద్యోగులతో మాత్రమే సంస్థను నడిపిస్తుందని చెప్పారు. దీని ప్రభావం హాస్టళ్ళ, హెూటళ్లతో పాటు సంస్థపై పరోక్షంగా ఆధారంగ పడ్డ వేలాది మంది చిరు వ్యాపారులు ఆర్థికంగా చితికి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ నిర్వాహకులు తమ ఆవేదనను అర్థం చేసుకోని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వర్క్‌ఫ్రం ఆఫీస్ పద్ధతిని పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు కరుణాకర్, శ్రీనివాస్రావు, మహిదర్, సుదీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

శానిటైజేషన్, రాంకీ ప్రతినిధులతో కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం తన కార్యాలయంలో డివిజన్‌లోని పలు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త లేకుండా వీధులని శుభ్రంగా ఉంచాలని, రాంకీ వారు వాహనాలను సమయానికి అందించాలని సూచించారు. అనంతరం ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఈఈ లక్షణ్, డీఈ మహేష్, ఏఈ దీపక్, రమేష్‌లతో కలిసి సఫిల్‌గూడ చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. మంచి నీటిలో పూర్తి గా మునిగే విధంగా వాటర్ లెవెల్స్ మైయిన్‌టైన్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ఏఎంఓహెచ్ మంజుల, శ్రీనివాస్, గిరి, ఎల్లయ్య, రాంకీ ప్రతినిధులు గోవర్ధన్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

● నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

సీఎం రిలీఫ్ పండ్ పేదలకు వరం లాంటిదని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు రవీంద్రనగర్ కాలనీకి చెందిన చిన్నం యశోదకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును చైర్మెన్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయానికి ఎండోమెంట్ ఫండ్ చెక్కు అందజేత



● కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్

నవతెలంగాణ - జవహర్ నగర్

పోచమ్మ ఆలయానికి ఎండోమెంట్ ఫండ్ రూ.15వేల చెక్కును కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయానికి ఆలయ గౌరవ అధ్యక్షులు, స్థానిక కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు కలెక్టరేట్‌లో సమర్పించి, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ద్వారా రూ.15వేల ఫండ్ తీసుకొచ్చి గుడి నిర్మాణానికి కృషి చేశారు. చెక్కును ఆలయ కమిటీ సభ్యులు సంపత్ యాదవ్, రమేష్ గౌడ్, భాను, మాణిక్ ప్రభు తదితరులకు అందజేశారు. కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలందరూ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## కవితకు బెయిల్‌పై సంబురాలు



నవతెలంగాణ-అల్వాల్

బీఆర్ఎస్ నాయకురాలు కవిత లిక్కర్ స్కాంలో జైలుకెళ్లి ఐదు నెలలుగా జైల్లో ఉన్నారు. మంగళవారం సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు సంబురాలు నిర్వహించారు. అల్వాల్‌లంతోనిన ఈ సేవ సెంటర్, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాసరెడ్డి, సబితా అనిల్ కిషోర్, నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, విజయ శేఖర్, శోభన్ బాబు, యాదగిరి గౌడ్, సయ్యద్ మోసిన్, రహమత్ ఖాన్, ఆరీఫ్, తదితరులున్నారు.

## పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలి

● కార్పొరేటర్ క్యానం రాజలక్ష్మి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజలక్ష్మి అన్నారు. మంగళవారం వినాయక్ నగర్ డివిజన్‌లోని వార్డ్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బంది, ఎస్ఎఫ్ఏ, జవాన్లతో, శానిటరీ సూపర్వైజర్ లతో రామ్ కి, సాట్ ఆటో డ్రైవర్లతో కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అధికారులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లో పారిశుధ్యంను మరింత మెరుగుపరచాలన్నారు. జీవీపీ ( గార్బేజ్, ఉల్నేరబుల్ పాయింట్స్) లను తొలగించాలని, ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని, సాట్ ఆటో డ్రైవర్ ల పనితీరు మెరుగుపరచాలని, ఎప్పుడైతే ఇండ్ల నుండి చెత్త సేకరించరో అప్పుడు ప్రజలు రోడ్ల మీద చెత్త విసురుతున్నారని, రెండు వారాల్లో వారు మారకపోతే, వేరే సిబ్బందిని ఆటోలకు నియమిస్తామని హెచ్చరించారు.

మౌలాలి డివిజన్ పరిధిలోని ఎంజె కాలనీలో ప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ హాజరయ్యారు. - నవతెలంగాణ, నేరేడ్‌మెట్



# యువత స్వయం శక్తితో ఎదగాలి..



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/బాలానగర్

యువత ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల కోసం సమయం వృథా చేయకుండా స్వయం శక్తితో జీవితంలో అభివృద్ధి సాధించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. కేపీహెచ్‌బీకి చెందిన రుద్రపాటి వీరాంజనేయులు అనే యువకుడు ఇటీవల ఇంటీరి యర్, కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్థాపించాడు. ఈ కంపెనీ ద్వారా పలువురు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నాడు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం బాలనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా యువకులను ఆయన అభినందించారు. లక్ష్మయ్య, పుష్పారెడ్డి, మేనేజర్ సంపత్, వెంకట్, నారాయణ పాల్గొన్నారు.

# కడిగిన ముత్యంలా కవిత బయటకు...

- కార్పొరేటర్ రోజాదేవి రంగారావు



నవతెలంగాణ- కూకట్‌పల్లి

కేసీఆర్ చెప్పినట్టే కడిగిన ముత్యంలా ఎమ్మెల్సీ కవిత బయటికి వచ్చిందని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. ఎమ్మెల్సీ కవితకి అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయదంపై హర్షం వ్యక్తం చేశారు. మొదటగా సుప్రీంకోర్టు న్యాయస్థానానికి కార్పొరేటర్ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఆధారాలు లేకుండా అక్రమంగా ఐదు నెలలు ఎమ్మెల్సీ కవితని జైల్లో పెట్టడం చాలా బాధాకరమైన విషయమని కార్పొరేటర్ పేర్కొన్నారు.

# కవితకు బెయిల్ రావడం హర్షనీయం

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

తెలంగాణ ఆడబిడ్డ శాసనమండలి సభ్యురాలు కవితకు బెయిల్ మంజూరు కావడం హర్షణీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్రపూరిత ధోరణితో వ్యవహరించడం బాధాకరం అన్నారు. ఎన్నటికైనా న్యాయం గెలుస్తుందన్న నమ్మకాన్ని సుప్రీం కోర్ట్ మరో మారు రుజువు చేసిందన్నారు. కనీస ఆధారాలు కూడా లేని కేసులో ఎమ్మెల్సీ కవితను ఇరికించడం ద్వారా కేసీఆర్ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలని చూశారన్నారు. ఐదు నెలలుగా జైలులో పెట్టి మానసిక వేదనకు గురిచేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ సుప్రీం కోర్టు ఆదేశాలతో చెక్కు చెదరని మనో ధైర్యంతో కవిత బయటకు రాబోతుందన్నారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని మహిళను కనీసం ఆధారం కూడా లేకుండా కేసుల్లో ఇరికించడం ద్వారా కక్షపూరిత రాజకీయాలకు పాల్పడటం మంచిది కాదని.. ఇది ఏ పార్టీకి కూడా మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సుప్రీం కోర్ట్ బెయిల్ మంజూరు చేసినా కొన్ని రాజకీయ పార్టీలు వాటి ప్రతినిధులు జీర్ణించుకోలేక నోటికి వచ్చినట్లు ఆరోపణలకు దిగడం సిగ్గు చేటని పేర్కొన్నారు. విమర్శలు చేస్తున్న పార్టీల నాయకుల ఇండ్లలోని మహిళలకు ఇదే పరిస్థితి ఎదురైతే ఇలాగే వ్యవహరిస్తారా అనీ ప్రశ్నించారు. ఎన్నటికైనా నిజం నిప్పులాంటిదని న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేసారు.

# అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై హైడ్రా దృష్టి పెట్టాలి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్




నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించి యూనివర్సిటీలు, విద్యాసంస్థల భవనాలు నిర్మించిన మల్లారెడ్డి, అనురాగ్ యూనివర్సిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై హైడ్రా దష్టి పెట్టాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించిన వారి గుండెల్లో హైడ్రా గుబులు పుట్టిస్తుందన్నారు. చెరువులు, కుంటలను ఆక్రమించి, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ లో భవనాలు నిర్మించి విద్యాసంస్థలను నిర్వహిస్తూ, ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి ప్రయివేటు యూనివర్సిటీల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కాలేజీల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. జిల్లాలో భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించిన వారిపై దష్టి పెట్టాలని హైడ్రా కమిషనర్‌ని కోరారు. గతేడాది మల్లారెడ్డి యూనివర్సిటీ దగ్గర ప్రభుత్వ చెరువు, కుంటల్లో నాలలను మూసేయడం వల్ల విద్యాసంస్థల్లోకి వర్షపునీరు చేరి మునిగిపోయిన ఘటన ఉందన్నారు. మూసేసిన చెరువు, కుంటలు, నాలాలను తెరిపించేలా హైడ్రా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెరువులు, కుంటలను ఆక్రమించి భవనాలు నిర్మించినట్టు అనేకసార్లు ఆరోపణలు చేసినా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ప్రభుత్వ భూములను, చెరువు కుంటలను కాపాడుకునే విధంగా చర్యలు చేపట్టడం మంచి పరిణామం అన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మించిన కాలేజీల యాజమన్యాలపై చర్యలు తీసుకోవాలనీ, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ఎస్ఎఫ్ఐగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ రావు, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అనిల్, మనీష్, తరుణ్ రాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితికి అనుమతులు తీసుకోవాలి



- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో వినాయకచవితి సందర్భంగా మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయనతో పాటు కేపీహెచ్‌బీ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేసారు. పండుగను నిబంధనల ప్రకారం శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులకు సహకరిస్తూ వినాయక నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. వినాయక విగ్రహాల ప్రతిష్టాపనకు ముందు వినాయక మండపాల ఏర్పాటు కోసం మీ దగ్గర్లోని మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. తద్వారా జియో ట్యాగింగ్ చేసి, ఏ సమస్య వచ్చిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకోవడానికి పోలీసులకు వీలు ఉంటుందని నిర్వాహకులకు వివరించారు. అదేవిధంగా మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్ శాఖ, వాటర్, ట్రాఫిక్, ఇతర శాఖల నుంచి అనుమతులను తీసుకోవాలని సూచించారు. అంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి అని, మట్టి వినాయక ప్రతిమలనే ఏర్పాటు చేయాలన్నారు. ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలు, నృత్యాలు చేయకూడదని, మందుగుండు సామగ్రి వెలిగించరాదని పేర్కొన్నారను. శబ్ద కాలుష్యం లేకుండా పగటి పూట 55 డెసిబుల్స్, రాత్రి వేళ 45 డెసిబుల్స్ దాటకుండా చూసుకోవాలని బాక్స్ టైపు స్పీకర్లనే వినియోగించాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ఎస్ఐ మాధవ రెడ్డి, సుమన్, మన్యం, రూప, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నల్లపోచమ్మ ఆలయ 7వ వార్షికోత్సవం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ 131 డివిజన్ లోని సంజీవయ్య నగర్ కాలనీ పరిధిలోని శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం 7వ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 131 కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి సంజివయ్య నగర్‌లో శ్రీ నల్లపోచమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భం గా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు.. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవ స్థాపకులు విజయ్ గుప్తా, వీరేందర్ గుప్తా, కృష్ణ గుప్తా, రవీంద్రనాథ్ రెడ్డి, కోట స్వామి, సంతోష్, మురళి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# షరతుల్లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలి




- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా రైతులకు తక్షణమే రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గౌరవాధ్యక్షులు సీహెచ్ దశరథ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల మల్లేష్ మాట్లాడుతూ వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న రైతుల భూములను ధరణిలో ధరణిలో నమోదు చేయకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ దశరథ్ శ్యామల వెంకట్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ మాట్లాడారు. అనంతరం డీఆర్‌వో హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, కనకయ్య, బాలయ్య, సీపీఐ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నాలాలను, చెరువులను కాపాడటమే లక్ష్యం

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం




నవతెలంగాణ-బాలానగర్

నగరంలో భూఆక్రమణలను అడ్డుకుని నగరంలో నాలాలను, చెరువులను కాపాడుతూ వర్షాకాలంలో ఎలాంటి విపత్తులు జరగకుండా ఉండాలంటే ఆక్రమణలు కూల్చివేతలు తప్పవని కాంగ్రెస్ నేత సత్యం శ్రీరంగం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ డిసాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ను ఏర్పాటు చేసారన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు చెరువులను రక్షించడం, విపత్కర పరిస్థితుల్లో నగరానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూసుకునే ప్రధాన ఉద్దేశ్యంతోనే హైడ్రా పనిచేస్తుందని పేర్కొన్నారు. 2014 నుంచి 2023 వరకు హైదరాబాద్‌ను బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని, నాలాలూ, చెరువులు ఆక్రమణలో కూకట్‌పల్లి రాష్ట్రంలో నెంబర్ వన్ అని తెలిపారు. హైదరాబాద్ నగర విధ్వంసాన్ని కాపాడండి.. అని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నయని అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న చెరువులను కాపాడటమే రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఎవ్వరు చేయలేని పనులను రేవంత్ రెడ్డి చేస్తున్నాడని.. ఈ విషయంలో అందరూ స్వాగతించాలని అన్నారు. రేవంత్ రెడ్డి మోసపూరిత వాగ్దానాలు చేయడని, రేవంత్ తీసుకున్న నిర్ణయాన్ని అన్ని పార్టీల నేతలు స్వాగతిస్తున్నారని చెప్పారు. హైడ్రాకు ప్రత్యేక యాప్ పెట్టి చెరువులను పరిరక్షించాలని సీఎం రేవంత్ రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు, సత్యం శ్రీరంగం విజ్ఞప్తి చేసారు.

# చైతన్య విద్యానికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్‌లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాల క్యాంపస్‌లో మంగళవారం వేడుకలు చిన్నారి విద్యార్థుల కేరింతల నడుమ పండగ వాతావరణంలో ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో, తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతి పండుగ విశిష్టత తెలియజేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు గోపిక వేష ధారణలతో ఆటపాటలతో నృత్యాలు వేసుకుంటూ సందడి చేశారు. ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు శివరాత్రి మంగా దేవి, శివరాత్రి నిఖిల్, డాక్టర్ శివరాత్రి శృతివిద్య, ప్రిన్సిపల్ సాయితేజ, వైస్ ప్రిన్సిపల్ శారదా దేవి, ఇన్‌చార్జి గీత, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యునికి ఐవీఎఫ్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి/జగద్గిరిగుట్ట

అనారోగ్యంతో ఉన్నా ఆర్యవైశ్యునికి ఐవీఎఫ్ ఆర్థిక సాయం అదించారు. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ.. జగద్గిరిగుట్ట చంద్రగిరి నగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స నిర్వహించుకుంటున్న.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన, కూకట్‌పల్లి నిజాంపేట్ నివాసి.. పేద ఆర్యవైశ్య కుటుంబీకుడు శర్విరాల శ్రీనివాస్‌కు, ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త అదేశాల మేరకు.. ఐవీఎఫ్ తెలంగాణ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేస్తూ చేయూత నిచ్చారు. మంగళవారం సంస్థ సభ్యులు ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసును పరామర్శించి, సుమారు రూ. 33,500ల నగదును అందజేస్తూ.. ధైర్యంగా ఉండాలంటూ సూచించారు. ఎలాంటి అవసరం ఉన్న చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కట్టా రవికుమార్ మాట్లాడుతూ.. నిరుపేద అయిన శ్రీనివాస్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా, గత కరోనాలో అతని భార్య లక్ష్మి మృతి చెందగా.. ఇద్దరు కుమార్తెలతో జీవిస్తున్న శ్రీనివాస్‌కు లివర్ సంబంధించిన వ్యాధి సోకిందని, విషయం తెలుసుకున్న శ్రీనివాస్ తండ్రి మనోవేదనాతో ఇటీవల మృతి చెందడం, మరింత బాధాకరం అన్నారు. నిరుపేద అయిన శ్రీనివాస్‌కు ఐవీఎఫ్ తోడ్పాటు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ సెక్రటరీ మార్తా వీరేందర్ గుప్తా, ఐవీఎఫ్ జగద్గిరిగుట్ట యూత్ ప్రెసిడెంట్ కాపర్తి నాగరాజు గుప్తా, బిజ్జల ఉపేందర్ గుప్తా, ఎల్లకొండ జయకుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ



- ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంటహెచ్‌గా నియమించబడిన శ్రీకాంత్ రెడ్డి, వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డిని, ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్య పనుల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టా లన్నారు. ఎస్ఆర్ పిలి ఎస్ఎఫ్ఏలు, పారిశుధ్య కార్మికుల మధ్య సమన్వయంతో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. పారిశుధ్య పనుల నిర్వహణ పై ఆలసత్వం ప్రదర్శించకూడదని, కాలనీలలో పెరుకుపోయిన చెత్తకుప్పలు, తొలగించుటలో రాంకీ సిబ్బంది, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయ లోపం తలెత్తకుండా చూడాలన్నారను. ఇద్దరి మధ్య సమన్వయంతో పారిశుధ్యం పనులు కుంటు పడకుండ చూడాలని సూచించారు. చెత్త కుప్పలు పేరుకపోకుండా, శానిటేషన్ సిబ్బంది, రాంకీ సంస్థ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి పారిశుధ్య పనులు నిర్వహణలో అంతరాయం కలగకుండా, తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రతి కాలనీని స్వచ్ఛ కాలనీగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఏఎంటహెచ్ శ్రీకాంత్ రెడ్డికి తెలియచేశారు. కాలనీలలో, బస్తీలలో, ప్రధాన రహదారుల పై చెత్తకుప్పలు పెరుకపోవడంతో వర్షాల వలన డ్రయినేజీ లో చెత్త నుంచి నీటి ప్రవాహం సాఫీగా సాగకుండా, వరదలకు కారణం అవుతుందని తెలిపారు. అదేవిధంగా అంటురోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని తెలియచేశారు. పారిశుధ్య పనుల నిర్వహణ ఇక నుంచి సక్రమంగా జరిగేలా చూడాలని, ఏఎంటహెచ్ పర్యవేక్షణ ఎల్లపుడు ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



- మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రబోధిత శ్రీకృష్ణ గీత భారతదేశానికే కాకుండా.. ప్రపంచ మానవాళి అంతటికి ఆచరణీయమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని.. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో.. సోమవారం రాత్రి మూసాపేట జనతా నగర్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీహెచ్‌పీ 60 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి, మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ఆహుతులను ఉద్దేశించి.. ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు పాల్గొన్నారు.

# హైడ్రా అంటే అక్రమార్కులను శిక్షించే సంస్థగా ఉండాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైడ్రా అంటే హైడ్రామా కాకుండా...అలాగే కాంగ్రెస్ నాయకులకు జేబు సంస్థగా మారకుండా, అక్రమార్కులను శిక్షించే సంస్థగా ఉండాలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. హైడ్రా( హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) డైరెక్ట్ ఏ వి.రంగనాథ్ ఐపీఎస్‌ను కలిసి, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న, చెరువుల పూర్తి వివరాలను అందించి, వాటి యొక్క కబ్జాల వివరాలను మూసాపేట్ కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న చెరువులను కాపాడాలని, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎప్పుడో నిర్మించిన భవనాలను, కూల్చి వేయడంలో కొంత ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పేద ప్రజలకి అన్యాయం జరగకుండా చూడాలని, బడా బాబులు ఎఫ్టిఎల్ పరిధిని మార్చి, అక్రమంగా పర్మిషన్లు తీసుకొని నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలు జరగకుండా, ఎఫ్‌టీఎల్ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. హైడ్రా అంటే డ్రామా కాకుండా అక్రమార్కులపై ఉక్కు పాదం మోపి, ఆదర్శవంతంగా ఉండాలని, కాంగ్రెస్ నాయకుల జేబు సంస్థగా మారకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఏవీ.రంగనాథ్‌ను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. తప్పకుండ చర్యలు చేపడుతాం అని డైరెక్టర్ రంగనాథ్ తెలిపారు.

కేపీహెచ్‌బీ డివిజన్ 9 వ ఫేస్‌లో శ్రీశ్రీశ్రీ విజయ గణపతి దేవాలయంలో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు దంపతులు హాజరై ఉదయం జరిగిన పుణ్యాహవచనం కార్యక్రమం, అలాగే సాయంత్రం ధ్వజ పటం కట్టడం, అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గణపతి దేవుని యొక్క ఆశీర్వచనాలు ప్రజలందరిపై ఉండి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



## అంటే వర్షానికి కొట్టుకుపోతుందేమోనని..



అసలే హైదరాబాద్..అందులోనూ వానాకాలం..ఎప్పుడు వర్షాలు కురుస్తాయో..నాలాలు పొంగి ప్రవహిస్తాయో..వాహనాలు కొట్టుకుపోతాయో తెలియని పరిస్థితి. అందుకే వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకుని తమ వాహనాలను కాపాడుకుంటున్నారు. రాంనగర్‌లోని పార్సీగుట్టలో ఓ వ్యక్తి తన బైకును ఇలా మెట్ల దిమ్మె మీదకు ఎక్కించి పార్క్ చేశారు. ఇలా పైన పార్క్ చేసి ఉన్న బైకును చూసి బాటసారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో ఉన్న కమలాపూర్ కాలనీ గోయింగ్ రూట్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడుతూ... చరిత్రతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడం వాటిని విద్యార్థులకు తెలియజేయడం పాఠశాల దశనుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్రతి విద్యార్థికీ చరిత్ర తెలియజేయడం ఎంతో అవసరమన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



## ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాంగోపాల్ పేట డివిజన్ లోని కరీం కాంపౌండ్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తమ బస్తీలో డ్రయినేజీ లైన్ ఏర్పాటు చేసినప్పటికీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే డ్రయినేజీ లైన్ లను చెక్ చేసుకోవాలని, రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తమకు నల్లాల ద్వారా వచ్చే నీరు కలుషితం అవుతుందని, సమస్య పరిష్కరించాలని కోరగా, కలుషిత నీరు ఎక్కడ కలుస్తుందో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బస్తీలో పలు చోట్ల స్ట్రీట్ లైట్‌లు లేవని తెలపగా, వెంటనే అవసరమైన చోట్ల లైట్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో తాను ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు తన దష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారని, వాటిలో వాటర్ లైన్, డ్రయినేజీ లైన్ లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను కూడా తొలగించి వాటి స్థానంలో ఎలాంటి ప్రమాదాలు ఏర్పడకుండా బంచ్ కేబుల్స్, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మిగిలిన రోడ్డు పనులను కూడా త్వరలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని బస్తీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట శానిటేషన్ డీఈ ధర్మారెడ్డి, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, జీహెచ్ఎంసీ ఏఈ శివరాం, ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, స్ట్రీట్ లైట్ ఏఈ భరత్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, బస్తీ వాసులు లతీఫ్, జబ్బార్, బాలేష్ యాదవ్, రబ్బానీ, రహీం, జావీద్, సాదిక్, గణేష్, చందు, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

## నాడు చెరువు.. నేడు కుంట..

- అక్రమ నిర్మాణలతో కుచించుకుపోయిన ఎర్రకుంట చెరువు
- హైడ్రా రాకతో స్థానికుల్లో ఆశలు.. పునర్జీవం వచ్చేనా ?







నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక డివిజన్ నాగార్జున నగర్ కాలనీలోని సాయి నగర్ లో ఉన్న ఎర్రకుంట చెరువు నాడు 20 ఎకరాల 34 కుంటల విస్తీర్ణంలో ఉండేది. అయితే ప్రస్తుతం అది అక్రమ నిర్మాణలతో కుచించుకు పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాడు చెరువు.. నేడు మురికికుంట..**

సర్వే నెంబర్ 123 , 124 , 125 , 126 ఉన్న ఈ చెరువు నాడు చెరువు ,తరువాత కుంటగా, నేడు అసలు ఆనవాళ్లు కోల్పోయి డంపింగ్ యార్డ్ గా, మురికి కుంటలా తలపిస్తోంది. మారేడు పల్లి రెవిన్యూ అధికారుల లెక్కల ప్రకారం సుమారు 5 ఎకరాల 14 కుంటలు అక్రమంగా కొందరి ఆక్రమణ చేరలో ఉంది. ఇక చెరువుకు ఇరువైపులా బఫర్ జోన్‌లో 25 వివిధ నిర్మాణాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

**చెరువు పై ఉన్న కేసులు**

ఇప్పటి వరకు ఈ ఎర్రకుంట చెరువు మీద హైకోర్టులో 7 కేసులు, సుప్రీంకోర్టు లో 1 కేసు ఉన్నాయి.

**పలుకుబడి ఉన్న వారే ఆక్రమణ..**

దీని ఆక్రమణలో పలువురు బడబాబులు, ఒక మాజీ ప్రజా ప్రతినిధి , ఒక బిల్డర్ తో పాటుగా ఇంక కొందరు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

**హైడ్రా రాకతో ఆశలు... పునర్జీవం వచ్చేనా ?**

ఇక ఇటీవలే రాష్ట్ర రాజధానిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడ ఝూలిపించడంతో స్థానికులు, తార్నాక వాసులు , నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఇప్పటికే ఈ ఎర్రకుంట చెరువు ఆక్రమణలపై హైడ్రా దష్టికి తీసుకు వెళ్లారు. చెరువుకు మళ్ళీ పునర్జీవం పోయాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు ఈ చెరువును సంరక్షణ కోసం నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ విశేషంగా కృషి చేసి చొరవ తీసుకున్నది.

**ఆ మూడు విభాగాల ఆధ్వర్యంలో జాయింట్ సర్వేకు సర్వం సిద్ధం**

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఇరిగేషన్ ,రెవిన్యూ , జీహెచ్ఎంసీ మూడు విభాగాలు సంయుక్తంగా ఈ చెరువు జాయింట్ సర్వే చేయాల్సి ఉన్నా చివరి నిమిషంలో వాయిదా పడింది. అతి త్వరలోనే ఈ మూడు విభాగాలు సర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో రిపోర్టును పై అధికారులకు అందజేయనున్నాయి.

### త్వరలోనే పూర్తి స్థాయిలో సర్వే

ఇటీవలే ఇక్కడ బాధ్యతలు స్వీకరించాను. ఉన్నతాధికారుల ఆదేశా నుసారం త్వరలోనే ఎర్రకుంట చెరువు ఇరిగేషన్, రెవిన్యూ జీహెచ్ఎంసీ జాయింట్ సర్వే చేస్తాము. పూర్తిస్థా యిలో అధ్యయనం చేస్తున్నాం .అక్రమంగా తిష్టవేసిన వారిపై చర్యలు తప్పవు.

-మారేడు పల్లి తహసీల్దార్ టి.భీమయ్య గౌడ్

### ఎర్రకుంట చెరువును సంరక్షించాలి



హైడ్రా ద్వారా ఎర్రకుంట చెరువును సంరక్షించాలి. చెరువును ఆక్రమణ దారులు పూడ్చివేత తో 20 ఏండ్ల క్రితం 100 అడుగుల్లో బోర్ వాటర్ పడితే నేడు 1000 ఫీట్లు బోర్ వేసిన నీరు పడటం లేదు. 28 ఎకరాల చెరువు కాస్త 6 ఎకరాలే మిగిలింది.

- స్థానికుడు డా.ఐనాల.అరుణ్

### చెరువు సంరక్షణకు కృషి



చెరువు సంరక్షణ కోసం కృషి చేస్తాను. ఎర్రకుంట చెరువును ఎవరు ఆక్రమించారో వారిపై హైడ్రా ద్వారా చర్యలు తప్పవు. ప్రభు త్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తాము.ఈ చెరువును రక్షించాలని స్థానికులు అనేకమంది ఇటీవల ఫిర్యాదు చేశారు. రాజకీయాలకతీతంగా చెరువుకు పూర్వవైభవం తీసుకు వస్తాం.

- డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

## ఘనంగా అపోలో హాస్పిటల్స్ వార్షికోత్సవ వేడుకలు



- 36 సంవత్సరాల వైద్య ప్రస్థానం పూర్తి చేసుకున్న అపోలో

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్స్‌లో 36వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని కొణిదెల హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ 36 సంవత్సరాల ప్రయాణాన్ని వర్ణిస్తూ, చిన్నారులు ప్రదర్శించిన, స్కిట్ కార్యక్రమం ఆకర్షణగా నిలిచింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేసాయి. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ సీఈవో తేజస్వీరావు, సీఓఓ హర కరన్‌తో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




## యువత భవిష్యత్తు.. సంఘ అభివృద్ధికి పెట్టుబడులు




నవతెలంగాణ-బేగంపేట్

యువత భవిష్యత్తు కోసం సంఘ విస్తృత అభివృద్ధి కోసం పెట్టుబడులు పెడుతున్నామని కె రహేజా తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల సి ఓ ఓ శ్రవణ్ కుమార్ గోన్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ ఎస్డి రోడ్డులోని మినర్వా కాంప్లెక్స్ లో గల హునర్ ప్రయాస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత దేశంలోని నాలుగు కీలక కార్యాలయ మార్కెట్లలో ఉన్న క్వాలిటీ గ్రేడ్ ఏ ఆఫీస్ పోర్ట్ ఫోలియో యజమాని, డెవలపర్ అయిన మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్ ఆర్ఈఐటి లాభాపేక్ష రహిత సంస్థ అయిన నిర్మాణ డాట్ ఓఆర్జీతో భాగస్వామ్యం చేసుకున్నామని వెల్లడించారు. హునర్ ప్రయాస్ పేరిట నైపుణ్య ఉపాధి కార్యక్రమాల ద్వారా యువతకు సాధికారికత కల్పించడం కోసం ఈ భాగస్వామ్యం పనిచేస్తుందని నేటి పోటీ ఉద్యోగ మార్కెట్ కు అవసరమైన నైపుణ్యాలను అందించడం ద్వారా అట్టడుగు వర్గాలకు సాధికారికత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు ఏప్రిల్ 2024లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించి ఇప్పటికే గణనీయమైన విజయం సాధించామని ఇప్పటివరకు 480 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని మార్చి 2025 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మంది యువతకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

హునర్ ప్రయాస్ కార్యక్రమం కింద సికింద్రాబాద్ చందానగర్ ఎస్డి రోడ్ సూరారంలలో నాలుగు శిక్షణా కేంద్రాలను మైండ్ స్పేస్ ఆర్ఈఐటి స్పాన్సర్ చేస్తుందని శిక్షణ పొందిన వ్యక్తులు మైండ్ స్పేస్ ఆర్ఈఐటి, కె రహేజా కార్ప్ గ్రూపుల ఇతర వ్యాపార విభాగాలు బాహ్య కార్పొరేట్ భాగస్వాముల వద్ద కూడా ఉపాధిని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడ ఎలక్ట్రీషన్ వర్క్ సోలార్ పీవీ ఇన్స్టాలేషన్, ఫుల్ స్టాక్ జావా డెవలప్మెంట్, డేటా అనలిటిక్స్, ఫుడ్ అండ్ బేవరేజ్, రిటైల్, ఐటి తదితర రంగాలను ఎంచుకోవచ్చు అన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు సిఈఓ మయూర్ పట్నాల మాట్లాడుతూ.... నైపుణ్య అభివృద్ధి ఉపాధి లోతైన సవాళ్లను ఎదుర్కోవడంలో మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ భాగస్వామ్యం కీలకమైన ముందడుగును సూచిస్తుందన్నారు. 2005 నుండి నిర్మాణ సంస్థ 3 మిలియన్ల మంది జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేసిందని, దీనికి 500 మంది కంటే అధికంగా పూర్తి సమయం ఉద్యోగులు, 25 రాష్ట్రాలలో 1000 కంటే ఎక్కువ మంది వాలంటీర్ల మద్దతు ఉందన్నారు.

## అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు చేస్తాం



- ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో అర్హులందరికీ గృహ జ్యోతి పథకం అమలు చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.మంగళవారం పికెట్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో గృహజ్యోతిపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం తమకు అమలు కావడం లేదని ప్రజల నుండి వస్తున్న పిర్యాదులతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి కోసం కంటోన్మెంట్ నియోజకవర్గంలో మరో సారి దరఖాస్తులు తీసుకుని అర్హులకు పథకం అమలయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.నియోజకవర్గ పరిధిలో ఉన్న 8 వార్డులతో పాటు మోండా డివిజన్‌లలో ఒక్కో రోజు ఒక్కో వార్డులో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు డీఈలు,ఏఈలు రవి కుమార్, సూచింద్రన్, రామచారి,విజయ్ కుమార్,నరేష్ రెడ్డి, సాయి జగదీష్, భరత్, అర్పిత, వంశిదర్ రెడ్డి, రాకేష్, శ్రీధర్, రామానుజ చారి తదితరులు పాల్గొన్నారు.

**ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోండి : ఎమ్మెల్యే**

గృహ జ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా సంబంధిత ధ్రువపతలను అధికారులకు సమర్పించాలన్నారు. ముఖ్యంగా ఫుడ్ సెక్యూరిటీ కార్డు,ఆధార్ కార్డు అప్డేట్,తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు అప్లై చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

**నందమూరి నగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే**

నందమూరి నగర్ లో సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం నాడు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బస్తీవాసులతో కలిసి బస్తీలో పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్న శాసనసభ్యులు శ్రీగణేష్ . మాట్లాడుతూ ప్రధానంగా డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉందని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు... వెంటనే 10 సమస్యల కోసం పది సమస్యల పరిష్కారం కోసం సంబంధిత బోర్డు అధికారులతో కూడా ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బలవంత రెడ్డి, మారుతి గౌడ్, సదానంద్, ప్రవీణ్ యాదవ్, ముప్పిడి మధు, బద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు



## డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

"డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదాం" అనే నినాదంతో మంగళవారం. కళాయాత్ర సభ్యులు నాటకాలు ప్రదర్శించి, బోరబండ లోని నాట్కో ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల వచ్చే ఇబ్బందులను అధిగమించడం ఎలా, డ్రగ్స్ కు ఏ విధంగా దూరం ఉండాలి, దూరంగా ఉండటం మూలాన వచ్చే ప్రయోజనాలకు సంబంధించిన విషయాలను ఈ కళారూపాల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కే గీత, టీచర్‌లు ప్రేమ వాణి, లక్ష్మీ కళాకారులు పి కళ్యాణ్, రఘు, రాము, విజయ్, వసీం, భరత్, వెన్నెల, అర్చణ, ఎన్ మారన్న తదితరులు పాల్గొన్నారు.

## నవతెలంగాణ విలేకరికి మాతృ వియోగం



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

నవతెలంగాణ ఓయూ రిపోర్టర్ తలారి శ్రీనివాస్ రావ్ మాతృమూర్తి మంగళవారం కన్నుమూశారు. గుండెపోటుతో ఆమె చనిపోయారు. ఆమె అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి. ఆమె మృతికి తోటి విలేకరులు సంతాపం తెలిపారు.



## మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌కు భారతీయ సినిమాలు..

నవతెలంగాణ-బంజారాహిల్స్

మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌లో భారతీయ సినిమాలు సందడి చేయనున్నాయి. ఈ ఫిల్మ్ వీక్ ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు జరగనుందని ఈ ఈవెంట్ రష్యా రాజధాని మాస్కోను సినిమాటిక్ హబ్‌గా మారుస్తుందని, ఈ ఫెస్టివల్‌లో 18 భారతీయ సినిమాలు కనువిందు చేయనున్నాయనీ భారతీయ చలన చిత్ర పరిశ్రమ నుంచి అనేక మంది ప్రతినిధులు హాజరు కానున్నట్టు మాస్కో ప్రభుత్వ మంత్రి, డిపార్ట్‌మెంట్ హెడ్ అలెక్సీ ఫర్సిన్ మాట్లాడుతూ వివరించారు. మాస్కో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్, ఏజెన్సీ ఆఫ్ క్రియేటివ్ ఇండస్ట్రీస్ ద్వారా ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సృజనాత్మకత, వృత్తి పరమైన పరిచయాలు, సినిమా రంగంలో సహకారాన్ని విస్తరించడం లక్ష్యమని భారతదేశం, చైనా, టర్కీ, ఇరాన్, ఈజిప్ట్, థాయ్‌లాండ్, సీఐఎస్ దేశాలతో సహా 40 పైగా దేశాల నుంచి విశిష్ఠ ప్రతినిధులు రానున్నారు. భారతీయ చిత్రాలతో పాటు మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌లో 300 పైగా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

## చంద్రబాబు నాయుడుని కలిసిన బాలాజీ గోస్వామి



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని సోమవారం బంజారాహిల్స్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో సీనియర్ నాయకులు,బాలాజీ గోస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. బహుజనులకు తెలుగుదేశం పార్టీలోనే న్యాయం జరిగిందని తెలిపారు.

## 'ఆ భూములు స్వాధీనం చేసుకునే అధికారం హైడ్రాకు ఇవ్వాలి'



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎండోమెంట్ భూములను, వక్ఫ్ భూములను ఏ ఒక్కరు కొనుగోలు చేసినా వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా రెవెన్యూ యాక్ట్ లో ఉన్న న్యాయం పద్ధతిని హైడ్రాకు అదే పద్ధతి వర్తింపచేయాలని ఆలిండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి ఇస్మాయిల్లొద్దిన్,ఖలిల్,డాక్టర్ అహ్మద్‌లు కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు..హైడ్రా చర్యలను స్వాగతిస్తున్నమని సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నమన్నారు. గత 10 సంవత్సరాల్లో వక్ఫ్‌బోర్డు భూములు 1052 ఎకరాలు అలాగే దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములు అసైడ్ భూములు ధరణి పేరుతో కబ్జా కోరల్లో చిక్కుకున్నాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి దీన్ని ఓ అత్యవసర విజ్ఞప్తిగా స్వీకరించి తక్షణం వాటిపై దర్యాప్తు చేయించాలని.. చిన్నచిన్న చెరువులు,కుంటలు స్వాధీనం చేసుకున్నట్టే వక్ఫ్ బోర్డ్ భూములు కూడా స్వాధీనం చేసుకునే అధికారం హైడ్రాకు ఇవ్వాలని కోరారు.అసదుద్దీన్ ఒవైసీ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వారికి దగ్గర అవుతారన్నారు.

అసదుద్దీన్ ప్రభుత్వ భూములు, నెక్లెస్ రోడ్, జీహెచ్ఎంసీ కూల్చి రమ్మంటున్నారని.. ప్రభుత్వ ఆస్తులు కూల్చి మీదగ్గరికి రావాలా అని ప్రశ్నించారు.మీరు కబ్జా చేసినట్లు ఒప్పుకుంటున్నారా అని నిలదీశారు. బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి ఇల్లు నిర్మల్‌లో చెరువు భూమిలో ఉందని కేటీఆర్, రైతులు విద్యార్థులు,యువకుల్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ లో ప్రతి ఒక్కరికీ ఫామ్ హౌస్ ఉందని ఆరోపించారు. యావత్ ముస్లిం సమాజం హైడ్రా వెంట ఉంటుందని.. ఎంఐఎం చెప్తే వినే పరిస్థితిలో ముస్లింలెవ్వరూ లేరన్నారు. పేద ముస్లింలకు ఇల్లు లేదు,కానీ అసదుద్దీన్‌కు వందల ఎకరాల ఉన్నాయనీ అవి ఎలా వచ్చాయో ముస్లింలందరికీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్గీకరణకు రాష్ట్రాలకు అవకాశం ఇచ్చినట్లే 341 ప్రకారం తమకు రిజర్వేషన్ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నసిరుద్దీన్,డాక్టర్ అహ్మద్, జయరాజ్,మజహర్,ఎండి ఆహాద్,ఇస్మాయిల్, ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్టుల చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరణ





నవతెలంగాణ-కంటోన్మెంట్

సెప్టెంబర్ 27న రవీంద్ర భారతి లో జరగనున్న దళిత జర్నలిస్ట్ చైతన్య ఫోరం సభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతంమ్ చేతుల మీదుగా ఈ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కాశపోగు జాన్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టులకు సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, దళిత జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని, అలాగే అక్రిడేషన్ కమిటీలో దళిత జర్నలిస్టుల ఫోరం సభ్యులను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగత్ ప్రకాష్, బండారు రాజు, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ మీసాల ఎల్లేష్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు ధనుష్, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, హైదరాబాద్ జిల్లా నాయకులు మూర్తి, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాబ్ మేళా

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులకు ఈ నెల 29వ తేదీన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వకు జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక తెలిపారు. ఫ్లిప్ కార్ట్ కంపెనీలో డెలవరీ ఎగ్జిక్యూటివ్ (మేల్) పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎంపికైన వారు గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ ఏరియాల్లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. జీతం రూ.15వేలు, పీఎఫ్, హాస్టల్, ఫుడ్, బైక్ ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హత గల యువతీ యువకులు www.nic.gov.in పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని హాజరు కావాలని కోరారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులతో ఇంటర్వ్యూ ఉంటందనీ, మిగతా వివరాలకు 9866465024, 7386809422 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## కత్తి, గొడ్డలితో దాడి..

- ఒకరు మృతి, మరొకరికి గాయాల

నవతెలంగాణ-బాలానగర్

పాత కక్షలను మనసులో పెట్టుకున్న ఓ వ్యక్తి మద్యం తాగి సమీప బంధువులపై దాడి చేయడంతో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఎరుపుల ముఖేందర్(42), అతని సమీప బంధువు ఎరుపుల మధు బాలానగర్ సంజీవయ్య కాలనీ ప్రాంతంలో నివసిస్తున్నారు. అయితే, పాత కక్షలను మనసులో పెట్టుకున్న మధు మంగళవారం మద్యం సేవించి ముఖేందర్‌పై కత్తి, గొడ్డలితో దాడి చేశాడు. అడ్డుగా వెళ్లిన ముఖేందర్ తల్లి సావిత్రిపైనా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ముఖేందర్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. అతని తల్లి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మధును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఓపెన్ స్కూల్.. రమ్మంటోంది..!

- రెగ్యులర్‌గా చదువుకోలేని వారికి సువర్ణావకాశం
- దూరవిద్యలో టెన్త్, ఇంటర్ విద్యాభ్యాసం..
- జిల్లావ్యాప్తంగా 104 అధ్యయన కేంద్రాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

చదువుకు దూరమైన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) మళ్లీ చదువుకునే అవకాశం కల్పిస్తోంది. వివిధ కారణాల వలన చదువు కొనసాగించలేని వారు.. ముఖ్యంగా బాలికలు, మహిళలు, యువత, వివిధ వృత్తుల్లో కొనసాగే ఉద్యోగులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్యను అందించడానికి ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధర్యంలో టెన్త్, ఇంటర్ కోర్సులను నిర్వహిస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను పది, ఇంటర్ చదివేందుకు మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకునేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 31 నాటికి 14 ఏండ్లు నిండి 50 ఏండ్ల వరకు ఉన్నవారు పదో తరగతిలో, 15 సంవత్సరాలు నుంచి ఆపై వయసున్నవారు ఇంటర్‌లో చేరేందుకు ప్రభుత్వం ఈ సదావకాశం కల్పిస్తోంది. ప్రవేశాల నమోదుకు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్‌ను అధికారులు నిర్వహిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా మొత్తం 104 అధ్యయన కేంద్రాలున్నాయి. చదువుకోవాలనే మక్కువ, ఉన్నత విద్యను అభ్యసించాలనే కోరిక, ఏదోక వృత్తిలో స్థిరపడి ఉన్నత స్థానాలను పొందలేకపోతున్నవారికి ఓపెన్ స్కూళ్లు ఒక వరంగా మారాయి. ప్రతి ఆదివారం, ప్రతి రెండో శనివారాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో విద్యార్థులకు పాఠాలను బోధించడంతో పాటు ఉచితంగా పుస్తకాలను అందిస్తున్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో చదువుకొన్న చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, ప్రమోషన్లు సాధించడంతో పాటు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందేందుకు కనీసం పదోతరగతి ఉత్తీర్ణత అడుగుతున్న నేపథ్యంలో దూర విద్యకూ రెగ్యులర్ మాదిరిగానే ఆదరణ లభిస్తోంది. ప్రతియేటా ప్రవేశాల సంఖ్య అంతంతకు పెరగడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా విద్యాశాఖ అధికారులు ఇంటింటికి తిరుగుతూ మహిళలు, గృహిణీలు, ఉద్యోగులతో పాటు మార్కెట్లు, వాణిజ్య సముదాయాల్లో పనిచేసే వారికి బ్రోచర్స్ అందిస్తూ.. అవగాహన కల్పించడంతో పదేండ్లుగా అడ్మిషన్ల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. గత విద్యాసంవత్సరంలోనూ హైదరాబాద్ జిల్లాలో పది, ఇంటర్ కలిపి 15,524 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇందులో పదో తరగతిలో 7,837 మంది పరీక్షలు రాస్తే.. 2,712 మంది, ఇంటర్‌లో 7,687 మంది పరీక్షలు రాస్తే.. 2,931 మంది పాసయ్యారు.

### వచ్చేనెల 10వరకు దరఖాస్తు గడువు

ఓపెన్ స్కూల్ విద్యలో ప్రవేశం పొందాలనుకునే వారు వచ్చేనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్థానిక అధ్యయన కేంద్రాలలో సమర్పించవచ్చు. అపరాధ రుసుంతో సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు చెల్లించవచ్చు. www.telanganaopenschools.org లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ లేదా మీ-సేవ, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాలలో రుసుం చెల్లించే అవకాశం కల్పించారు. టెన్త్‌లో చేరేందుకు 2024 నాటికి 14 ఏండ్లు నిండి ఉండాలి. దరఖాస్తు ఫీజు రూ.150, జనరల్ కేటగిరి రూ.1400, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మైనార్టీలు, ఇతరులకు రూ.వెయ్యి చెల్లించాలి. ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 15ఏండ్లు పూర్తయి ఉండాలి. ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1500, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులకు రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది. రుసుం చెల్లించిన తర్వాత సమీపంలోని అధ్యయన కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలు, ఇతర సందేహాలకు జిల్లా కో-ఆర్డినేటర్‌ను ఫోన్ నెంబర్ 8008403516లో సంప్రదించవచ్చు.

### ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి:



ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో పాఠశాల విద్యను మధ్యలో మానేసిన వారు ఓపెన్‌స్కూల్‌లో చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ సువర్ణావకాశాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో 106 పాఠశాలల్లో సార్వత్రిక టెన్త్, ఇంటర్ స్టడీ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. చదువుకోవాల నుకునే వారికి అక్కడి ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు అన్ని విషయాలు వివరిస్తారు. చదువు మధ్యలో మానేసిన బాలికలు, మహిళలు, యువత, వివిధ వృత్తుల్లో కొనసాగే ఉద్యోగులకు ఇదో మంచి అవకాశం. విద్యార్హత లేని వారు పదో తరగతిలో చేరవచ్చు.

**డీఈవో ఆర్.రోహిణి, సమన్వయకర్త ప్రభాకర్ రెడ్డి**

**జిల్లాలో గడిచిన అయిదేండ్లలో ప్రవేశాలు ఇలా..**

| సంవత్సరం | టెన్త్ | ఇంటర్ |
|---|---|---|
| 2019-20 | 4510 | 2633 |
| 2020-21 | 10500 | 5388 |
| 2021-22 | 10907 | 6977 |
| 2022-23 | 6295 | 6147 |
| 2023-24 | 6393 | 6223 |

# ఆంధ్రప్రదేశ్ టూ హైదరాబాద్ డ్రగ్స్ సరఫరా

- 10.2కిలోల హషిష్ ఆయిల్ స్వాధీనం
- ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేసిన రాచకొండ ఎస్ఓటీ పోలీసులు




నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్‌కమిషనరేట్ పరిధితో గుట్టుచప్పుటు కాకుండా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నేరస్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,52,20,000 విలువగల 10.2కిలోల హషిష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్‌కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరుకు చెందిన జీ.గోవింద రావు, కోరా రాంబాబు స్నేహితులు. సులువుగా డబ్బులు సంపాదించాలని మాదక ద్రవ్యాలపై దృష్టి సారించారు. ముందుగా హషిష్ అయిల్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోనే పరిసర ప్రాంతాలల్లో విక్రయించారు. అందులో లాభాలు రావడంతో అధిక మొతాదులో హషిష్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న నిందితులు తెలంగాణ రాష్ట్రంతోపాటు తెలిసిన వారికి కావాల్సిన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆర్టీసీ బస్సులల్లో హైదరాబాద్‌కు హషిష్ అయిల్‌ను తీసుకొస్తున్నట్టు సమాచారం రావడంతో రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. కొత్తగూడం వద్ద బోనగిరి ఎస్ఓటీ పోలీసులు, పోచం పల్లి పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. కొత్తగూడెం ఎక్స్‌రోడ్ వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారని సీపీ తెలిపారు. 35 నుంచి 40 కిలోలను ఉపయోగించి కిలో హషిష్ అయిల్‌ను తయారు చేస్తారని సీపీ తెలిపారు. 10.2కిలో హషిష్ ఆయిల్‌ను తయారు చేసేందుకు దాదాపు 450 గంజాయిని ఉపయోగించి ఉంటారని సీపీ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్రా, రమణారెడ్డి, మురళీధర్‌తోపాటు అదనపు డీసీపీ ఎస్.నర్సింహా రెడ్డి, ఏసీపీ వీ.శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు ఏ.రాములు,డీ.ప్రవీణ్ బాబు, టీ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 30న హెచ్ఏఎల్ కార్మిక సంఘాల ఎన్నికలు




నవతెలంగాణ-బాలానగర్

పారిశ్రామిక ప్రాంతంలోని హైదరాబాద్ యూనిట్‌లోని బాలానగర్ పరిశ్రమ హెచ్.ఏ.ల్ లో ఈ నెల 30న కార్మిక సంఘానికి జరగబోయే ఎన్నికల్లో భాగంగా మంగళవారం హెచ్.ఏ.ల్ సౌత్ గేట్ వద్ద హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, హానరబుల్ ప్రెసిడెంట్ విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు మాట్లాడతూ గతంలో బీఎంఎస్ యూనియన్ నాయకులు ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేయటంలో విఫలమయ్యారని తెలిపారు. గత ఎన్నికల్లో గెలిచిన తరువాత కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ఘోరంగా విఫలం చెందారని పేర్కొన్నారు. 2 సంవత్సరాల 10 నెలల కాలక్షేపం చేసి ఇప్పుడు మళ్ళీ ఓట్లు అడగడానికి వస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మెనేజ్‌మెంట్‌కు అనుకూలంగా వ్యవహరిస్తుందని, కార్మిక చట్టాలను మార్చాలని చూస్తుందని వారు తెలిపారు. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్‌ను గెలిపిస్తే కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కరిస్తామని, రాబోయే 2027 వేజ్ రెవిజన్ ను సరైన విధంగా రూపొందిస్తామని తెలిపారు. హైదరాబాద్ లోకల్ డివిజన్‌లో ఉన్న కార్మికుల సమస్యలు, మహిళా కార్మికుల సమస్యలతో పాటు ఫిసికల్ హ్యాండీ క్యాప్డ్ ఎంప్లాయిస్ ప్రాబ్లెమ్ సాల్వ్ చేస్తామని వాగ్దానం చేసారు. సీనియర్ నాయకులు శాస్త్రి, బి.యస్.సుదర్శన్, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్‌ను ఈ ఎన్నికల్లో కాగడా గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గణేష్, నవీన్, శ్రీకాంత్, విజయలక్ష్మి, షాబుద్దీన్, దీప్రాజ్, రమణ, అజయ్, ఇతర కార్యవర్గ సభ్యులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవహారిక భాషా ఉద్యమ కారులు గిడుగు రామ్మూర్తి పంతులు



నవతెలంగాణ-కల్చరల్

వ్యవహారిక తెలుగు భాషా ఉద్యమ కారులు గిడుగు రామ్మూర్తి పంతులు అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసంగీత నాట్యవేదికపై ఎందరో మహానుభావులు మధుస్మృతులు కార్యక్రమంలో భాగంగా వ్యవహారిక భాషోద్యమ సారధి గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు యాదిలో కార్యక్రమం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్యవ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు గిడుగువారు అని అన్నారు. వ్యవహారిక భాష అనగానే రామ్మూర్తి పంతులు స్ఫురణకు వస్తారన్నారు నాలుగు దశాబ్దాల పాటు గ్రాంథిక భాషా వాదులతో అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన సలిపిన భాషోద్యమం అభ్యుదయ సమాజం కోసమే అని, నోటి మాటకు, చేతిరాతకు సంధానం కుదిరినప్పుడే భాష పోషకంగా ఉంటుందని భావించిన మహనీయుడు అన్నారు. ప్రజల భావాలకు అనుగుణంగా భాష ఉండాలని, వాళ్ళ భావాలకు, అందరికీ అర్థమయ్యేరీతిలో రాయగలగాలని, అందుకే వాడుక భాష చాలా అవసరమని గిడుగువారు వాదించారన్నారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకన్నీ గౌరవ అతిథిగా బండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పాపయ్య యాదవ్ నగర్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 131 డివిజన్ పాపయ్య యాదవ్ నగర్ గోకుల యాదవ సంఘం వాసులు ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ జన్మష్టమి వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం భరతనాట్య కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 127 డివిజన్ అధ్యక్షులు పెరిక శివ, వెంకట్రావు యాదవ్, తిరుమల రాజు యాదవ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ వ్యవస్థ పతనానికి అద్దం పట్టిన సంజ వెలుగు



నవతెలంగాణ-కల్చరల్

మారుతున్న కాలంతో మనుషులు మారుతూ డబ్బు సంపాదనే లక్ష్యంగా ఉన్న సందర్భంలో కుటుంబ సంబంధాలు కనుమరుగై.. పతనం దిశగా వెడుతున్నాయని సంజ వెలుగు సాంఘీక పద్య నాటకం అద్దం పట్టింది. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై కళా నికేతన్ హైదరాబాద్ వారి నిర్వహణలో తడకమల్ల రామ చంద్ర రావు రచించిన సంజె వెలుగు సాంఘీక నాటకం డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించారు. తల్లిదండ్రులు ఆస్తి పాస్తులపై వున్న శ్రద్ధ వారిపై లేకుండా ఎలా వదిలించు కోవాలని చూసే నేటి యువత వికత మనస్తత్వంకు తగిన గుణ పాఠం చెప్పే సందేశంతో నాటకం ముగుస్తుంది. సాంఘీక నాటకం ఇనా పద్యాలు ఉండటం సంజె వెలుగు విశేషం టిక్కెట్ పై తెలుగు నాటకంను ఉద్యమ స్థాయిలో నిర్వహిస్తున్న రస రంజని ప్రముఖ నాటక సంస్థ నిర్వహణలో ఈ నాటకం ప్రదర్శన జరిగింది. సంస్థ నిర్వాహకులు మోహన్ సేనాపతి నట రాజ్ రామ కోటేశ్వర రావు పర్యవేక్షణ చేశారు.

## కాంగ్రెస్ పార్టీకి ఛానల్, పత్రిక ఉండాలి

నవతెలంగాణ-కల్చరల్

దాదాపు అన్ని రాజకీయపార్టీలకు పత్రికలో లేదా ఛానెల్స్ వున్నాయని కాంగ్రెస్ పార్టీకి కూడా ఛానెల్ పత్రిక ఉంటే బాగుంటుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంత రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ అనిచెప్పారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై ఇటీవల శాసన మండలి సభ్యుడుగా ఎంపికైన అమీర్ అలీఖాన్ ను కాంగ్రెస్ నాయకులు మైనారిటీ బీసీ ఎస్ఎస్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హనుమంత రావు పాల్గొని మాట్లాడుతూ సియాసత్ పత్రిక ఉర్దూ భాషా సంస్కతుల వేదికగా రాజకీయ చైతన్యానికి చిరునామాగా నిలిచిందని పేర్కొన్నారు. అమీర్ అలీఖాన్ స్పందన తెలుపుతూ తనను శాసన మండలి సభ్యుడుగా ఎంపిక చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్య వాదాలు తెలిపారు. ముస్లిం యువత విద్యా ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తామని తెలిపారు. ఉర్దూ భాష ప్రభావాన్ని కాపాడుతాను అన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు సమయపాలన పాటించేలా చూడాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

పారిశుద్ధ్య కార్మికులు సమయపాలన పాటించేలా చూడాలని, ప్రతి రోజు మూడు సార్లు హాజరు తప్పకుండా తీసుకోవాలని అంబర్ పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ పారిశుద్ధ్య సూపర్‌వైజర్లకు సూచించారు. మంగళవారం కాచిగూడలోని వార్డు కార్యాలయంలో సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్‌ఎఫ్‌ఎలు, సూపర్‌వైజర్లతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటలకు, ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు మూడు సార్లు తప్పకుండా హాజరు తీసుకోవాల న్నారు. అలాగే లాంగ్ ఆబ్సెంట్ ఉన్నవారిని గుర్తించాలని ఎస్‌ఎఫ్‌ఎలు దగ్గరుండి పని చేయించాలని తెలిపారు. జీవీపీ పాయింట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఒహెచ్ డా.వై. హేమలత, సూపర్‌వైజర్లు, ఎస్‌ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు.. నాయకుల సంబరాలు



నవతెలంగాణ-అంబర్‌పేట


లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నారు. నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోనె ప్రదీప్ రావు ఆధ్వర్యంలో నాయకులు జనార్దన్, గులాబ్ సతీష్, సోమ రాజు, శ్రీను, సతీష్, లడ్డు యాదవ్, స్వాతి, అరుణ్ తదితరులు మిఠాయిలు తినిపించుకున్నారు. కుట్రలు, కుతంత్రాలను ధైర్యంగా ఎదుర్కొని నిర్బంధాలను తెంచుకొని కడిగిన ముత్యంలా కవిత బయటకు వస్తున్నారన్నారు.

# సేవలు ఫుల్.. వైద్యులు నిల్..

☞ ప్రసవ వేదనలో పేట్ల బుర్జు ఆధునిక ప్రసూతి ఆస్పత్రి.. ☞ బదిలీ అనంతరం భర్తీ కానీ వైనం.. ☞ పని ఒత్తిడికి గురవుతున్న వైద్యులు, సిబ్బంది..





నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్ర నగరంలోనే ప్రసూతి వైద్య సేవలో ప్రాచుర్యం పొందింది. నిత్యం వందలాది రోగుల సేవలు.. మరో పక్క అత్యవసర ప్రసవ వైద్యం.. అంతకంటే అత్యంత ప్రాముఖ్యం క్రిటికల్(చివరి దశలో) పరిస్థితుల్లో వచ్చే రోగులు కొందరైతే.. మరి కొందరు ప్రాథమిక, ఏరియా, నగరంలోనే కాక వివిధ జిల్లాల నుండి ప్రభుత్వ, ప్రయివేట్ రెఫరల్ అత్యవసర చికిత్సలకే వచ్చే రోగులు. ఇలా నిత్యం తమదైన శైలిలో వైద్య సేవలందించి తల్లి ఒడిల ప్రాతినిధ్యం వహిస్తుంది పేట్ల బుర్జు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి. ప్రస్తుతం ఆ ఆస్పత్రి వైద్యుల కొరతతో ప్రసవ వేదన పడుతుంది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేసిన బదిలీల్లో వెళ్లిన వైద్యుల స్థానంలో తిరిగి వైద్యులను భర్తీ చేయకపోవడంతో ఉన్న వైద్యుల పై భారం పడుతుంది. నిత్యం వందలాదిగా వచ్చే రోగులకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్స్ వైద్యుల భర్తీ నేటికీ కాకపోవడంతో ఒత్తిడికి గురవుతున్నారు. 6 యూనిట్లకు ముగ్గురే ప్రొఫెసర్‌లు, 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్‌లకు ఒక్కరే, 26మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ లకు 6 గురే అన్నారు. అనేస్తేసియాలో అసిస్టెంట్ ప్రొఫెసరేల్ ఇలా సిబ్బంది కొరతతో నిత్యం ఉన్న వైద్యులపై ఒత్తిడి పెరుగుతుంది.

### నిత్యం రద్దీ..

ఆస్పత్రికి రోజు ఓపీ సుమారు వంద నుండి 120 పైగానే చికిత్సలు పొందుతారు. అత్యవసర ప్రసవాలు, రెఫరల్ ప్రసవాలు, మహిళా సమస్యలు ఇలా సుమారు 30 నుండి 40 పైగానే చికిత్సలు పొందుతారు. ఇదిలా ఉండగా గైనక్, ఫ్యామిలీ ప్లానింగ్, రికావరీ, క్రిటికల్ ఆపరేషన్ వంటి చికిత్సలు వస్తూనే ఉంటాయి. గత వారం మంగళవారం ఒక రోజే 31 శస్త్ర చికిత్సలు, ప్రసవాలు జరిగాయి. బుధవారం 30 ప్రసవాలు, ఇలా రోజుకు 20 నుండి 30 వరకు ప్రసవాలు జరుగుతూనే ఉంటాయి. ఇదిలా ఉండగా అత్యవసర, ఆపరేషన్ ప్రసవాలు జరుగుతూనే ఉంటాయి. వీటికి తోడు క్రిటికల్ కేసులు ఉంటాయి.

### వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల నుండి..

అనుభవజ్ఞులై ఉన్న వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల జిల్లా, ఏరియా ఆస్పత్రిలో నుండి నిత్యం రెఫరల్ కేసులు వస్తూనే ఉన్నాయి. గతంలో ఎక్కువగా వచ్చేవి. ప్రస్తుతం ప్రభుత్వం జిల్లా, ఏరియా ఆస్పత్రిలో అనుభవమైన ప్రొఫెసర్ వైద్యులు ఉంటే అక్కడే చికిస్తలు నిర్వర్తిస్తారని, దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని బదిలీలు చేశారు. అయిన శంషాబాద్, షాద్ నగర్, మలక్ పేట్, కింగ్ కోటి, బేలా, గోల్ కొండా, వికారాబాద్ ఆస్పత్రుల నుండి రెఫరల్ రోగులు రావడం శోచనీయం.

## 'పని మనిషిగా చేరి ఇంటికి కన్నం'

- ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, నగదు మాయం
- క్రైమ్ టీం పోలీసులను అభినందించిన ఏసీపీ కె.శంకర్, సీఐ యూ.చంద్రశేఖర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఒక న్యాయవాది నివాసంలో పని మనిషిగా చేరిన ఒక మహిళ ఇంటికి కన్నం వేసి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు దోపిడీ చేసి కటకటాలపాలైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం నారాయణ గూడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ గూడ సీఐ యూ.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం బాగ్‌లింగంపల్లికి చెందిన చాకలి ఇందిర (42) అనే మహిళ న్యాయవాది విపిన్ ఇంట్లో పని మనిషిగా కొద్ది రోజుల క్రితం చేరిందని, ఈ క్రమంలో రోజు పనికి వస్తూ ఇంట్లో కనిపించిన నగదును దొంగలిస్తుందని, ఇటీవల న్యాయవాది అమ్మమ్మ బీరువాలో ఉన్న 3 తులాల బంగారు మంగళ సూత్రం, రెండు తులాల బంగారు గొలుసు, అర తులం పుస్తెలు మాయమైనట్లు తెలిపారు. సుల్తాన్ బజార్ ఏసీపీ కె.శంకర్ ఆధ్వర్యంలో నారాయణగూడ పోలీసులు విచారణ ప్రారంభించి నిందితురాలు చాకలి ఇందిరపై నిఘా పెట్టారు. ఆమె బంగారు ఆభరణాలను చిక్కడపల్లిలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టడానికి ప్రయత్నిస్తుండ గా పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల విచారణలో ఆమె దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో పోలీసులు ఆమె వద్ద నుంచి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండ్ కు తరలిం చినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ క్రైమ్ కేసును ఛేదిం చిన డీఐ డి.నాగార్జున, డీఎస్ఐ జి.వెంకటేష్, క్రైమ్ పోలీస్ సిబ్బంది కె.అభిలాష్, సిహెచ్.అరుణ్ కుమార్, ఎం.సురేష్, ఎస్.సంతోష్, పి.విష్ణుమూర్తిలను ఏసీపీ కె.శంకర్, సీఐ చంద్రశేఖర్ వారిని అభినందించారు.

## చిన్నారిని కిడ్నాప్ చేసిన మహిళ రిమాండ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ చిన్నారి కిడ్నాప్ కేసును కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు తదితరులు వివరాలను వెల్లడించారు. కామారెడ్డికి చెందిన తిరుపతి భార్య దాసరి మంజుల (29) వృత్తిరీత్యా భిక్షటన చేస్తుంది. లచ్చు, మమత దంపతుల సంవత్సరం 4 నెలల చిన్నారి శ్రీలక్ష్మి అమ్మమ్మ పార్వతమ్మ తో కలిసి సోమవారం అర్ధరాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్ బస్‌స్టాప్‌లో పడుకు న్నారు. గతంలో జరిగిన పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని మంజుల, ఆమె మరిది మున్నా ఇద్దరు కలిసి సోమవారం అర్ధరాత్రి చిన్నారి శ్రీలక్ష్మిని కిడ్నాప్ చేశారు. అదే రాత్రి 2 గంటల సమయంలో అమ్మమ్మ పార్వతమ్మ కాచిగూడ పోలీ స్స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న కాచిగూడ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో డబీర్ పుర రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు ఆచూకి లభించడంతో మంగళవారం ఉదయం చాకచక్యంగా వారిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. దాసరి మంజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారిని ఆమె అమ్మమ్మకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ సీఐ చంద్రకు మార్, అంబర్ పేట డిఐ మల్లేశ్వరి, ఎస్సై జి. సురేశ్‌కుమార్, పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్ డిమాండ్ బుక్స్ స్కీం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో నిరుద్యోగ అభ్యర్థులకు అఫ్జల్ గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉందని గెజిటెడ్ లైబ్రేరియన్ సి.అపర్ణ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ.. ఆన్ డిమాండ్ బుక్స్ స్కీంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆన్ డిమాండ్ బుక్స్ స్కీమ్ రీడర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి అభ్యర్థుల తాకిడి పెరిగిందని.. రాష్ట్రంలో అతిపెద్ద విజ్ఞాన భాండాగారంలో వివిధ భాషల్లో ఇప్ప టికే సుమారు 5 లక్షల పైచిలుకు పుస్తకాలు ఉన్నాయన్నారు. వీటికి అదనంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు పుస్తకాలు, సెక్షన్ అందుబాటులో ఉందని తెలిపారు. విశాలమైన ప్రాంగణం, నిశ్శబ్ద వాతావరణంలో అభ్యర్థులు ఇక్కడే ఉండి గంటల తరబడి చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలు అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. టెస్ట్ బుక్స్ సెక్షన్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

## డ్రయినేజీ రివర్స్ ఫ్లో సమస్యను పరిష్కరించండి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

బాగ్ అంబర్‌పేట బతుకమ్మకుంట సాయి కాంప్లెక్స్ వద్ద డ్రయినేజీ రివర్స్ ఫ్లో సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం డివిజన్ కార్పొరేటర్ బి. పద్మవెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని సందర్శించారు. గత 15 రోజులుగా సాయి కాంప్లెక్స్ వద్ద వానా నీరు, డ్రయినేజీ మురుగు రెండు కలిసి రివర్స్ ఫ్లో అవుతుండడంతో బస్తీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్, ఎమ్మెల్యే ఇద్దరు సంబంధిత అధికారులతో కలిసి సమస్యను తెలుసుకున్నారు. తిలక్ నగర్ సిగ్నల్ వద్ద సమస్య ఉందని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, నాయకులు జె. బాలరాజు, కె.శ్రీహరి, చంద్రశేఖర్, ఆర్బీఐ రమేష్, అర్జున్, సూర్యవంశీ, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హెబ్రోన్ చర్చిలో వివాదాలకు తావులేదు

హెబ్రోను ట్రస్టు, సొసైటీ ప్రతినిధులు వై.జాన్సుబ్బారెడ్డి, జోసెఫ్ కురియన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గోల్కొండ చౌరస్తా వద్ద గల ప్రార్థన మందిరం హెబ్రోన్ చర్చలో వివాదాలకు తావు లేకుండా సంఘటితమై చర్చి అభివృద్ధికి పని చేస్తామని హెబ్రోను చర్చి వ్యవస్థాపకుడు బ్రదర్ భక్తసింగ్ ఆశయాలకు అనుగుణంగా అంతా కలిసికట్టుగా పనిచేస్తామని హెబ్రోను ట్రస్టు, సొసైటీ ప్రతినిధులు వై.జాన్సుబ్బారెడ్డి, జోసెఫ్ కురియన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తెలిపారు. గత కొన్నేండ్లుగా హెబ్రోను చర్చి సొసైటీ, ట్రస్టు సభ్యుల మధ్యన కొనసాగుతున్న విబేధాల నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వ ర్‌రావు అధ్యక్షతన ట్రస్టు, సొసైటీ ఇరువు వర్గాల మధ్యన సమాధాన, సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో ఇరువురు విలేకర్లతో మాట్లాడారు. ఎలాంటి విబేధాలకు తావులేకుండా, ట్రస్టు, సొసైటీ అనే తేడా లేకుండా అంతా కలిసి హెబ్రోను సంఘం క్షేమం కోసం పనిచేస్తామన్నారు. దైవజనుడు బ్రదర్ భక్తసింగ్ చూపిన మార్గంలో పయనిస్తామని తీర్మానించామని ఇందుకు రెండు రాష్ట్రలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హెబ్రోను సంఘాల విశ్వాసులంతా సహకరించాలని కోరారు. హెబ్రోను పరిచర్యను ఇక నుంచి కలిసికట్టుగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెనహర్, పలువురు హెబ్రోను సంఘాల విశ్వాసులు, దైవసేవకులు పాల్గొన్నారు.

## త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ సేవల విస్తరణ

- చైర్మెన్ ఎన్.గిరిధర్ రెడ్డి



నవతెలంగాణ-ధూల్‌పేట్

త్వరలో రాష్ట్రంలో సెట్విన్ సేవలను విస్తరింపజేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆ సంస్థ చైర్మెన్ ఎన్. గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే జహీరాబాద్, తాండూర్, వికారాబాద్, సంగారెడ్డి, జడ్చర్ల ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. మంగళవారం సెట్విన్ మోతి గల్లీ శిక్షణ కేంద్రాన్ని మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావుతో కలిసి సందర్శించారు. కేంద్రంలోని బ్యూటిషన్, కట్టింగ్ అండ్ టైలరింగ్, కంప్యూటర్, ఎయిర్ లైన్ టికెటింగ్, సెల్ ఫోన్ రిపేర్, కంప్యూటర్ హార్డ్ వేర్, ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సెట్విన్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## అక్రమ నిర్మాణాలను గుర్తించి రోజూవారి రిపోర్టు ఇవ్వండి

- టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించిన డీసీ



నవతెలంగాణ-అంబర్‌పేట

టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ప్రతి రోజు ఫీల్డ్ ఇన్స్‌పెక్షన్ చేసి అక్రమ నిర్మాణాలపై రిపోర్టు ఇవ్వాలని అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లాన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆదేశాలు, సూచనలు చేశారు. సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూమి ఆక్రమణలు, నాలా ఆక్రమణలు, సిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల అనుమతి తీసుకొని మూడు, నాలుగు అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన వాటి వివరాలను ఏ రోజుకారోజు తనకు అందజేయాలని అధికారులకు చెప్పారు. ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ తో పాటు న్యాక్ ఇంజనీర్లు కూడా ప్రతి రోజు ఫీల్డ్లో ఉండి గుర్తించిన అక్రమ కట్టడాల వివరాలను తనకు తెలిపాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ సుమిత్ర, సెక్షన్ ఆఫీసర్ హఫీజ్, న్యాక్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పాతబస్తీలో పార్టీ బలోపేతానికి కృషి..



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తున్నామని బహదూర్ పురా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, సీడబ్ల్యూసీ మెంబెర్ తారిఖ్ అన్వార్, జి.నిరంజన్ లతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తారిఖ్ అన్వార్ తెలంగాణ రాక ముందు, తెలంగాణ వచ్చిన తర్వాత కాంగ్రెస్ క్యాడర్, పార్టీలో మార్పులు, ప్రజా సమస్యలు వంటి పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు. పలు అంశాల ను చర్చించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## పాతబస్తీలోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ చాంద్రాయణగుట్ట

నగరంలో హైడ్రా ఆధ్వర్యంలో జరుగుతున్న చెరువుల కబ్జాలోని కట్టడాలను కూల్చివేత కార్యక్రమంలో భాగంగా పాతబస్తీకి చెందిన పలు ప్రాంతాలలో కొంతమంది ప్రజా ప్రతినిధులు వారి అనుచరులు ఇష్టానుసారంగా ఎకరాల కొద్ది చెరువులను ఆక్రమించి కట్టడాలను నిర్మించారని అందుకు సంబంధించి బండ్లగూడ సూరం చెరువుపై జరిగిన అక్రమ కట్టాడాలపై ఓవైసీ బ్రదర్స్ నిర్మించినటువంటి ఫాతిమా స్కూల్ పై విచారణ జరిపి సరియైన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను భాగ్యనగర్ యువమోత్సవ అధ్యక్షుడు శివచంద్రగిరి కలిసి వినతి పత్రం అందజేశారు. వారి వెంట భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అలీ, శివచంద్రగిరి దళిత మోర్చా అధ్యక్షులు పగా రాజేశ్వర్, భారతీయ జనతా పార్టీ నాయకులు నర్సింగ్ రావు, పవన్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలను రద్దు చేయాలి

- పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మధు, నాగరాజు
- విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ పుల్లారావుకు వినతి పత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్/అంబర్‌పేట

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటు వంటి నారాయణ, శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు, పొడపంగి నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ పుల్లారావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలో రోజుకో విద్యార్థి బలవర్మరణం పాలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకపక్క ఫీజుల దోపిడీ కొనసాగిస్తూ మరోపక్క విద్యార్థి ఆత్మహత్యలకు కారణం అవుతున్న ఈ రెండు కార్పొరేట్ కళాశాలను రద్దు చేసేంతవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర శ్రమను జలగల వలె పీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల, రాజకీయ నాయకుల అండదండలతో ఒక బ్రాంచ్ కి పర్మిషన్ తీసుకొని దానికి అనుబంధంగా 5 లేదా 6 బ్రాంచ్‌లను కొనసాగిస్తూ ఇష్టానుసారంగా విద్యను వ్యాపారం కొనసాగిస్తున్నారని తక్షణమే అనుమతులేని కళాశాలలను రద్దు చేయాలన్నారు. ఈ కళాశాలలో మరణించిన విద్యార్థుల మరణాలపై సీబీఐతో విచారణ చేపించి యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని పీడీ ఎస్‌యు డిమాండ్ చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పకడ్బందీగా విద్యకు చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఈ కాలేజీలను రద్దు చేసేంతవరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద నవీన్ రాష్ట్ర నాయకులు తీగల,కె.ఝాన్సీ పాల్గొన్నారు.

## కచ్చా నాలా నూతన పైప్ లైన్ పనులు ప్రారంభించాలి

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ లోనీ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం నుండి టీఆర్‌టీ, జవహర్ నగర్ మెయిన్ రోడ్ మీదుగా నూతన కచ్చా నాలా పైప్ లైన్ పనులను త్వరగా ప్రారంభించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం వద్ద తరచూ సెవరేజి ఓవర్ ఫ్లో ఫిర్యాదులు రావడంతో మంగళవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, జలమండలి డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ సూపర్వైజర్ శంకర్ వారి సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. సమస్యను పరిశీలించిన అనంతరం పలు డ్రయినేజీ కనెక్షన్లు కచ్చా నాలాలోకి ఇవ్వడంతో కచ్చా నాలాలోకి చెత్త చెదారం, మట్టి చేరి ఓవర్ ఫ్లో సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. కచ్చా నాలాలోని వ్యర్థాలను తొలగించి, సెవరేజి పైప్ లైన్ లను క్రమబద్ధీకరించి నూతన కచ్చా నాలా పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్ , సీనియర్ నాయకుడు శ్రీకాంత్, గ్యణేష్, సాయి కుమార్, ఆనంద్ రావు, ఆలయ ఈవో లక్ష్మ రెడ్డి, సెక్రటరీ రాజు, పూజారి కాశీ పంతులు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## ఎన్ని కుట్రలు చేసినా కవితక్కను ఏమీ చేయలేరు

- భారత జాగృతి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పరకాల మనోజ్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎన్ని కుట్రలు చేసినా కవితక్కను ఏమి చేయలేరని భారత జాగృతి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పరకాల మనోజ్ గౌడ్ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత జాగృతి ముషీరా బాద్ నియోజక వర్గం కన్వీనర్ పరకాల మనోజ్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆర్టీసి క్రాస్ రోడ్, రాంనగర్ చౌరస్తా, దయారా మార్కె ట్‌లో బాణాసంచాలను కాల్చారు. వీధి వ్యాపారులకు, వచ్చేపోయే వారికి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మనోజ్ గౌడ్ మాట్లాడుతూ.. అక్రమంగా 166 రోజులు కవితక్కను జైల్‌లో పెట్టారని ఆరోపించారు. త్వరలోనే ఈ కేసు నుంచి కడిగి న ముత్యంలా కవిత బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్ర మంలో బీఆర్‌ఎస్ నాయకులు కేశవపురం శ్రావణ్, బల్వంత్, పాండు, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.



మొహర్రం సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీస్, స్పెషల్ బ్రాంచ్ పోలీస్, షీ టీమ్స్ వంటి డెవలప్ మెంట్ స్పెషల్ ఫోర్స్‌లతో తెలంగాణలోని అన్ని అషుర్‌ఖానాలో భద్రతా ఏర్పాట్లు ప్రశాంతంగా నిర్వహించిన సందర్భంగా రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌కి దట్టి కట్టి, మేమొంటోతో సత్కరిస్తున్న రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ.

నవతెలంగాణ-ధూల్‌పేట్

ట్రెక్కింగ్ చేయాలంటే ఆత్మవిశ్వాసం.. ధైర్యం ఉండాలి. అంతకు మించి వెళ్తున్న ప్రాంతంపై పూర్తి అవగాహన, అవసరమైన స్లీపింగ్ బ్యాగ్, బ్యాక్ పాక్ (ట్రెక్కింగ్ బ్యాగ్), హైకింగ్ బూట్స్, యాంటీ షాక్ ట్రెక్కింగ్ పోల్స్, హ్యాట్, జాకెట్ వంటి ముఖ్య వస్తువులను కూడా మోసుకెళ్లాలి. అందుకే ఇది పురుషాధిక్య రంగంగా రాజ్యమేలుతుంది. అయినా ఇందులోనూ తమ సత్తాచాటుకుంటున్న మహిళలు ఎందరో ఉన్నారు. అటువంటి వారిలో **బండారు అన్నపూర్ణ** ఒకరు. ఇటీవలె యూరప్ ఖండంలోని ఎల్బ్రస్ పర్వత శిఖరంపై మన జాతీయ జెండా ఎగరేసిన ఆమె సాహస యాత్ర పరిచయం నేటి మానవిలో...

# అవమానాలు అధిగమించి.. పర్వతాలు అధిరోహించి...

'ఎవరేమీ అనుకున్నా...నువ్వుండే రాజ్యాన.. రాజు నువ్వే... బంటు నువ్వు మంత్రి నువ్వే...సైన్యం నువ్వే..ఏమైనా ఏదైనా నువ్వెళ్లే బడిలోన...పలకా నువ్వే.. బలపం నువ్వే...అన్నీ నువ్వే కావాలి..అనునిత్యం పోరాడాలి...అనుకున్నది సాధించాలి. అవమానాలే ఆభరణాలు..అనుమానాలే అనుకూలాలు...సందేహాలే సందేశాలు.. ఛీత్కారాలే సన్మానాలు అనుకోవాలీ.. అడుగేయాలి.. ముళ్లమార్గాన్ని అన్వేషించాలి.. అలుపొస్తున్నా కలలే కన్నా. అనుకున్న అధిరోహించాలి' అనే ఓ సినీ గీతం ఎంతో స్ఫూర్తిదాయకం. అలాంటి స్ఫూర్తిదాయక మహిళ మౌంటనీర్ అన్నపూర్ణ. ఎన్నో అవమానాలు.. మరెన్నో అవహేళనలు.. వీటిన్నింటినీ దాటుకొని పర్వతారోహణ చేస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నారు.

## కఠోర కృషితో...

అన్నపూర్ణ సొంతూరు గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి. తల్లి వెంకటేశ్వరమ్మ, తండ్రి బండారు శ్రీరామచంద్రరావు. ఓ సాధారణ కుటుంబంలో పుట్టిన ఆమె ప్రపంచంలోని ఎత్తైనా ఏడు పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే మౌంట్ కిలిమంజారో ఆఫ్రికా టాంజానియా), రష్యాదేశంలోని మౌంట్ ఎల్బ్రస్ (యూరప్) పర్వతాలను అధిరోహించారు. మిగతా లక్ష్యాలను సాధించేందుకు కఠోర కృషిని కొనసాగిస్తున్నారు. విజయవాడలోని రైల్వే మిక్సిడ్ హైస్కూలులో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. విజయవాడలోని కాకతీయలో డిగ్రీ, కాకినాడ ఆదిత్యలో ఎంఎస్‌సి (బయోకెమిస్ట్రీ), అనంతరం బీఈడీ పూర్తిచేశారు. విజయవాడలోని విపి సిద్ధార్థ పబ్లిక్‌స్కూలులో కొంత కాలం టీచరుగా పనిచేశారు. 2015లో మహేష్‌రెడ్డితో వివాహమైంది. భర్త ఉద్యోగ రీత్యా సౌదీ (యూఏఐ)కి వెళ్లారు. అక్కడి ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్ జెద్దా (ఐఐఎస్‌జే)లో సైన్స్ (బయాలజీ) టీచర్‌గా చేశారు. కోవిడ్ సమయంలో తిరిగి స్వదేశానికి వచ్చేశారు. వీరి కొడుకు సిద్ధార్థరెడ్డి. కోవిడ్ సమయంలో ఆమె కొన్నాళ్లు ఇంటికే పరిమితమయ్యారు.

## అవమానాలు దిగమింగి...

పొడుగు తక్కువ, అంతగా ఫిజికల్ ఫిట్‌నెస్ లేదు, 'ఈవిడ సాధించగలదా?' అని అవమానించినవాళ్లే ఎక్కువ. అయినా లక్ష్యసాధనకోసం అనునిత్యం కష్టపడ్డారు. ప్రస్తుతం భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచ పర్వతాలపై ఎగరేస్తున్నారు.



## ఆత్మవిశ్వాసమే తోడుగా...

వ్యవసాయ కుటుంబం కావటంతో చిన్నప్పుడు తండ్రితోపాటు పంట పొలాల్లోకి వెళ్లేవారు. రైతులు పంటలు పండించేందుకు చేస్తున్న శ్రమ, ఇతర కష్టనష్టాలు ఆమెకు బాగా తెలుసు. ప్రకృతి, పర్యావరణమంటే అమితమైన ప్రేమ. సాహస కృత్యాలు చేయటం కూడా చిన్నప్పటి నుంచే ఆమెకు అలవాటు. కరోనా సమయంలో ఖాళీ సమయాల్లో ఏదో ఒకటి సాధించాలనే కుతూహలంతో పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నారు. దానికోసం అమ్మ చేసిన సున్నుండలు, రాగి జావ వంటి బలమైన ఆహారం ఆమెకు తోడ్పడ్డాయి. మొదట్లో కుటుంబ సభ్యులు తటపటాయించినా భర్త మాత్రం ప్రోత్సహించారు. మంగళగిరి పానకాలస్వామి కొండను రోజుకు రెండుసార్లు ఎక్కి దిగడం పర్వతారోహణ మీద పట్టునిచ్చింది. విజయవాడ ఎడ్వెంచర్ క్లబ్ (వీఏసీ) ద్వారా విజయవాడ పరిసర ప్రాంతాల్లో మిత్రులతో కలిసి ట్రెక్కింగ్‌కు కూడా వెళ్లేవారు. 2020లో హిమాలయాల్లోని కేధార్‌కాంత శిఖరాన్ని ఎక్కారు. 2023 ఆగస్టు 15న ఆఫ్రికా ఖండంలో ఎత్తైన కిలిమంజారో పర్వతం ఎక్కి మన జాతీయ జెండాను ఎగరేశారు.



### ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్నా...

ఈనెల 14 నుంచి వివిధ బేస్ క్యాంపులో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మా శరీరం తట్టుకోగలదా.. లేదా అనేదానిపై రక రకాల పరీక్షలు, శిక్షణలు కూడా ఇచ్చారు. ట్రెక్కింగ్ కూడా కొనసాగింది. 18 రాత్రి 10 గంటలకు సమ్మిట్ పుష్‌కు బయలు దేరాం. 19న ఉదయం 7.54 గంటలకు శిఖరాన్ని చేరుకున్నాం. ప్రతిరోజూ మా ట్రెక్కింగ్ కొనసాగేది. నా యాత్రకు నా భర్త కొండపు మహేష్‌రెడ్డి, అమ్మ వెంకటేశ్వరమ్మ, తమ్ముడు శ్రీపతిరావు బాగా సహకరించారు. మిగతా ఐదు పర్వతాల అధిరోహణ కూడా చేసి చరిత్రలో నిలిచి పోవాలనేది నా తాపత్రయం. అప్పటి వరకు విశ్రమించను.

**- బండారు అన్నపూర్ణ.**

## ఎల్బ్రస్ పర్వతారోహణ పెద్ద సవాల్

యూరప్‌లో ఎత్తైన పర్వతమైన ఎల్బ్రస్ అధిరోహణ పెద్ద సవాల్‌గా మారింది. సముద్ర మట్టానికి 5,642 మీటర్లు (18,510 అడుగులు) ఎత్తులో ఉన్న ఒక నిద్రాణమైన అగ్నిపర్వతం ఇది. దీన్ని అధిరోహించే క్రమంలో మైనస్ 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుని లోయలాంటి ప్రదేశంలో పడిపోకుండా అత్యంత జాగ్రత్తగా అడుగు వేయాలి. అక్కడి చలి పరిస్థితులను తట్టుకోలేక ఆమె ఏడ్చిన సందర్భాలు కూడా అనేకం. అలాంటి పరిస్థితుల్లో కూడా కుటుంబ జీవనం కోసం మంచుకొండల్లో పనిచేస్తున్న కార్మికులను చూసి ధైర్యం కూడగట్టుకుని ముందుకు సాగారు. భారతదేశం నుంచి మొత్తం 8 మంది పర్వతారోహణకు వెళ్లగా తెలంగాణా నుంచి జయసింహ, ఆంధ్రా నుంచి బండారు అన్నపూర్ణ, కాకినాడకు చెందిన కోనేరు అనిత శిఖరాన్ని చేరుకున్నారు. ఈ ఏడాది ఆమెకు రూ.5 లక్షల వరకూ ఖర్చయ్యింది. ఈ మొత్తాన్ని భర్తే భరించారు. ప్రస్తుతం మిగతా పర్వతాల అధిరోహణకు ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తే భారతదేశానికి మరింత ఖ్యాతిని తెచ్చేందుకు అన్నపూర్ణ కృషిచేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

**- యడవల్లి శ్రీనివాసరావు**



# ఇలా చేస్తే...

కోడిగుడ్లలో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్లనే గుడ్డు రోజూ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తుంటారు. సాధారణంగా గుడ్లను రోజూ బ్రేక్ ఫాస్ట్ లేదా లంచ్‌లో తీసుకుంటూ ఉంటాం. అల్పాహారంగా గుడ్లు తింటే ఎక్కువసేపు ఆకలి అనిపించదు. కానీ గుడ్లు ఉడకబెట్టేటప్పుడు ఒక్కోసారి పగిలిపోవడం, పొట్టు సరిగా రాకపోవడం వంటి సమస్యలు వేదిస్తుంటాయి. గుడ్లు ఉడకబెట్టడంలో చాలా మంది చేసే చిన్న పొరపాట్ల వల్ల



గుడ్డు పగుళ్లకు దారితీస్తాయి. కొద్దిపాటి చిట్కాలు పాటిస్తే గుడ్లను సరిగ్గా ఉడికించుకోవచ్చు.

**సింపుల్ చిట్కాలు..**

వెడల్పాటి పాత్రలో ఉడికించాలి..రెండు గుడ్లు ఉడకబెడుతున్న ట్లయితే, వెడల్పాటి పాత్రను ఎంచుకోవాలి. రెండు లేదా అంతకంటే ఎక్కువ గుడ్లు వండేటప్పుడు చిన్న పాత్రలో ఉడికిస్తే, అవి ఒకదానికొకటి తాకి పగిలిపోయే అవకాశం ఉంది. గుడ్లు ఒకదానికొకటి తాకకుండా వెడల్పాటి గిన్నెలో ఉడికించాలి.

**ఫ్రిజ్ నుండి తీసివేసిన వెంటనే ఉడికించవద్దు..**

గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచిన తర్వాత వాటిని నేరుగా ఉడకబెట్టినట్లయితే, అది పగిలిపోయే అవకాశం ఉంది. వీటిని ఫ్రిజ్ నుంచి తీసిన తర్వాత నేరుగా నీళ్లలో వేసి మరిగిస్తే కచ్చితంగా పగుళ్లు వస్తాయి. కాబట్టి మొదట ఫ్రిజ్ నుంచి గుడ్లను తీసి, గది ఉష్ణోగ్రత వద్ద 10 లేదా 15 నిమిషాలు పక్కనపెట్టుకోవాలి. అప్పుడు వాటి ఉష్ణోగ్రత సాధారణ స్థితికి చేరుకుంటుంది. ఆ తర్వాత ఉడకబెట్టడం మంచిది.

**మరిగే నీటిలో ఉప్పు కలపాలి**

కొన్నిసార్లు గుడ్డు సరిగ్గా ఉడకబెట్టిన తర్వాత కూడా పొట్టు సరిగ్గా ఊడి రాదు. అలాంటప్పుడు గుడ్లు ఉడికించే నీటిలో కొంచెం ఉప్పు కలుపుకోవాలి. ఉప్పు నీటిలో గుడ్లను ఉడకబెట్టడం వల్ల వాటి తొక్కలు సులభంగా ఊడి వస్తాయి.

**మీడియం మంట మీద ఉడికించాలి..**

గుడ్లు ఉడకబెట్టేటప్పుడు మంట ఎక్కువగా ఉండకూడదు. గుడ్డు ఎప్పుడూ మీడియం మంట మీద ఉడికించాలి. ఇలా చేయడం వల్ల గుడ్డు పగలదు. అంతేకాకుండా పై తొక్క సులభంగా వస్తుంది. ■

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

రక్షించడంలో వైద్య, ఆరోగ్యశాఖ మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య చర్యలు వేగవంతం చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. పీహెచ్‌సీ సెంటర్లలో 24 గంటలు వైద్యమందేలా చూడాలన్నారు. అన్ని గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బందిని పంపించి సంచార వైద్య బృందాల ద్వారా ప్రజలందరికీ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని గ్రామాలకు పారిశుధ్య నిధులు కేటాయించి వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అన్ని జిల్లా కేంద్రాస్పత్రుల్లో, పీహెచ్‌సీ సెంటర్లలో డెంగ్యూ నిర్ధారణ కిట్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. డెంగ్యూ వల్ల మృతి చెందిన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఆ సంఘం ఆఫీస్ బేరర్లు నారి ఐలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, బొప్పనిపద్మ, కొండమడుగు నర్సింహ్మా, ములకలపల్లి రాములు, రాష్ట్ర నాయకులు ఎ.వీరన్న, ఎం.సైదులు, జగన్, సాంబశివ, శశిధర్, ఆంజనేయులు, నరసింహులు, లంక రాఘవులు, సమ్మయ్య, పెద్ది వెంకట్రాములు, గోపాల్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో జీవితానికి మేలు


(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టిపెట్టిందన్నారు. మనిషి జీవితంలో ప్రతినిత్యం గెలుపు ఓటముల కోసం పోరాటం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అభిప్రాయపడ్డారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొరియా పర్యటనకు వెళ్లారనీ, ఒక యూనివర్సిటీ నుంచి పెద్ద సంఖ్యలో క్రీడా పతకాలు సాధించారని చెప్పారు. ఎక్కువగా పతకాలు రావడానికి కారణాలు విశ్లేషించగా దష్టి కేంద్రీకరించడం, నిధులు కేటాయించడమేనని వివరించారు. అదే తరహాలో మన రాష్ట్రంలోనూ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రపంచంలో కూడా తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించేలా చేయాలనేదే తమ లక్ష్యమన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి, సంకల్పబలమని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో వరల్డ్ క్లాసు క్రీడా మైదానాలు ఉన్నాయనీ, ఏ క్రీడలనైనా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన క్రీడలపై శివసేనారెడ్డి నివేదిక రూపొందించారని చెప్పారు. గత పాలకులు నిర్మించిన క్రీడా మైదానాలు మరమ్మతు చేసి అభివద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో గతంలో క్రీడల కోసం ఒక పిరియడ్ ఉండేదనీ, ఇకనుంచి ప్రభుత్వ, ప్రయివేటు, పాఠశాలలు అనే తేడా లేకుండా ఒక పీరియడ్ క్రీడల కోసం కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, వైస్‌చైర్మెన్ సోనీ బాలాదేవి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఏలూరు శ్రీనివాసరావు, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ పాల్గొన్నారు.

# సమాచార శాఖ మీడియా, కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా శ్రీరామ్ కర్రి

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

సమాచార, పౌరసంబంధాల శాఖ మీడియా, కమ్యూనికేషన్ల డైరెక్టర్‌గా జర్నలిస్టు, రచయిత శ్రీరామ్ కర్రిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు మంగళవారం సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ఎం. హనుమంతరావు జీవో నెంబరు 1132ను విడుదల చేశారు. శ్రీరామ్ కర్రి దక్కన్ క్రానికల్ పత్రికలో రెసిడెంట్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు ప్రభుత్వ డిజిటల్ వ్యవహారాలను అప్పగించనున్నారని తెలిసింది. అలాగే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెంట తొలి అమెరికా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే.



# సెప్టెంబర్ మొదటి వారంలో డీఎస్సీ ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ధారణకు వచ్చే అవకాశమున్నది. ఆ వెంటనే తుది కీని విడుదల చేస్తారు. అప్పుడే ప్రశ్నాపత్రాల్లో ఉండే తప్పులు, మార్కులు కలుపుతారా? లేదంటే ఆ ప్రశ్నలను తొలగిస్తారా? అన్నది విద్యాశాఖ అధికారులు ప్రకటిస్తారు. దీంతో డీఎస్సీ ఫలితాల విడుదలకు మార్గం సుగమం అవుతుంది. వచ్చేనెల మొదటి వారంలో డీఎస్సీ ఫలితాలను ప్రకటించే అవకాశమున్నది. తొలుత జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్)ను ప్రకటిస్తారు. ఆ తర్వాత రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా జిల్లాల వారీగా 1:3 నిష్పత్తి చొప్పున మెరిట్ జాబితాను విద్యాశాఖ విడుదల చేస్తుంది. ధ్రువపత్రాల పరిశీలన ముగిసిన తర్వాత 1:1 నిష్పత్తిలో జిల్లాల వారీగా ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండితులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలకు మాధ్యమాల వారీగా వేర్వేరుగా ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను ఈనెల 13న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక కీపై 28 వేల అభ్యంతరాలు వచ్చాయి. గతనెల 18 నుంచి ఈనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

**స్పోర్ట్స్ కోటాలో వంద ఉపాధ్యాయ పోస్టులు**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అన్ని జిల్లాల్లో వంద ఉపాధ్యాయ పోస్టులున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రాలను బుధవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు ఆన్‌లైన్ (స్త్రజూం:7/స్ట్రసంఎ.ఖజ్‌శీఅ-శ్రీఱఅవ.ఱఅ/స్ట్రసంఎ) ద్వారా అప్‌లోడ్ చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన క్యాడర్ పోస్టులకు అంతర్జాతీయ, మల్టీ నేషనల్ పోటీల ధ్రువపత్రాలుంటే ఫార్మ్-1, సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులకు జాతీయ పోటీల ధ్రువపత్రాలుంటే ఫార్మ్-2ను సమర్పించాలని సూచించారు. 2012, ఆగస్టు తొమ్మిదిన యువజన సర్వీసులు, పర్యాటకం, సాంస్కృతిక (స్పోర్ట్స్) జారీ చేసిన జీవోనెంబర్ 74 ప్రకారం అర్హతలుండాలనీ, వాటి ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో ధ్రువపత్రాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు స్పోర్ట్స్ కోటాకు అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని కోరారు.

# కాళేశ్వరం డిజైన్లల్లో మార్పులు జరిగాయా ?

(మొదటిపేజీ తరువాయి)

నమలడంతో చైర్మెన్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో కమిషన్ విచారణ కొనసాగింది. కమిషన్ చైర్మెన్ ఘోష్ విచారణ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు ఇంజినీర్ల నుంచి స్పందన కరువైంది. ప్రాజెక్టులో అవకతవకలపై ఆయన ప్రశ్నించారు. డిజైన్లల్లో మార్పులు, చేర్పులు ఏమైనా చేశారా ? అనే ప్రశ్నకు ఇంజినీర్లు ఒక్కోసారి ఒక్కోరకమైన సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు ఐదుగురు ఇంజినీర్ల నుంచి ఇదే రకమైన స్పందన రావడంతో ఒకింత అసహనానికి గురయ్యారు.

డిజైన్లు ఆమోదం పొందాక అన్ని నిబంధనలు పాటించారా అని ప్రశ్నించారు. హైపవర్ కమిటీ మార్గదర్శకాల ప్రకారం వెళ్లారా ? లేదా ? అని ఇంజినీర్లను అడిగారు. డిజైన్లు ఆమోదం పొందిన తర్వాత ప్రాజెక్టు ప్రాంతంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయని ప్రశ్నించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్టు కమిషన్‌కు కొంత మంది అధికారులు చెప్పారు. మేడిగడ్డ లొకేషన్ మారలేదని వివరించారు. సీడీవో-ఎల్‌అండ్‌టీ వేర్వేరుగా డిజైన్లు తయారుచేసి తుది ఆమోదం అన్నింటికీ ఒకే దగ్గర చేసినట్టు తెలిపారు. ఇదిలా వుండగా సీడీవో మాజీ ఇంజినీర్లు కమిషన్ అడిగే ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు వేయడంతోపాటు వేసిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెప్పడం గమనార్హం.

**అఫిడవిట్ సమర్పించిన వి ప్రకాష్**

జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ వి ప్రకాష్ మంగళవారం న్యాయ కమిషన్ చైర్మెన్‌ను కలిసి అఫిడవిట్ అందజేశారు. దాదాపు 18 పేజీలతో కూడిన అఫిడవిట్‌లో కాళేశ్వరానికి సంబంధించి మొత్తం వివరాలను పొందుపరిచినట్టు ప్రకాష్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వెదిర శ్రీరామ్ సీడబ్ల్యూసీ ఆయా అంశాలను వక్రీకరించారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి దగ్గర నిర్మాణం సాధ్యం కాదని చెప్పినట్టు తెలిపారు. కాగ్ అభ్యంతరాలను సైతం కమిషన్ దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. నిజమైన దోషులకు శిక్ష పడాలనేదే మా ఉద్దేశమన్నారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్లీ పిలుస్తామని కమిషన్ చెప్పిందని తెలియజేశారు.

# వాయనాడ్ పునరుజ్జీవనానికి సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల కేరళలో జరిగిన ప్రకతి విలయంపై చర్చించారు. వయనాడ్ బాధితుల పునరావాసం కోసం కేంద్ర సహాయం అందించాలని కోరారు. వాయనాడ్ పునరావాస ప్రణాళికపై సమావేశంలో చర్చిం చినట్టు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) తెలిపింది. అంతేకాక, "కేంద్రం కోరిన అదనపు, వివరణాత్మక మెమోరాండంను కూడా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది" అని సీఎంఓ పేర్కొంది.మరోవైపు పునరావాసం సహా వయనాడ్ దుర్ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కొండచరియలు విరిగిపడిన సమాచారం వెలువడినప్పటి నుంచి ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. రెస్క్యూ ఆపరేషన్లను సమర్థవంతంగా నిర్వహించింది. శిబిరాల్లో ఉన్న వారికి తాత్కాలికంగా పునరావాసం కల్పించింది. శాశ్వత వసతి ఏర్పాటు చేయడం పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో అన్ని వసతులతో కూడిన టౌన్‌షిప్‌ను సిద్ధం చేస్తామని ముఖ్యమంత్రి ఇటీవలి ప్రకటించారు. కుటుంబాలకు తగిన నష్ట పరిహారం అందించి, ఆదాయ వనరులు కల్పించడంలో కుటుంబాలకు పునరావాసం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఆగస్టు 10న వాయనాడ్‌లో పర్యటించిన ముఖ్యమంత్రి పునరావాసం, ఉపాధి, విద్య కోసం ప్రత్యేక ప్యాకేజీని అనుమతించాలని ప్రధానిని అభ్యర్థించారు. వయనాడ్ దుర్ఘటనపై గురువారం సాయంత్రం 4.30 గంటలకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో పాటు రెవెన్యూ, అటవీ, జలవనరులు, విద్యుత్తు, రవాణా, రిజిస్ట్రేషన్, ఆర్థిక, పబ్లిక్ వర్క్స్, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన సంక్షేమ శాఖ మంత్రులు, ముఖ్య కార్యదర్శులు పాల్గొంటారు.

ముఖ్యంగా, భారీ వర్షాల కారణంగా కేరళలోని వాయనాడ్‌లో భారీ కొండచరియలు విరిగిపడడంతో 308 మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. కొంత మంది తప్పిపోయారు. జులై 30న కొండచరియలు విరిగిపడిన ఘటనలో ముఖ్యంగా మెప్పాడి ప్రాంతంలోని చూరల్‌మల, ముండక్కై ప్రాంతాలలో విధ్వంసానికి దారితీసింది. తీవ్ర పరిస్థితుల దృష్ట్యా ఎన్‌డీఆర్ఎఫ్‌తో పాటు ఆర్మీ వైమానిక దళం, స్థానిక కేరళ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్‌లో వెయ్యి మందికిపైగా ప్రాణాలను రక్షించారు. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో తప్పిపోయిన వ్యక్తులను రికవరీ అవకాశాల ఆధారంగా ప్రభావిత ప్రాంతాలను ఆరు జోన్‌లుగా విభజించారు. అవి జోన్ 1 -పుంఛిరిమట్టం ప్రాంతం, జోన్ 2 - ముండెక్కై ప్రాంతం, జోన్ 3 - స్కూల్ ప్రాంతం, జోన్ 4 - చూరల్‌మల పట్టణ ప్రాంతం, జోన్ 5 - గ్రామ ప్రాంతం, జోన్ 6 - దిగువ ప్రాంతంగా విభజించారు.

# 17 నుంచి ప్రజా పాలన

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు, వైద్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్యం పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేస్తామని సీఎం హెచ్చరించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై రైతుల రణం

(మొదటిపేజీ తరువాయి)

చేయలేదన్నారు. ఖమ్మం జిల్లాలో 3.71 లక్షల మంది రైతులుంటే 1.15 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులకు 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. పహాణీలు, పాస్‌బుక్‌ల మీద తీసుకుని ఇప్పుడు పాస్‌బుక్‌లు లేని వారి రుణాలు కూడా మాఫీ చేయాలని కోరారు. రైతుబంధు నేరుగా రైతుల ఖాతాలో జమవుతున్నప్పుడు రుణమాఫీకి సాంకేతిక సమస్యలను చూపడం సరికాదని సూచించారు. రుణమాఫీ కాక కొందరు, రుణమాఫీ అయినా కొత్త రుణాలు మంజూరు కాక మరికొందరు వ్యవసాయక్షేత్రాలను వదిలి బ్యాంకు లు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా షరతులు లేకుండా ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

**రూ.2 లక్షణల పైనున్న రుణాలకు ప్రత్యేక షెడ్యూల్ : మంత్రి తుమ్మల**

గత పదేండ్లలో జరిగిన రుణమాఫీని కాగ్ తప్పుబడుతూ నివేదిక ఇచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అటువంటి తప్పులు తిరిగి చోటుచేసుకోకుండా జాగ్రత్త పడుతున్నామన్నారు. రైతుల ఇండ్ల వద్దకు వచ్చి వ్యవసాయశాఖ అధికారులు యాప్‌లో రిపోర్టు చేస్తారన్నారు. రూ.2లక్షల లోపుంటే రుణమాఫీ వర్తించేలా చూస్తామని పునరుద్ఘాటించారు. తెల్లకార్డు లేకుండా కుటుంబ నిర్ధారణ కాకుండా ఉన్న రైతుల రుణాలు కూడా మాఫీ చేస్తామన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. కానీ రూ.2లక్షలకు పైన ఎంతుంటే అంత చెల్లించాలని, రూ.2.50 లక్షలు కట్టి రూ.3లక్షలు తీసుకున్నా లోన్ ఇస్తామన్నారు. రూ.2 లక్షలకు పైబడిన రుణాన్ని చెల్లించేందుకు క్యాబినెట్‌లో చర్చించి ప్రత్యేకంగా షెడ్యూల్ విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. తప్పకుండా రాష్ట్రంలో అర్హులుగా గుర్తించిన 42 లక్షల మంది రైతులకు చెందిన రూ.31 కోట్ల రుణాలను మాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు ఎండీ మౌలానా, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, దుగ్గి కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కే మీరా, భూక్యా లక్ష్మా, భూక్యా వీరభద్రం, మడుపల్లి గోపాలరావు, రామ్మూర్తి, మేకల శ్రీనివాసరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ఊరడి సుదర్శన్‌రెడ్డి, గొడవర్తి నాగేశ్వరరావు, మల్లెంపాటి రామారావు, శీలం సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.నారాయణ పేట జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ దగ్గర రైతులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం నారాయణపేట మండల తహసీల్దార్ అమరేందర్ కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైతు వేదిక వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందచేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా పరిపాలనాధికారి జగన్‌మోహన్, జిల్లా వ్యవసాయాధికారి నీలిమకు వినతిపత్రాలు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

# నవచిత్రం


## యాక్షన్ మూడ్‌కి ప్రేక్షకులు ఫిదా అవుతారు


నాని

"సరిపోదా శనివారం' ట్రైలర్‌లో ఏదైతే చూపించామో అది నన్ను బాగా ఎగ్జైట్ చేసింది. ఐడియాని ట్రైలర్‌లో చెప్పాం. ఆ ఐడియాని ఎలా ఎగ్జిక్యూట్ చేశామనేది తెలియాలంటే సినిమాని చూడాల్సిందే' అని అంటున్నారు కథానాయకుడు నాని. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో నాని మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం..

- ఇది చాలా మంచి కథ. అడ్రినలిన్ పంపింగ్ మూమెంట్స్ ఉంటాయి. కథ ప్రకారం ఆ అడ్రినలిన్ పంపింగ్‌ని వందశాతానికి తీసుకెళ్ళాం. సినిమా చాలా ఆర్గానిక్‌గా కుదిరింది. థియేటర్స్‌లో ఆడియన్స్ చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. టైటిల్‌లో శనివారమే అని పెట్టడానికి అదిరిపోయే ఎమోషనల్ రీజన్ ఉంది. నా ఫేవరేట్ మూమెంట్ అది. సినిమా స్టార్ట్ అయ్యే ఐదు నిమిషాలకి వస్తుంది.
- అలాగే ఇందులో సోకులపాలెం కీ ఎలిలెంట్‌గా ఉంటుంది. ఈ కథలో సోకులపాలెం ఒక ఎంటిటి. బ్యాక్‌గ్రౌండ్ అండర్‌లైన్ ఎమోషన్. సూర్య, దయ, చారులత పాత్రల మధ్య జరిగే కథ, ఆ కథకు ఎమోషన్‌ని యాడ్ చేసేదే సోకులపాలెం. సూర్య, దయ, చారులత పాత్రలకు నేను, ఎస్.జె.సూర్య ప్రియాంక నూటికి నూరు శాతం న్యాయం చేశామని భావిస్తున్నాం. ఇందులో 20% యాక్షన్, 80 % యాక్షన్ మూడ్ ఉంటుంది. ఈ యాక్షన్ మూడ్‌ని ఆడియన్స్ చాలా బాగా ఎంజాయ్ చేస్తారు.
- ఎస్‌జే సూర్యతో కలసి పెర్ఫార్మ్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. ఆయనకు పాత్ర పట్ల చాలా అండర్‌స్టాండింగ్ ఉంటుంది. దయా రోల్‌కి ఆయన తప్పితే మరో ఛాయిస్ లేదు. దాదాపు ఏడు రోజులు డబ్బింగ్ చెప్పారు. అద్భుతంగా వచ్చింది. తన డబ్బింగ్ కోసం సినిమాని మళ్ళీ మళ్ళీ చూస్తారు.
- ఇది చాలా రేసీ ఫిలిం. నెరేటివ్ కూడా రేసీగా ఉంటుంది. సినిమా పరిగెడుతుంటుంది. ఇలాంటి పరిగెడుతున్న సినిమాకి జేక్స్ ఏం స్కోర్ చేస్తాడనే ఒక క్యూరియాసిటీ ఉండేది. నిన్న వెళ్లి ఆర్‌ఆర్ చూశా. బేసిగ్గా సినిమాల్లో హీరోకి ఇంట్రో సాంగ్ ఉంటుంది. తర్వాత మేలోడీలు, ఎమోషనల్ సాంగ్స్ వస్తాయి. అందులో బిట్స్‌ని ఆర్‌ఆర్‌గా పంప్ చేస్తుంటారు. కానీ జేక్స్.. మొత్తం సినిమాని హీరో ఇంట్రో సాంగ్‌లా కొట్టాడు. తన మ్యాజిక్‌ని ఈనెల 29న చూస్తారు. ఈ సినిమాలోని మ్యూజిక్‌ని చాలా ఫ్రెష్‌గా ఫీల్ అవుతారు.
- వివేక్ ఆత్రేయ టెర్రిఫిక్ డైరెక్టర్. 'అంటే సుందరానికి' వచ్చిన రిజల్ట్‌ని పట్టించుకోకుండా ఈసినిమా చేయమని ఓ బ్రదర్‌గా తనకి అండగా నిలబడ్డా. సినిమాకి ఏం కావాలో మా నిర్మాత దానయ్య అన్ని సమకూర్చారు.

## దసరా కానుకగా రిలీజ్


సుధీర్‌బాబు

హీరో సుధీర్ బాబు తాజాగా నటిస్తున్న చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో'. 'లూజర్' సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై, సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీ గురించి మేకర్స్ మంగళవారం ఓ ప్రకటన చేశారు. దసరా పండుగ సందర్భంగా ఈ సినిమాని విడుదల చేస్తున్నారు. ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలుసుకుంటూ సోల్‌ని కదిలించే జర్నీని ప్రారంభించిన ఫాదర్ అండ్ సన్ డ్రామానే ఈసినిమా అని చిత్ర యూనిట్ తెలిపింది. సుధీర్‌బాబు సరసన ఆర్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో సాయిచంద్, షాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## తండ్రీ కొడుకులుగా ..?


ఎన్టీఆర్

ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరి కృష్ణ.కె నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కి జోడీగా బాలీవుడ్ నాయిక జాన్వీకపూర్ నటిస్తుండగా, మరో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'దేవర'ను రెండు భాగాలుగా రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో 'దేవర: పార్ట్ 1'ను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న రిలీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రిలీజ్ డేట్ ఇక కేవలం 30 రోజులు మాత్రమే ఉందని గుర్తు చేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫియర్ ఆఫ్ ఫేసెస్ పోస్టర్‌లో రెండు భిన్నలుక్స్‌తో ఎన్టీఆర్ సర్‌ప్రైజ్ చేశారు. అంతే కాదు ఈ సినిమాలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారా? అనే సందేహానికి కూడా తెర తీశారు. ఆ సందేహం కరెక్టో కాదో తెలియాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే.

## పిల్లలు వద్దనుకునే హీరో కథ..



సుహాస్, సంగీర్తన హీరో, హీరోయిన్లుగా దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. సెప్టెంబర్ 7న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సుహాస్‌కు పెళ్లైనప్పటికీ పిల్లలు వద్దని అనుకుంటూ ఉంటాడు. అందుకు కారణం ఏంటి? అనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.

ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, 'మధ్య తరగతి తండ్రికి ఉండే కష్టాలను అందరం చూసే ఉంటాం. డైరెక్టర్ సందీప్ తన రియల్ లైఫ్‌లో చూసిన ఇన్సిడెన్స్‌ను బేస్ చేసుకుని కథను తయారు చేశారు. దీన్ని హ్యూమరస్‌గా, మంచి కాన్సెప్ట్‌తో సినిమా చేశారు. సినిమా చూశాను. చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమాను మీరు చూడబోతున్నారనే నమ్మకంతో ఉన్నాం' అని చెప్పారు.

## ఫ్యామిలీ మొత్తం చూసేలా..


రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్

రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా రవికిరణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎస్‌వి కిరణ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. జె.శివసాయి వర్ధన్ డైరెక్టర్. దర్శకుడు మారుతి ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా సెప్టెంబర్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ, 'ఇది పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఫ్యామిలీ అంతా కలసి చూసేలా ఈ సినిమా తీశాం. బ్యూటీఫుల్ ఎంటర్‌టైనర్. చాలా మంచి ఎమోషన్స్ ఉంటాయి. దర్శకుడు శివసాయి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు' అని అన్నారు. 'ఇది నా ఫస్ట్ మూవీ. ఇందులో రొమాన్స్, కామెడీ ఉంది. మీ అందరికీ నచ్చుతుంది' అని హీరోయిన్ మనీషా కంద్కూర్ చెప్పారు. డైరెక్టర్ శివసాయి వర్ధన్ మాట్లాడుతూ,'మంచి హెల్దీ కామెడీ ఉన్న చిత్రమిది. అలాగే రొటీన్‌కి భిన్నంగా ఉండే సినిమా కూడా' అని తెలిపారు. 'ఇది మా ఫస్ట్ సినిమా. చాలా మంచి సినిమా తీశామనే నమ్మకం ఉంది. సినిమా చాలా బావుంటుంది' అని నిర్మాత కిరణ్ కుమార్ చెప్పారు.

## భిన్న కథతో ఈసారైనా..?!


అశ్విని అయలూరు

విప్లవ్ దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'ఈసారైనా..?!'. ఈ సినిమాలోని మొదటి పాట ఇటీవల విడుదలైంది. యూట్యూబ్‌తోపాటు అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫార్మ్‌లో సంగీత ప్రియులను విశేషంగా అలరిస్తోంది.

అద్భుతంగా రాసిన రాకేందు మౌళి సాహిత్యం, వినసొంపైన అర్జున్ విజయ్ గానంతో ఈ ట్రాక్ యువత నోట ప్రతిధ్వనిస్తోంది. పాటలోని ఎమోషన్‌ని పండించేలా సంగీత దర్శకుడు తేజ్ అద్భుతమైన సంగీతం అందించారు. అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. ఓ నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ, అదేవిధంగా అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఈ సినిమా సాగుతుంది.

అశ్విని అయలూరు ప్రధాన నటిగా నటించిన ఈ చిత్రం ఈ జనరేషన్‌కి తగినట్టుగా అన్ని ఎమోషన్స్‌ను అందించే ఒక ప్రామిసింగ్ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: సంకీర్త్ కొండా, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే- దర్శకత్వం: విప్లవ్, డి ఓ పి: గిరి, ఎడిటింగ్: విప్లవ్, కళ: దండు సందీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అభినయ్ కొండ, లైన్ ప్రొడ్యూసర్: పూర్ణిమ రెడ్డి.

## రంగంలోకి దిగిన నిధి


ఫరియా అబ్దులా

శ్రీ సింహ కోడూరి, సత్య లీడ్ రోల్స్‌లో రితేష్ రానా దర్శకత్వంలో వచ్చిన సెన్సేషనల్ హిట్ మూవీ 'మత్తు వదలరా'.

ఇప్పుడు అదే టీమ్ దీనికి సీక్వెల్‌గా 'మత్తు వదలారా 2' తో ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్రలో కనిపించనున్నారు. మంగళవారం ఫరియా అబ్దుల్లా ఫస్ట్ లుక్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, వెన్నెల కిషోర్, అజయ్, రోహిణి, రాజా చెంబోలు, ఝాన్సీ, శ్రీనివాస్ రెడ్డి, గుండు సుదర్శన్ ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. సెప్టెంబర్ 13న ఈ చిత్రాన్ని భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రానికి సంగీతం : కాల భైరవ, సినిమాటోగ్రఫీ : సురేష్ సారంగం, ఎడిటింగ్ : కార్తీక శ్రీనివాస్ ఆర్.

# ఆటలు

# పారా ప్రపంచం

- ఆరంభ వేడుకలకు పారిస్ ముస్తాబు

**నేటి నుంచి 2024 పారాలింపిక్స్**



**లక్ష్య సాధనకు వైకల్యం అడ్డు కాదు అంటూ నిరూపించే పారా వీరులు పారిస్ పారాలింపిక్స్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. 2024 పారిస్ పారాలింపిక్స్ నేటి నుంచి ఆరంభం కానున్నాయి. పారిస్ నగరం ఆరంభ వేడుకలకు ముస్తాబు కాగా.. సమ్మర్ ఒలింపిక్స్ తరహాలోనే భారీ స్థాయిలో ఓపెనింగ్ సెర్మానీకి ప్రణాళికలు రచించారు. 167 దేశాల నుంచి పారా అథ్లెట్లు పోటీపడుతున్న మెగా ఈవెంట్ సెప్టెంబర్ 9న ముగియనుంది.**

నవతెలంగాణ-పారిస్

ప్రపంచ వ్యాప్తంగా వైకల్యాన్ని ఎదురించి నిలిచిన పారా అథ్లెట్లు పారిస్ వేదికగా పతక వేటలో పోటీ పడేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పారిస్ నగరం తొలిసారి సమ్మర్ పారాలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుండగా.. 167 దేశాల నుంచి పారా అథ్లెట్లు పోటీ పడనున్నారు. పారాలింపిక్స్ ఆరంభ వేడుకలు భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 11.30 గంటలకు ఆరంభం కానున్నాయి. సెప్టెంబర్ 9న ముగింపు వేడుకలు జరుగుతాయి. ఆరంభ వేడుకల అథ్లెట్ పరేడ్‌లో భారత పతాకధారులుగా జావెలిన్ త్రో స్టార్ సుమిత్, షాట్‌పుట్ స్టార్ భాగ్యశ్రీ జాదవ్ వ్యవహరించనున్నారు.

**22 స్పోర్ట్స్, 549 ఈవెంట్లు :**



2024 పారాలింపిక్స్‌లో పారా క్రీడాకారులు 22 క్రీడాంశాల్లో 549 పతక ఈవెంట్లలో పోటీపడనున్నారు. 2024 పారిస్ పారాలింపిక్స్‌లో కొత్తగా మూడు క్రీడలను చేర్చారు. పారా సైక్లింగ్, పారా జూడో, పారా రోయింగ్‌లు తొలిసారి పారాలింపిక్స్‌లో భాగం అయ్యాయి. ఈ మూడు కొత్త క్రీడల్లో భారత్ నుంచి పారా అథ్లెట్లు పోటీపడుతున్నారు. 167 దేశాల నుంచి పారా క్రీడాకారులు పారిస్‌లో పోటీపడుతుండగా.. రష్యా, బెలారస్ పారా అథ్లెట్లు తటస్థ జెండా కింద పోటీపడనున్నారు. శరణార్థుల జట్టు సైతం పారాలింపిక్స్ బరిలోకి నిలిచింది.

**50కి పైగా స్పోర్ట్స్ విభాగాలు! :**

పారాలింపిక్స్‌లో పారా అథ్లెట్లు అందరూ ఒకే విభాగంలో పోటీపడలేరు. శారీరక వైకల్యం, ఫిజికల్ యాక్టీవిటీ ఆధారంగా పారా అథ్లెట్లను పలు విభాగాలుగా విభజిస్తారు. శారీరక వైకల్యం, కంటిచూపు లోపం, ఇంటలెక్చువల్ వైకల్యం విభాగాల్లో వైకల్యం శాతం ఆధారంగా విభాగాలను నిర్ణయిస్తారు. పారా పవర్‌లిఫ్టింగ్ వంటి కొన్ని క్రీడల్లో మినహా మిగతా అన్ని క్రీడాంశాల్లోనూ స్పోర్ట్స్ క్లాస్‌లు ఉంటాయి. పారా అథ్లెటిక్స్‌లో కొన్ని విభాగాల్లో ఏకంగా 50కి పైగా స్పోర్ట్స్ క్లాస్‌లు ఉంటాయి.

**భారత్ నుంచి జంబో జట్టు :**

టోక్యో పారాలింపిక్స్‌లో టీమ్ ఇండియా సూపర్ సక్సెస్ చవిచూసింది. ఏకంగా 19 పతకాలతో సత్తా చాటింది. పారిస్ పారాలింపిక్స్‌లోనూ భారత్ పతకాలపై భారీగా ఆశలు పెట్టుకుంది. పారిస్‌లో 84 మంది భారత పారా అథ్లెట్లు పోటీపడుతున్నారు. పారాలింపిక్స్‌లో భారత్ నుంచి ఇదే అతిపెద్ద ప్రాతినిథ్యం!. భారత పారా అథ్లెట్లలో సీజనల్ స్టార్స్‌తో పాటు కొత్త ముఖాలు సైతం పతక వేటలో ముందంజలో ఉన్నారు. సుమిత్ అంతిల్ (జావెలిన్ త్రో), అవని లేఖర (షూటింగ్), మనీశ్ నర్వాల్ (షూటింగ్), కృష్ణ నగర్ (బ్యాడ్మింటన్), శీతల్ దేవి (ఆర్చరీ) బంగారు పతక రేసులో నిలిచారు. టోక్యో పారాలింపిక్స్ పసిడి విజేత ప్రమోద్ భగత్ డోపింగ్ సంబంధిత కారణాలతో పారిస్ పారాలింపిక్స్‌కు దూరమయ్యాడు.

## హర్మన్‌ప్రీత్ సారథ్యంలోనే..

### టీ20 ప్రపంచకప్ భారత జట్టు ఎంపిక



**ముంబయి :** భారత్ మరోసారి హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోనే పొట్టి ప్రపంచకప్ వేట సాగించనుంది. అక్టోబర్ 3 నుంచి యుఏఈలో జరుగనున్న మహిళల ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో పోటీపడే భారత జట్టును బీసీసీఐ మహిళల సీనియర్ సెలక్షన్ కమిటీ మంగళవారం ఎంపిక చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, స్మృతీ మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. 15 మందితో కూడిన జట్టుతో పాటు ముగ్గురు రిజర్వ్ ప్లేయర్లను సైతం ఎంపిక చేశారు. మహిళల ఐసీసీ టీ20 ప్రపంచకప్ గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక ఉండగా.. గ్రూప్-బీలో బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, స్కాట్లాండ్ చోటుచేసుకున్నాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు నాలుగు మ్యాచులు ఆడుతుంది. టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి.

**భారత మహిళల జట్టు :** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతీ మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా రొడ్రిగస్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), పూజ వస్త్రాకర్, అరుంధతి రెడి, రేణుక సింగ్ ఠాకూర్, హేమలత, ఆశ శోభన, రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్, సజీవన్. (ట్రావెలింగ్ రిజర్వ్ : ఉమా, తనూజ, సైమా)

## కేజ్రీవాల్ కస్టడీ 3కి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం స్కాంలో సీబీఐ నమోదు చేసిన కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి ఊరట దక్కలేదు. మంగళవారం ఆయన కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా సెప్టెంబర్ 3 వరకు పొడిగించారు. ఇంతకుముందు విధించిన కస్టడీ గడువు నేటితో ముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు. సీబీఐ దాఖలు చేసిన నాలుగో చార్జిషీటుపై నిర్ణయాన్ని కూడా రౌస్ అవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ చార్జిషీటులో కేజ్రీవాల్, మరో ఐదుగురి పేర్లను సీబీఐ చేర్చింది. సెప్టెంబర్ 3న దీనిపై కోర్టు విచారణ జరపనుంది. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. కాగా, ఎక్సైజ్ స్కాం కేసులో బెయిల్ కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సెప్టెంబర్ 5న సుప్రీంకోర్టు ముందుకు రానుంది. అఫిడవిట్ సమర్పించేందుకు మరింత గడువు కావాలని సీబీఐ కోరడంతో అత్యున్నత న్యాయస్థానం గత విచారణలో సెప్టెంబర్ 5కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. కేజ్రీవాల్ తనకు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఒక పిటిషన్, సీబీఐ అరెస్టుకు వ్యతిరేకంగా మరో పిటిషన్ వేశారు.

అయితే సీబీఐ తమ సమగ్ర అఫిడవిట్‌లో ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ కేజ్రీవాల్ డైరెక్షన్‌లో నాటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో కలిసి తీసుకున్నవేనని సీబీఐ ఆరోపణగా ఉంది. అయితే ఈ ఆరోపణలను ఆప్ తోసిపుచ్చుతూ కేజ్రీవాల్‌ను జైలులోనే ఉంచేందుకు బీజేపీ, సీబీఐ కుట్రపన్నుతున్నాయని చెబుతోంది.

## ఐసీసీ చైర్మన్‌గా జై షా

- ఏకగ్రీవంగా ఎన్నికైన అమిత్ షా తనయుడు



**దుబాయ్ :** బీసీసీఐ కార్యదర్శి, కేంద్ర మంత్రి అమిత్ షా తనయుడు జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఏడాది డిసెంబర్ 1న ఐసీసీ చైర్మన్‌గా జై షా పదవీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ మేరకు ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్క్లే మూడోసారి పోటీచేసేందుకు ఆసక్తి చూపించలేదు. చైర్మన్ పదవికి జై షా మినహా మరొకరు నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో జై షా ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2019 అక్టోబర్‌లో బీసీసీఐ కార్యదర్శి బాధ్యతలు తీసుకున్న జై షా.. 2021 జనవరి నుంచి ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. బీసీసీఐ కార్యదర్శిగా జై షా పదవీ కాలం 2025 వరకు ఉన్నప్పటికీ... ఐసీసీ చైర్మన్‌గా వెళ్లనున్నారు. జైషాకు జగన్ అభినందనలు : ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షాకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు. జై షా నాయకత్వంలో ప్రపంచ క్రికెట్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

## జీ-సోనీ సంస్థల రాజీ

- రెండింటి మధ్య ఏకాభిప్రాయం
- కేసుల ఉపసంహరణ



**న్యూఢిల్లీ :** దిగ్గజ మీడియా సంస్థలు జీ-సోనీ సంస్థలు ఎట్టకేలకు రాజీ కుదర్చుకున్నాయి. ఇరు సంస్థల మధ్య నెలకొన్న వివాదం సమిసిపోయింది. జీ-సోనీ మధ్య విలీన ఒప్పందం రద్దు అయిన తర్వాత అనేక వివాదాలు నెలకొన్నాయి. ఒప్పంద రద్దు అనంతరం పరస్పరం పెట్టుకున్న కేసులను ఉపసంహరించుకునేందుకు ఓ నిర్ణయానికి వచ్చినట్లు మంగళవారం ఇరు సంస్థలు వెల్లడించాయి. నష్టపరిహారం కోసం న్యాయ పోరాటాలు చేయాలని రంగంలోకి దిగాయి. సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌తో పాటు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, ఇతర ఫోరమ్స్‌లో పరస్పరం దాఖలు చేసుకున్న న్యాయ పోరాటాలకు ముగింపు పలకాలని అంగీకారానికి వచ్చాయి. ఎవరికి వారు మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో సొంతంగా రాణించడంపై దృష్టి సారించాలని భావించాయి. 2023 ఆగస్టు 10న ఈ రెండు సంస్థలు విలీన ప్రతిపాదనలు చేసుకున్నాయి. జీ ఎంటర్‌టైన్మెంట్‌తో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్మెంట్) 10 బిలియన్ డాలర్లు (రూ.83 వేల కోట్లు) విలీన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ తర్వాత ఇరు సంస్థల మధ్య అభ్యంతరాలు రావడంతో వివాదాలు నెలకొన్నాయి. తాజాగా సమసి పోవడంతో మంగళవారం జీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ షేర్లు ఒక దశలో ఏకంగా 14 శాతం పెరిగాయి. చివరకు 11.56 శాతం లాభంతో ముగిశాయి.

## రీజినల్ మార్కెట్లోకి కొత్త జుపిటర్ 110



**హైదరాబాద్ :** ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ టివిఎస్ మోటార్ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన జుపిటర్ 110ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దీన్ని టివిఎస్ మోటార్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిరుద్ధ హల్దార్ ఆవిష్కరించారు. హైదరాబాద్ ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.77,100గా నిర్ణయించింది. డ్రమ్, డ్రమ్ అలాయ్, డ్రమ్ ఎస్ఎక్స్‌సీ, డిస్క్ ఎస్ఎక్స్‌సి తదితర నాలుగు వేరియంట్లలో లభిస్తోందన్నారు. సీటు కింద రెండు హెల్మెట్లు పెట్టుకునేంత స్టోరేజీ ఇచ్చారు. ఒక్కసారిగా బ్రేక్ వేసినప్పుడు వెనక నుంచి వచ్చేవారిని అప్రమత్తం చేసేలా ఎమర్జెన్సీ బ్రేక్ వార్నింగ్ వ్యవస్థను ఇందులో ఏర్పాటు చేశారు.

## భారత్ బయోటెక్ నుంచి ఓరల్ కలరా వ్యాక్సిన్

- హిల్‌కాల్ ఆవిష్కరణ



**హైదరాబాద్ :** ప్రముఖ వ్యాక్సిన్ల తయారీ కంపెనీ భారత్ బయోటెక్ కొత్తగా కలరా వ్యాక్సిన్‌ను విడుదల చేసింది. దీనిని సింగపూర్‌కు చెందిన హిల్‌మాన్ లేబొరేటరీస్ బిబివి131 వ్యాక్సిన్ పేరుతో అభివృద్ధి చేసిందని భారత్ బయోటెక్ వెల్లడించింది. భారత్‌లో దీన్ని తయారు చేయడానికి లైసెన్స్‌ను పొందినట్లు భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ క్రిష్ణ ఎల్లా తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ హెల్త్‌కు హిల్‌కాల్ దోహదం చేయనుందన్నారు. కలరా అనేది నివారించదగినది. అయినప్పటికీ 2021 నుంచి ఈ వ్యాధి వల్ల మరణిస్తున్న వారి సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. 2023 ప్రారంభం నుంచి 2024 మార్చి వరకు 31 దేశాల్లో 8,24,479 కేసులు నమోదయ్యాయి. ఇందులో సుమారు 5,900 మంది మరణించారు. ఈ మరణాల సంఖ్యను తగ్గించడానికి భారత్ బయోటెక్ ఓరల్ కలరా వ్యాక్సిన్ తీసుకొచ్చింది. భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను 200 మిలియన్ డోస్‌ల వరకు ఉత్పత్తి చేయడానికి హైదరాబాద్, భువనేశ్వర్‌లలో పెద్ద ఎత్తున తయారీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసింది. 2030 నాటికి కలరా సంబంధిత మరణాల సంఖ్య 90 శాతం తగ్గించాలనేది ప్రధాన లక్ష్యమని కృష్ణ ఎల్లా తెలిపారు.

## 29న రిలయన్స్ ఏజీఎం

**న్యూఢిల్లీ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ 47వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం) ఆగస్టు 29న జరగనుంది. ఇందులో ఆ సంస్థ ఛైర్మన్ ముకేష్ అంబానీ పలు కీలక ప్రకటనలు చేయనున్నారని అంచనాలు వెలుపడుతున్నాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే భేటీలో రిలయన్స్ జియో ఫైనాన్షియల్ లిస్టింగ్ గురించి మాట్లాడే అవకాశం ఉందని సమాచారం. అంతే కాకుండా వారసత్వ ప్రణాళికలు కూడా వెల్లడించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

## యెస్ బ్యాంక్ డిపాజిట్లలో 21 శాతం వృద్ధి

**ముంబయి :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 20.9 శాతం వృద్ధితో రూ.2,69,072 కోట్ల డిపాజిట్లకు చేరినట్లు యెస్ బ్యాంక్ వెల్లడించింది. ఏడాదికేడాదితో పోల్చితే ఈ విభాగంలో మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు ఆ బ్యాంక్ పేర్కొంది. రుణాలకు డిమాండ్ పెరుగుతూ.. డిపాజిట్లు తగ్గుతున్న వేళ బ్యాంక్‌లు సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ యెస్ బ్యాంక్ సమతూల్యంగా రాణిస్తుందని పేర్కొంది. కరెంట్ ఎకౌంట్, సేవింగ్ ఎకౌంట్స్‌ల్లోనూ 30.8 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది.

## సెప్టెంబర్ 5,6న గ్లోబల్ ఎఐ సమ్మిట్

- హైసియా వెల్లడి



**హైదరాబాద్ :** సెప్టెంబర్ 5, 6 తేదీల్లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గ్లోబల్ ఏఐ సదస్సును నిర్వహించనున్నట్లు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లో దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటి శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. "తెలంగాణ గ్లోబల్ ఏఐ సమిట్ 2024 గురించి పరిచయం చేయడానికి నేనెంతో ఉద్వేగంతో ఉన్నాను. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ ఏఐ రాజధానిగా నిలబెట్టే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నాం." అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, ఐటిఇ అండ్ ఈ శాఖ సిఆర్ అమర్‌నాథ్ రెడ్డి, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఐటిఇ అండ్ ఈ శాఖ ఓఎస్‌డీ ఎల్.రమాదేవి, టి-హబ్ సిఇఒ మహంకాళి శ్రీనివాసరావు, టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా, మాత్ సిఇఒ రాహుల్ పైత్, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెళ్ల తదితరులు పాల్గొన్నారు.

## డజల్ స్పోర్ట్స్ నుంచి 'డజల్ ప్రైమ్' ఉత్పత్తులు

DAZZLE® Sports Wear

**హైదరాబాద్ :** డజల్ స్పోర్ట్స్ వేర్ కొత్తగా డజల్ ప్రైమ్ పేరుతో ప్రీమియం సెగ్మెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. తెలంగాణకు చెందిన తొలి స్పోర్ట్స్‌వేర్ సంస్థ దేశ వ్యాప్త విస్తరణపై దృష్టి పెట్టింది. నాణ్యమైన దుస్తులు సరసమైన ధరల్లో అనే నేపథ్యంతో కొత్త కలెక్షన్ ఆవిష్కరించినట్లు ఆ సంస్థ ఎండి పి వేంకటేశ్వర్ రావు తెలిపారు. చిన్నగా స్థాపించబడిన తమ సంస్థ ఇప్పుడు రూ.100కోట్ల టర్నోవర్‌కు చేరిందన్నారు. కంపెనీలోని 1500 మంది శ్రామిక శక్తిలో 95 శాతం మహిళలే అని తెలిపారు. 15000 మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# సాధికారతతో లింగ సమానత్వం

**నాయకత్వ స్థానాన్ని చేపట్టాలి**

- కృషి, పట్టుదల, ఐక్యతే విజయానికి సోపానాలు
- నారీమణులకు చేయూత అందిస్తున్న పలు వేదికలు



**న్యూఢిల్లీ :** లింగ అసమానతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా వేతనాల విషయంలో పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటోంది. లింగ సమానత్వం కోసం ఎన్ని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు ( ఎల్ఎఫ్‌పీఆర్) కేవలం యాభై శాతం పైనే ఉంది. అదే పురుషుల విషయానికి వస్తే 80 శాతం ఉంది. 1990వ దశకంలో వేతన వ్యత్యాసం 48 శాతం ఉండేది. అది 2019 నాటికి 28 శాతానికి తగ్గింది. కానీ అసలైన లింగ సమానత్వానికి అడ్డంకులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించడం ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**మహిళలపై గృహ, లైంగిక హింస**

లింగ సమానత్వానికి ఆర్థిక సాధికారత కీలకమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మహిళలు తమ జీవన స్థితిగతులను మెరుగుపరచుకోవాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం కలిగి ఉండాలన్న విషయంలో సందేహమే లేదు. మహిళలు నాయకత్వ స్థానాల్లోకి ఎదిగి సామాజిక మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశంలో ఇది చాలా అవసరం. ఎందుకంటే 18-48 సంవత్సరాల మధ్య వయసున్న వివాహిత భారతీయ మహిళల్లో 29.3 శాతం మంది గృహ, లైంగిక హింసకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగాలు చేసే మహిళల్లో ఈ రేటు మరింత ఎక్కువగా ఉంది.

**కొనసాగుతున్న పురుషాధిక్యత**

అయితే కేవలం ఆర్థిక సాధికారత వల్లనే సమస్యలన్నీ మటుమాయం కావు. మహిళలు తమ ప్రాధాన్యతను తెలుసుకొని, నాయకత్వ స్థానాల్లో ఎదగాల్సి ఉంటుంది. మహిళలు వారసత్వ పరంగానే నాయకులు. కుటుంబ అవసరాలను వారు అర్థం చేసుకోగలరు. కుటుంబానికి మద్దతు ఇవ్వగలరు. కుటుంబ సభ్యుల బాగోగులు చూడగలరు. మహిళల్లోని నాయకత్వ నైపుణ్యాన్ని గుర్తించి, వారు సమర్థవంతంగా పనిచేసేలా సాయపడితే చాలు. కానీ చాలా సమాజాల్లో పురుషాధిక్యతే కొనసాగుతోంది. భర్తను బట్టే భార్యకు సమాజంలో గుర్తింపు వస్తోంది. ఒకరి భార్యగానో, కుమార్తెగానో, సోదరిగానో లేదా తల్లిగానో చూస్తున్నారే తప్ప ఆమె స్వయంగా సాధించిన విజయాలను గుర్తించడం లేదు. ఉదాహరణకు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన మహిళపై ఆమె భర్త ప్రభావం తప్పనిసరిగా ఉంటోంది. మన దేశంలో 'సర్పంచ్ భర్త' అనే నానుడి ఎక్కువగా విన్పిస్తుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు తమ గుర్తింపును కాపాడుకుంటూ స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టమవుతుంది.

**అది ఓ మాలతి కథ**

మాలతి సింగ్ అనే మహిళ గురించి తెలుసుకుంటే సవాళ్లతో కూడిన సమాజంలో అతివల భాగస్వామ్యానికి ఉన్న ప్రాధాన్యత అర్థమవుతుంది. భూమిజ్ గిరిజన తెగలో జన్మించిన మాలతి జీవితం ఆది నుండీ కష్టాలతోనే సాగింది. తండ్రి మద్యానికి బానిస కావడం, ఇల్లు గడవడం కష్టంగా మారడంతో ఆమె పదిహేను సంవత్సరాల వయసులో వివాహం చేసుకోవాల్సి వచ్చింది. అయితే అత్తింటిలోనూ కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. భర్త, అత్త కూడా మద్యానికి బానిసలే. అయినా మాలతి కుంగిపోలేదు. పిల్లల కోసం ధైర్యాన్ని కూడగట్టుకుంది. స్వశక్తితో నాయకురాలిగా ఎదిగింది. తన తెగలో మద్యానికి వ్యతిరేకంగా పోరాడేందుకు స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసింది. ఆమె ప్రయత్నాల ఫలితంగా అక్రమంగా నడుస్తున్న ఎనిమిది మద్యం దుకాణాలు మూతపడ్డాయి. అయితే మాలతి పోరాటంలో విషాదం చోటుచేసుకుంది. మాలతిపై ప్రతీకారంతో మద్యం మాఫియా ఆమె భర్తకు విషం పెట్టి చంపేసింది. అయినా మాలతిలో పోరాట పటిమ తగ్గలేదు. ఓ వైపు దుఃఖాన్ని దిగమింగుకుంటూనే మరోవైపు న్యాయ పోరాటం చేసింది. హంతకులకు శిక్ష పడేలా చేసింది. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగితే సమాజాన్నే మార్చేయవచ్చునని మాలతి జీవిత కథ నిరూపించింది.

**ఇది ఓ గ్రామం కథ**

ఒడిషాలోని తరి గ్రామంలో ఓ మహిళ కథ ఉమ్మడి నాయకత్వ ప్రయోజనాలను చాటిచెప్పింది. ఆ గ్రామంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. వ్యవసాయం కుంటుపడింది. నీటి ఎద్దడి కారణంగా అనేక వ్యాధులు ప్రబలాయి. లక్ష్మి బుదులి, నందిని హనంగ నేతృత్వంలో గ్రామంలోని మహిళలు రంగంలోకి దిగారు. నిర్లక్ష్యానికి గురైన చెరువు జలకళ సంతరించుకునేలా చేశారు. ఎన్ని సమస్యలు ఎదురైనా చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, నీటి నిల్వకు అనువుగా మార్చారు. వారి పట్టుదల ఓ ఉద్యమంగా మారింది. మహిళల కృషి, దీక్షను చూసి గ్రామంలోని పురుషులు, యువత కూడా వారితో జత కలిశారు. చెరువును పునరుద్ధరించి, గ్రామానికి అవసరమైన నీటిని పొందారు. ఇప్పుడు అక్కడ పచ్చని పంటలు కళకళలాడుతున్నాయి. మహిళల ఆధ్వర్యంలో పూల తోటలు అందాలు విరజిమ్ముతున్నాయి. ఉమ్మడి నాయకత్వానికి, ఐక్యతకు ఈ కథ ఓ ఉదాహరణగా నిలుస్తుంది.

**ఉమ్మడిగానే సాధికారత**

సాధికారత దిశగా మహిళల ప్రయాణం ఒంటరిగా సాగకూడదు. సంఘటిత శక్తితో, ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటూ, పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగితే ఓ బృందంగా సాధికారత చేకూరుతుంది. అభివృద్ధి సాధ్యపడుతుంది. 'చర్చ' వేదిక వివిధ నేపథ్యాల నుండి వచ్చిన మహిళలను ఏకం చేస్తోంది. సంప్రదింపులు ప్రారంభించడానికి, వాటిని ప్రోత్సహించడానికి కృషి చేస్తోంది. ఇలాంటి వేదికల ద్వారా మహిళలు తమ ఆలోచనలను పంచుకుంటారు. సవాళ్లపై చర్చిస్తారు. పరిష్కారాలను వెతుకుతారు. ఆర్థిక స్వావలంబన అనేది ఓ పజిల్ వంటిది. నిజమైన సాధికారత సాధించాలంటే సమాజంలో వేళ్లూనుకుపోయిన గుర్తింపు, నాయకత్వం, సామాజిక కట్టుబాట్లు వంటి అంశాలను ముందుగా పరిష్కరించుకోవాలి. కాబట్టి సాధికారత అనేది వ్యక్తిగత ప్రయాణం కాదు. అది ఓ ఉమ్మడి కృషి.

**మహిళా సాధికారతకు 'దిశ' కృషి**

మహిళలు గౌరవప్రదంగా తమ సామర్థ్యాన్ని ప్రదర్శించి, సమాజ అభివృద్ధికి దోహదపడేలా చేసేందుకు టాటా స్టీల్ ఫౌండేషన్‌కు చెందిన 'దిశ' అనే సంస్థ నడుం బిగించింది. 2027 నాటికి ఆరు వేల మంది మహిళా నాయకులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వారంతా లింగ సమానత్వం కోసం, సమాజంలో మహిళలకు మెరుగైన భాగస్వామ్యం కల్పించడం కోసం కృషి చేస్తారు. ముఖ్యంగా నాయకత్వం, పరిపాలన, నెట్‌వర్కింగ్... ఈ మూడు అంశాలపై దిశ దృష్టి సారించింది.ఈ మూడింటిలోనూ ప్రతిభ కనబరిచే మహిళలు తన నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంచుకొని వ్యక్తిగత జీవితాలతో పాటు సమాజాలను కూడా సమర్థవంతంగా నడపగలరు. తమ సమాజాల్లో రోల్ మోడల్స్‌గా ఆవిర్భవించగలరు.దిశ చేపట్టే కార్యక్రమాల ద్వారా మహిళలు సమాజంలో, నిర్ణయాలు తీసుకునే సంస్థల్లో వ్యూహాత్మక స్థానాలను పొందుతారు.మానవ హక్కులు,లింగ సమానత్వం, అభివృద్ధికి సంబంధించిన విషయాల్లో ఛాంపియన్లుగా నిలుస్తారు.

**'చర్చ-2024' వేదిక**

ది/నడ్జ్ ఫోరం ఈ నెల 20-22 తేదీల్లో ఏర్పాటు చేసిన 'చర్చ-2024' కార్యక్రమం ఉమ్మడి భాగస్వామ్య వేదిక. పారిశ్రామిక నిపుణులు, భాగస్వాములు దీనికి హాజరై వివిధ అంశాలపై చర్చించారు. 12 అంశాలపై 40 చర్చా గోష్టులు జరిగాయి. వివిధ రంగాలకు చెందిన 20కి పైగా సంస్థలు ఈ కార్యక్రమానికి సహ భాగస్వాములుగా వ్యవహరించాయి.

# సంకుచిత జాతీయవాదం ప్రమాదకరం

- కేరళ సాహిత్య వేత్తల పిలుపు



**కన్నూర్ :** సంకుచిత జాతీయవాద ధోరణుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వుండాల్సిందిగా ప్రగతిశీల చింతనాపరులకు, సాంస్కృతిక కార్యకర్తలకు కేరళ సాహిత్య వేత్తలు పిలుపునిచ్చారు. కన్నూర్‌లోని ఇ.కె.నయనార్ అకాడమీలో పురోగమన కళా సాహిత్య సంగమ్ 13వ రాష్ట్ర మహాసభ మంగళవారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షులు కె సచ్చిదానందన్ మాట్లాడుతూ దేశభక్తి పేరుతో దళితులు, ముస్లిమ్‌లపై హింస పెరగడాన్ని తీవ్రంగా ఖండించారు. సమైక్య హిందూ మతం అన్న భావనను ఆయన సవాలు చేశారు. భారత ప్రజల గురించి చెప్పేందుకు అరబ్బులు, యురోపియన్లు చారిత్రకంగా ఈ హిందూ పదాన్ని వాడేవారని ఆయన పేర్కొన్నారు. విభజించబడిన సమాజంలో ఏక హిందూమత భావన అన్నది అంతర్గతంగా లోపభూయిష్టంగా వుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త పెట్టుబడిదారీవాదం, హిందుత్వల సంకీర్ణమని ఆయన అభివర్ణించారు. ఫాసిజానికి సంబంధించిన అన్ని శక్తులు ఈ కూటమిలో వున్నాయన్నారు. భారతదేశాన్ని స్వేచ్ఛా భూమిగా మార్చేందుకు నిరంతర పోరాటం కొనసాగించాలని, అవిశ్రాంతంగా ప్రతిఘటన చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. భాష, సాహిత్యం, కళా రూపాలను సాధనాలుగా ఉపయోగించుకోవాల్సి వుందన్నారు. వర్గ, నైతిక అసమానతలను ఎదుర్కొనాలని ఆయన సాంస్కృతిక కార్యకర్తలకు పిలుపిచ్చారు. సమాజంలో పురుషాధిక్యత పెరిగిపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొత్తగా తలెత్తుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు సామాజిక వాణిని పరిపుష్టం చేయాల్సి వుందని, అత్యంత అప్రమతంగా వుండాల్సి వుందని ఆయన పునరుద్ఘాటించారు. కేరళవ్యాప్తంగా 3 వేలకు పైగా సాహిత్య సంగమ్ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు, 650 మంది రచయితలు ఈ మహాసభలో పాల్గొన్నారు.

# కరీంనగర్ బీఆర్ఎస్‌లో బీటలు!

**దుమారం రేపిన మేయర్ విదేశీ పర్యటన**

- ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వకపోవడంపై డిప్యూటీ మేయర్ సీరియస్
- బీసీ మహిళ అనే చులకనా? అవినీతి బయటపడుతుందన్న భయమా?
- మాట వరుసకూ చెప్పకుండా సైలెంట్ టూర్‌పై ఆరోపణలు
- ఇరువురి నడుమ నివురుగప్పిన నిప్పులా విబేధాలు
- పదవీకాలం ముగుస్తుండగా.. బహిర్గతమైన అంతర్యుద్ధం



**నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి**

కరీంనగర్ బీఆర్ఎస్‌లో బీటలు వారాయి. మేయర్ వర్సెస్ డిప్యూటీ మేయర్ మధ్య ఫైట్ తారా స్థాయికి చేరింది. మేయర్ సునిల్‌రావు విదేశీ పర్యటనతో మొదలైన దుమారం కాస్త.. ఒకరినొకరు వ్యక్తిగత విమర్శలు చేసుకునే వరకూ వెళ్లింది. మున్సిపల్ యాక్ట్ ప్రకారం మేయర్ 15రోజులు అందుబాటులో ఉండని పక్షంలో ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు ఇవ్వాల్సి ఉండగా.. విదేశీ పర్యటనకు వెళ్తున్నట్టు కనీసం మాట వరుసకూ చెప్పకుండా వెళ్లడంపై డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర అధ్యక్షునిగా ఉన్న తనకూ చెప్పాల్సిన బాధ్యత లేదా? అంటూ ఆమె భర్త హరిశంకర్ ఫైర్ అయ్యారు. బీసీ మహిళననే చులకన, నాలుగన్నరేండ్ల అవినీతి ఎక్కడ బయటపడుతుందోననే భయంతోనే మేయర్ సైలెంట్ టూర్‌కెళ్లారంటూ ఆరోణలు చేశారు. దీనిపై స్పందించిన మేయర్.. పదవీకాంక్ష, తాను లేని సమయంలో అవినీతికి ఆస్కారమిద్దామన్న దురుద్దేశంతోనే తనపై నిందారోపణలు చేస్తున్నారంటూ వీడియో ఫుటేజీ విడుదల చేయడం ఇప్పుడు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా సునిల్‌రావు, డిప్యూటీ మేయర్‌గా ఉన్న చల్లా స్వరూపాణి ఇరువురూ బీఆర్ఎస్‌కు చెందిన నేతలే. నాలుగున్నరేండ్లుగా ఏనాడూ ఇరువురి మధ్య విబేధాలు బహిర్గతం కాకపోగా.. కనీసం పరోక్ష విమర్శలూ చేసుకోలేదు. అయినప్పటికీ ఇరువురు నేతల మధ్య అంతర్యుద్ధం నివురుగప్పిన నిప్పులా రుగులూనే ఉంది. అది కాస్త మేయర్ విదేశీ పర్యటన నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వకపోవడంతో బహిర్గతమైంది. వాస్తవానికి మేయర్ సునిల్‌రావు వ్యక్తిగత పనులపై అమెరికా వెళ్లారు. ఈనెల 23న వెళ్లి.. సెప్టెంబర్ 25న (33 రోజులు) వచ్చేలా ఆయన బుక్ చేసుకున్న టికెట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వివాదం రాజుకుంది. ఆయన తీరుపై సొంత పార్టీ, విపక్ష కార్పొరేటర్లు కూడా విమర్శలు చేశారు. నిబంధనల ప్రకారం.. 14 రోజులు అందుబాటులో ఉండని పక్షంలో తనకు బాధ్యతలు ఇవ్వాలని, కానీ.. తాను బీసీ మహిళను అనే వివక్షతోనే మేయర్ సునిల్‌రావు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వలేదని డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి ఆరోపించారు. అసలు మేయర్ పర్యటనకు అధికారిక అనుమతే లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చట్టం 2009 34(2) ప్రకారం తనకు ఇన్‌చార్జి మేయర్‌గా అవకాశం కల్పించాలని ఫిర్యాదులో విన్నవించారు. మరోవైపు బీసీ సంఘాలు సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాయి. దాంతో మరుసటి రోజే 14రోజుల పర్యటనేనంటూ మేయర్‌కు సంబంధించిన రిటర్న్ టికెట్లు సోషల్ మీడియాలో ప్రత్యక్షం అవడం గమనార్హం.

**వ్యక్తిగత విమర్శలకు వెళ్లిన వివాదం..**

ంంంమంగళవారం మధ్యాహ్నం డిప్యూటీ మేయర్ స్వరూపాణి, ఆమె భర్త బీఆర్ఎస్ నగర అధ్యక్షులు హరిశంకర్ కలిసి మీడియా సమావేశం పెట్టి మేయర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మేయర్ వ్యవహార శైలితో నాలుగున్నర సంవత్సరాలుగా కుమిలిపోయామని, డిప్యూటీ మేయర్‌గా తనకు ఏనాడూ గౌరవం కల్పించలేదంటూ వివరించారు. తమ ఫిర్యాదు నేపథ్యంలో కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన వెంటనే డిప్యూటీ మేయర్ తమ పార్టీయేనని, ఆవిడకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వండని చెప్పాల్సింది పోయి.. తన పర్యటనలో పదిహేను రోజులకు ముందుగానే రిటర్న్ టికెట్స్ బుక్ చేసుకుని రావడం ఏంటని ప్రశ్నించారు. ఆయన వ్యవహారం చూస్తుంటే నగరపాలక సంస్థలో నలుగున్నరేండ్లలో ఎన్ని తప్పులు జరిగాయోనని అనుమనించాల్సి వస్తోందన్నారు. ఇదే సమయంలో సాయంత్రానికి అమెరికా నుంచి మేయర్ ఓ వీడియో ఫుటేజీ ద్వారా తన సందేశాన్ని పంపారు. తన పర్యటన విషయమై పాలకవర్గ సభ్యులకు, కమిషనర్‌కు సహా మీడియా ద్వారా వివరాలు తెలిపే వచ్చానని,పూర్తిగా మున్సిపల్ చట్టం ప్రకారమే తన షెడ్యూల్‌ను రెండు వారాలకు రూపొందించుకున్నానని తెలిపారు. పార్టీలో నగర అధ్యక్షులుగా వ్యవహరిస్తూ.. వారి సతీమణి డిప్యూటీ మేయర్‌గా.. జోడు పదవుల్లో ఉండి కూడా పదవీ వ్యామోహంతో ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు ఇవ్వలేదనే అక్కసుతోనే తనపై నిందారోపణలు చేశారంటూ వివరించారు. ఇన్నాళ్లు పాలకవర్గ సభ్యులను ఏకతాటిపై ఉంచి అధికారులను సమన్వయపరుచుకుని నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతోనే పని చేశానన్నారు. కానీ, 30ఏండ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ తాను పదవుల వెనుక పరుగెత్తలేదని, నమ్ముకున్న పార్టీకి, ఎన్నుకున్న ప్రజలకు నిజాయితీగా సేవలందించానని చెప్పు కొచ్చారు. వారం, పది రోజుల కోసం ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు అప్పగించ లేదనే దిగజారుడు ఆలోచనపై ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ఏదేమైనా ఇన్నాళ్లు ఇరువురి మధ్య ఉన్న అంతర్యుద్ధం కాస్త మేయర్ విదేశీ పర్యటనతో బట్టబయల వడంతో పార్టీ రెండు గ్రూపులుగా వీడిపోవడం ఖాయమనే సంకేతాలు వినిపిస్తున్నాయి.

## బెంగాల్ సచివాలయ ముట్టడి ఉద్రిక్తం

- విద్యార్థుల నిరసనలపై పోలీసుల జులుం



**కొల్‌కతా :** మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'చలో సచివాలయం' కార్యాక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కొల్‌కతాలో 'పశ్చిమబంగ ఛాత్ర సమాజ్' అనే విద్యార్థి సంఘం మంగళవారం చేపట్టిన ఈ ఆందోళనలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. సచివాలయం వైపు ప్రదర్శనగా వెళుతున్న విద్యార్థులను హౌరా బ్రిడ్జి వద్ద అడ్డుకునేందుకు నీటి ఫిరంగులు, భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. అంతకుముందు విద్యార్థులు పెద్ద సంఖ్యలో కాలేజ్ స్క్వేర్ వద్దకు చేరుకున్నారు. అయితే నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. సచివాలయానికి వెళ్లే దారులన్నింటినీ దిగ్బంధించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, వేలాది మంది పోలీసులను మోహరించారు. రోడ్లపై వాహనాలను, కంటైనర్లను అడ్డు పెట్టారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత, రక్షణ కల్పించడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విద్యార్థులు ఆరోపించారు. ఆందోళనకారులు ఉత్తర కోల్‌కతాలోని కాలేజ్ స్క్వేర్, హౌరాలోని సంత్రాగచి నుంచి రెండు బృందాలుగా ప్రదర్శనకు బయలుదేరారు. భద్రతాదళాలు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించుకొని ముందుకు వెళ్లేందుకు ప్రదర్శనకారులు ప్రయత్నించగా పోలీసులు వాటర్ క్యానన్లు ప్రయోగించారు. కాగా ర్యాలీ నిర్వహించకుండా విద్యార్థులను అడ్డుకోవద్దని రాజ్‌భవన్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించింది. నిరసన ప్రదర్శనను అడ్డుకోవడానికి బలప్రయోగం జరపాల్సిన అవసరమేమిటో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి అన్నారు. విద్యార్థులపై పోలీసుల అణిచివేత చర్యలను వ్యతిరేకిస్తూ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 12 గంటల పాటు సమ్మె చేపట్టాలని బిజెపి పిలుపునిచ్చింది. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి సుఖాంత మజుందార్ పిలుపునిచ్చారు. అయితే బిజెపి సమ్మెకు పిలుపునివ్వడంపై అధికార తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సమ్మెకు పిలుపునివ్వడం రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే బిజెపి కుట్ర పూరిత వ్యూహానికి నిదర్శనమని అధికార తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. మరోవైపు వైద్య విద్యార్థిపై హత్యాచారం కేసులో కొల్‌కతా నగర అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనూప్ దత్తాకు కూడా పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో సాక్ష్యాధారాలు వెలుగులోకి రాకుండా ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి అనూప్ సహకరించినట్లు సిబిఐ ఆరోపిస్తోంది.

## వీసీల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలి

- ఉన్నత విద్యామండలి చైర్మెన్‌కు జాజుల వినతి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో త్వరలో నియమించబోయే విశ్వవిద్యాలయాల వీసీల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రిని మంగళవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు జనాభా దామాషా ప్రకారం వీసీలను కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీసీల నియామకాల్లో వారికి సముచిత స్థానం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మధు యాదవ్, సంపత్, సమత యాదవ్, శ్యామల, దేవిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## జెరెమియా బ్రెంట్‌తో వెల్‌స్పన్ భాగస్వామ్యం

**హైదరాబాద్ :** టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన అంతర్జాతీయ తయారీదారు వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ తాజాగా క్వీర్ ఐకి చెందిన జెరెమియా బ్రెంట్‌తో నూతన భాగస్వామ్యం చేసుకున్నట్లు వెల్లడించింది. తద్వారా టెక్స్‌టైల్ ఫర్నిషింగ్స్ కలెక్షన్ ఆవిష్కరించనున్నట్లు పేర్కొంది. ఈ ఉత్పత్తుల్లో పడక గదులు, స్నానపు సూట్ తదితర ఉత్పత్తుల శ్రేణిని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. న్యూయార్క్ నగరంలో వచ్చే సెప్టెంబర్ 16-19న జరుగబోయే హోమ్ ఫ్యాషన్ ప్రొడక్ట్స్ అసోసియేషన్ (హెచ్ఎఫ్‌పిఎ) ఉత్పత్తి శ్రేణిని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది.